ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-10-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 252 పేజీలు: 8+16 వెల: 6.50

ఎన్డీయేలో కుదిరిన సీట్ల సర్దుబాటు 5
రైళ్లలో రహస్యంగా గంజాయి రవాణా 6



ఆదివారం తుంగతుర్తిలో దామోదర్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు

## ఎస్సారెస్పీ స్టేజ్-2కు దామోదర్ రెడ్డి పేరు

### సంతాప సభలో ప్రకటించిన సిఎం రేవంత్ రెడ్డి

**నడిగూడెం,(సూర్యాపేట) అక్టోబరు 12 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అంటే ప్రాణం. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం కాంగ్రెస్ లోనే గడిపాడు. కరుడుగట్టిన కాంగ్రెస్ వాది. నమ్మిన సిద్ధాంతం కోసం పని చేశారు. రాజకీయాల్లో ఎన్నడూ వెను తిరగలేదు. పార్టీ కార్యకర్తలంతా తన కుటుంబ సభ్యులుగా భావించి వెన్నంటి ఉన్నాడు. పార్టీ శ్రేణుల్లో మొక్కవోని ధైర్యాన్ని నింపాడు. పార్టీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేశారు. ఎన్నో అవాంతరాలను అధిగమించాడు. అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి రాజీలేని పోరాటం చేశాడు. కమ్యూనిస్టులను ఎదిరించి >>2

# కోటా పోరు 'సుప్రీం'కు

### నేడు ఎస్ఎల్‌పి దాఖలు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

### పిటిషన్ సిద్ధం చేసిన ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ




### మంత్రులు పొన్నం, శ్రీహరి, పిసిసి చీఫ్ ఢిల్లీ పయనం

### ఎన్నికల నిర్వహణపై ఇసి తర్జనభర్జన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు12:** తెలంగాణ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. బీసీ రిజర్వేషన్ల జీవో 9పై హైకోర్టు స్టే విధించడంతో, ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో 9పై హైకోర్టు స్టే విధించడాన్ని వ్యతిరేకిస్తూ ఆ తీర్పును సవాలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును సుప్రీంకోర్టులో దాఖలు చేసేందుకు మంత్రులు పొన్నం, వాకిటిని ఢిల్లీకి పంపేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ముగ్గురు నేతలు సోమవారం ఢిల్లీలో ఉండనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. బిసి రిజర్వేషన్లపై హైకోరు స్టే విధించడంతో సోమవారం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఒక రోజు ముందు సిఎం రేవం త్‌రెడ్డి, ఏఐసిసి నాయకురాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీ నాక్షి నటరాజన్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ ఇంకా పలువురు మంత్రులు జూమ్ మీటింగ్ ద్వారా చర్చించారు. సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్విని కూడా జూమ్ మీటింగ్‌లోకి తీసుకుని అభిప్రాయాన్ని తీసుకున్నారు. రిజర్వేషన్లపై ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సుప్రీం కోర్టును ఆశ్రయించాలని వారు ని ర్ణయించారు. సోమవారం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై, నా మినేషన్ల దాఖల వుతున్న సమయంలో హైకోర్టు జోక్యం చేసుకుని స్టే విధించడం సరైంది కాదని, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 9 ప్రకారం ఎన్నికల ప్రక్రియ కొనసాగించుకోవడానికి అనుమతించాలని సుప్రీంకోర్టులో కోరాలని నిర్ణయించారు. స్టేని ఎత్తివేయించగలగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ సీట్లను సునాయసంగా కైవసం చేసుకోవడానికి మార్గం సుగ మం అవుతుందని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. ప్రముఖ న్యాయవాది అభిషేక్ >>2




## ఆర్టీఐని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

### యుపిఎ చేసిన చట్టాల పరిరక్షణకు జనం కదలాలి

### గ్రామీణ ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ తెచ్చినదే: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్,అక్టోబరు 12,ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టం -2005 ను బిజెపి సర్కార్ నిర్వీర్యం చేసి ప్రజలకు ఉండే ప్రజాస్వామిక హక్కులను లేకుండా చేయాలనే కుట్రలు చేస్తోందని టిపిసిసి ప్రసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. గాంధీభవన్ లో ఆయన మాట్లాడుతూ యుపిఎ హయంలో సోనియా గాంధీ దూరదృష్టితో ఆలోచించి చారిత్రాత్మక చట్టాలు అమల్లోకి తీసుకొచ్చారని కొనియాడారు.డా. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి చేత చారిత్రాత్మక సమాచార హక్కు చట్టంను సోనియాగాంధీ చలువతో 2005 అక్టోబర్ 12న అమలులోకి వచ్చిందని అన్నారు. నేటితో ఆర్‌టిఐచట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్ళు అవుతోందని అన్నారు. దేశ చరిత్రలో ఆర్‌టిఐ చారిత్రాత్మక నిర్ణయమని, ప్రజలకి వాస్తవాలను తెలుసుకోవడానికి మహత్తర అవకాశం ఆర్‌టిఐ ద్వారా కల్పించారని చెప్పారు. ఆర్‌టిఐ చట్టం పేద, అణగారిన వర్గాలకు జీవనరేఖగా మారడంతోసరుకుల పంపిణీ, పెన్షన్‌లు, బకాయిలు, స్కాలర్‌షిప్‌లు వంటి హక్కులను సాధించుకునే శక్తిని ప్రజలకు ఇచ్చిందని అన్నారు. గ్రామీణులకు వందరోజులు ఉపాధి కోసం అప్పటి యుపిఎ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 2005లో తీసుకొచ్చిదని ఆయన చెప్పారు.ఈ చట్టం ప్రజలకు ప్రభుత్వ విభాగాల సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చి పాలనలో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానాన్ని తీసుకొచ్చింది.యుపిఎ కాలంలో అనేక చట్టాలు ప్రజల మౌళిక జీవనవిధానం మార్పు చెందేలా చట్టలు చేశామని అందులో అటవీ హక్కుల చట్టం (2006),విద్య హక్కు చట్టం (2009), భూసేకరణ న్యాయమైన పరిహారం చట్టం (2013), ఆహార భద్రత చట్టం (2013) లతో చట్టాలు ప్రజలకు సంపూర్ణ హక్కులను యుపిఎ ప్రభుత్వం కల్పించిందని వివరించారు.2014లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్‌టిఐ తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. 2019 సవర ణలతో సమాచారం కమిషన్ల స్వతంత్రతను >>2

## ఇక చలికూడా ఎక్కువే

### లా నినా ఎఫెక్ట్‌తో వణికిపోనున్న జనం



**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** లా నినా కారణంగా ఈ ఏడాది భారత్‌లో తీవ్రమైన చలికాలం రాబోతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు అనేక దక్షిణ, పశ్చిమాది రాష్ట్రాలలో ఈ ఏడాది వర్షాకాలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడం తో రాబోయే చలికాలంలో చలి తీవ్రత ఎక్కువగా వుండే వీలుందని వారంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇప్పటికే ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల కంటే తక్కువగా వుండడాన్ని వాతావరణ శాఖ అధికారులు ఉదహరిస్తున్నారు. దీంతో పాటు శీతల >>2

## రేపటి రాష్ట్ర బంద్ 18కి వాయిదా

### బిసి రిజర్వేషన్ల ఉద్యమ ఉధృతికి జెఎసి ఆవిర్భావం

### చైర్మన్‌గా ఎంపి కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతంచేసి ఎవరికివారుగా కాకుండా ఐక్యంగా ముందుకు తీసుకుపోవడానికి బిసి ఐక్య కార్యాచరణ కమిటీ -బిసి జెఏసి ఏర్పాటైంది. హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో గుజ్జకృష్ణ అధ్యక్షతన బిసి సంఘాలు, కులసంఘాలు, మేధావులు, ఉద్యోగులు సమావేశమై బిసి రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం, సుప్రీం కోర్టు ద్వారా అడ్డుకోవాలని ఇప్పటికే రెడ్డి జాగృతి నేతలు ప్రయత్నిస్తుండడంతో రాష్ట్రంలో ప్రముఖంగా ఉద్యమించే బిసి సంఘాలు సమావేశమై ఉమ్మడి ఎజెండాతో బిసి జెఏసి ఏర్పాటు ద్వారా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని >>2

## కష్టపడి పనిచేస్తే నాపై కుట్రా?

### కులం ఆధారంగా విమర్శిస్తే సహించను



### మంత్రి అడ్లూరిపై మంత్రి వివేక్ వెంకటస్వామి ఫైర్

### నీ కొడుకును ఎంపీగా మేం గెలిపించలేదా: అడ్లూరి

### మరో ఇద్దరు మంత్రుల నడుమ మొదలైన 'వార్'

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు12:** మొన్నటి వరకు మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మధ్య లడాయి సాగగా, నిన్నటి నుంచి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మధ్య వార్ నడుస్తోంది. ఈ సమస్య సమసిపోలేదు, ఈ పంచాయతీ ఢిల్లీ పెద్దల దాకా వెళ్లింది. ఈ ఏపిసోడ్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. కాగా, ఆదివారంనాడు మంత్రి వివేక్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య వార్ ప్రారంభమైంది. సోషల్ మీడియాలో తనను కొంతమంది టార్గెట్ చేశారని మంత్రి వివేక్ వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిగా తాను ఎంతో కష్టపడి పనిచేస్తునప్పటికీ కులం ఆధారంగా కుట్రలు, విమర్శలు చేస్తున్నారని వాపోయారు. ఆదివారం నిజామాబాద్‌లో మాలల ఐక్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని ప్రసంగించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ని కొంతమంది రెచ్చగొట్టి తనపై విమర్శలు చేయించారని ఆందోళన వ్యక్తం చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి.జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే తనకు మంచిపేరు వస్తుందని కొంతమంది విమర్శలు చేసున్నారని చెప్పుకొచ్చారు. లక్ష్మణ్ తనపై ఎందుకు విమర్శలు చేస్తున్నారో అర్థం కావడం లేదని తెలిపారు. హైదరాబాద్ నగరంలో జరిగిన ఓ సమావేశానికి లక్ష్మణ్ వచ్చినప్పుడు తాను వెళ్లిపోతున్నానని అనటం అబద్ధమని పేర్కొన్నారు. తాను మాల జాతి అని లక్ష్మణ్ విమర్శలు చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తనకు మంత్రి పదవిపై మోజు లేదని స్పష్టం చేశారు. లక్ష్మణ్‌ని రాజకీయంగా ప్రోత్సహించింది >>2

### జనగామలో రిమాండ్

## ఖైదీ మృతి

### అధికారుల నిర్లక్ష్యమేనని కుటుంబ సభ్యుల ఆందోళన




మృతుడు వారాల మల్లయ్య (ఫైల్)

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ:** సబ్‌జైల్లో రిమాండ్‌లో ఉన్న ఖైదీ మృతిసంఘటన పట్ల జనగామ జిల్లాకేంద్రం ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురైంది. కాగా, ఖైదీ మృతికి జైలు అధికారుల నిర్లక్ష్యమే కారణ మంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. సంఘటనకు సంబంధించి మృతుడు వారాల మల్లయ్య (42) భార్య వారాల హైమ పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి చెందిన వారాల మల్లయ్య కూలీ పనిచేసుకుంటూ జీవించే వాడని, కాగా కొద్దిరోజుల క్రితం స్థానిక వడ్రంగి అయిన సడకంటి బ్రహ్మాచారితో ఇంటివద్ద జరిగిన చిన్న తగాదాతో తన భర్త మల్లయ్యపై బ్రహ్మాచారి చేసిన ఫిర్యాదు మేరకు దేవరుప్పుల పోలీసులు కస్టడీలోకి తీసుకుని జిల్లా జైలుకు ఈనెల 8వ తేదీన తరలించారన్నారు. కాగా, ఈనెల 11న (శనివారం) మల్లయ్య విషం కారణంగా ప్రమాదకర స్థితిలో చావుబతుకుల మధ్య ఉన్నాడని, జనగామ >>2



### టీచర్లతో ఏర్పాటు

### స్కూళ్ల తనిఖీలకు

## కమిటీలు

### పిఎస్, యుపిఎస్, హైస్కూళ్లకు వేర్వేరు

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 12:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల తనిఖీలకు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని 24,246 పాఠశాలల్లో తనిఖీలకు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఉపాధ్యాయులతో ఈ కమిటీలను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ జిల్లా విద్యాధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల తనిఖీలకు వేర్వేరుగా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల ప్రాథమిక,ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడానికి జిల్లా స్థాయిలో ప్యానెల్ తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తనిఖీ బృందం ప్రతి త్రైమాసికం(3 నెలల్లో)లో 100 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను, 50 ఉన్నత పాఠశాలలను తనిఖీచేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల తనిఖీ కోసం ఏర్పాటు చేయవలసిన బృందాల సంఖ్య జిల్లాలో ఉన్న పాఠశాలల సంఖ్యను బట్టి నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 16,474 ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీలకు 168 కమిటీలను, 3100 ప్రాథమికోన్నత పాఠశాలల తనిఖీలకు 35 కమిటీలను, అలాగే 4672 ఉన్నత పాఠశాలల తనిఖీల కోసం 96 కమిటీలను >>2

### పోలీసు శాఖలో

## 17 వేల పోస్టులు

### త్వరలో నోటిఫికేషన్ జారీ




**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో ఖాళీగా వున్న 17 వేల పై చిలుకు పోస్టుల భర్తీకి సర్కారు సన్నాహాలు చేబట్టింది. ఖాళీ ల భర్తీకి సంబంధించి పోలీసు శాఖ నుంచి ఇప్పటికే సర్కారుకు ప్రతిపాదనలు అందినట్లు సమాచారం. దీనికి ఆర్థిక శాఖ నుంచి ఆమోదం లభించ గానే భర్తీ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడే వీలుంది. తెలంగాణ ఏర్పడిన తరువాత నాలుగవసారి జరిగే భర్తీలు ఇవి. ఇంతకు ముం దు మూడుసార్లు భర్తీలు జరగగా ప్రతీసారి 16 వేల పై చిలుకు పోస్టులను భర్తీ చేశారు. అయితే ఈసారి జరిగే భర్తీల తరువాత ఇకముందు ప్రతీ ఏ డాది పోలీసు భర్తీలు జరపాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. గతంలో ప్రతీ ఏడాది జూన్ నెలలో పోలీసు భర్తీలు >>2

## మిల్లర్ కనికట్టు.. కోటిన్నర హాంఫట్టు!

### రైతులు లేరు.. ధాన్యం దిగుబడీ లేదు

### వ్యవసాయాధికారులు, ఐకెపి సెంటర్ నిర్వాహకులతో కలిసి దగా

### 7 నుంచి రూ.22 లక్షల దాకా పంచుకున్న అక్రమార్కులు



**హైదరాబాద్, అక్టోబరు 12,ప్రభాతవార్త:** వ్యవసాయోత్పత్తుల సేకరణలో లొసుగులను తమకు అనకూలంగా మలుచుకొని రైస్‌మిల్లరు బెజ్జంకి శ్రీనివాస్ కనికట్టు చేసి 12 మంది కృత్రిమ రైతులను సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసి రూ. 1,86,63, 088 రూపాయలను దోచుకున్న సంఘటన హన్మకొండ జిల్లా శాయంపేటలో వెలుగులోకి వచ్చింది. రైసుమిల్లర్లు ఐకెపి సెంటర్ల నిర్వహకులు అధికారులు కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అక్రమదందాకు తెరలేపి ఉంటారని సివిల్ సప్లయ్ విజిలెన్స్ విభాగం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళినట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ తనిఖీలు చేపట్టాలని సిఎం ఆదేశాలు జారీచేయడంతో ధాన్యం సేకరణ తీరుపై నిఘా బృందాలు కదులుతున్నాయి. తాజాగా కుంభకోణం వెలుగులోకి వచ్చిన కమలాపూర్‌లోని సాంబశివ మిని మాడ్రన్ రైస్ మిల్లు కేంద్రంగా బెజ్జంకి శ్రీనివాస్ అనే >>2



ఆదివారం జైలు వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

# రిమాండ్ ఖైదీ మృతి

>> ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం అందచేశారన్నారు. కాగా, అక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా శనివారం సాయంత్రం మరణించినట్లు తెలిపారు. తన భర్త మల్లయ్య అనూహ్యంగా మరణించడంపట్ల పూర్తిబాధ్యత జైలు అధికారులు, సిబ్బందే కారణమని మల్లయ్య భార్య హైమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, ప్రస్తుతం తాను ఐదునెలల గర్భవతినని, కడుపేదరికంలో జీవించే తాము కూలీపనిచేసుకుంటు జీవనోపాధి వెళ్లదీస్తున్నామని, తన భర్త మల్లయ్య మరణంతో తమ కుటుంబం దిక్కుతోచని స్థితిలో వీధినపడిందన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన చిన్న ఘర్షణపై పోలీసుల అత్యుత్సాహంతో తనభర్తను జైలుకు పంపించడమే కాకుండా జైలులో నా భర్త చనిపోవడానికి, తమ కుటుంబం రోడ్డున పడడానికి ముఖ్య కారణం అన్నారు. ఈవిషయమై ఉన్నతాధికారులు పూర్తి విచారణ చేపట్టి వెంటనే జైలు అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు తన భర్త పోస్టుమార్టంను ఉన్నతాధికారుల సమక్షంలో పూర్తిగా వీడియో రికార్డు మధ్య జరిపి తన భర్తకు గల కారణాలు తెలియచేయడంతోపాటు తమ కుటుంబానికి న్యాయం చేయాలని బాధితురాలు హైమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

**సబ్‌జైలుముందు ధర్నా**

సబ్‌జైలులో ఆత్మహత్యాయత్నంచేసిన మల్లేష్‌ను గుట్టుచప్పుడు కాకుండా చికిత్సకోసం జైలు అధికారులు తరలించడంపట్ల, అతడి మృతిడికి వారి నిర్లక్ష్య వైఖరిపట్ల కుటుంబ సభ్యులు, బంధువులు సబ్‌జైలుముందు ఆదివారం సాయంత్రం వరకు కూడా ఆందోళన చేపట్టారు.

# నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

>> బలహీనపరిచాయని విమర్శించారు. కమిషనర్ల పదవీకాలం (5 సంవత్సరాలు) సేవా షరతులను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించేలా మార్పులు జరిగాయని అన్నారు. స్వయం ప్రతిపత్తి తో నిర్వహించే ఆర్‌టిఐ కమిషనర్లు కేంద్రం ఒత్తిడిలకు తల్లోగే పరిస్థితి సృష్టించారు. 2023 - డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం: ఆర్‌టిఐ సెక్షన్ 8(1)(జె)లో సవరణలతో వ్యక్తిగత సమాచారం అనే నిర్వచనం విస్తరించారన్నారు. ప్రజాప్రయోజనం ఉన్నప్పటికీ" ఇంతకు ముందు వెల్లడించగలిగే సమాచారాన్ని ఇప్పుడు పూర్తిగా మినహాయింపుగా ప్రకటించారని చెప్పారు. దీని వల్ల ఓటరు జాబితాలు, ప్రభుత్వ నిధుల వినియోగం, ఖర్చుల వివరాలు లాంటి ప్రజా ప్రయోజన సమాచారం దాచిపెట్టే అవకాశం పెరిగిందని పారదర్శకత లేకుండా పోయిందని ఆవేదన చెందారు. కేంద్ర సమాచారం కమిషన్ ప్రస్తుతం 11 పోస్టులకు బదులుగా కేవలం 2 కమిషనర్లతోనే పనిచేస్తోందని తెలిపారు. 2025 సెప్టెంబర్ తర్వాత చీఫ్ కమిషనర్ పదవి కూడా ఖాళీగా ఉంటుందని ఇంతకంటే దుర్మార్గం లేదని వ్యాఖ్యానించారు. భోపాల్‌కు చెందిన పర్యావరణ కార్యకర్త షెహ్లా మసూద్ అక్రమ మైనింగ్ బహిర్గతం చేస్తూ ఉండగా ఇంటి వద్దే కాల్చి చంపబడ్డారని ఆయన ఆవేదన చెందారు. ఇలాంటి ఘటనలు ఆర్‌టిఐ యాక్టివిస్టులలో భయాన్ని పెంచాయనీ అన్నారు. సమాజంను అప్రమత్తపరిచే(విజిల్‌బ్లోయర్) ప్రొటెక్షన్ చట్టంను యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టి పార్లమెంట్ ఆమోదించినప్పటికీ 2014 నుండి ఇప్పటి వరకు అమలు కాలేదని మండిపడ్డారు. కేంద్రంలోని ఫాసిస్టు బిజెపి ప్రభుత్వ అవినీతిని బహిర్గతం చేసే వ్యక్తులు రక్షణ లేకుండా దాడులు, వేధింపులకు గురవుతున్నారు. 2019 సవరణలను రద్దు చేసి కమిషన్ల స్వతంత్రతను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. డిపిడిపిచట్టంలోని ఆర్‌టిఐ నుంచి బలహీనపరిచే సెక్షన్ 44(3) సవరణలను పునఃపరిశీలించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జనరల్ సెక్రటరీలు అల్లం భాస్కర్, మధు సత్యం గౌడ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు శాఖలో 17 వేల పోస్టులు

>> నిర్వహించే వా రు. దీనివల్ల ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ అవడంతో పాటు కొత్త సిబ్బంది చేరుతుండడంతో పోలీసు శాఖలో యువకుల సంఖ్య సమతుల్యంగా వుండేది.

రాష్ట్రంలో నిరుద్యోగులకు సర్కారు త్వరలో తీపి కబురు అందించనుంది. పోలీసు శాఖలో ఖాళీగా వున్న 17 వేల పై చిలుకు పోస్టులను నెల లే దా రెండు నెలలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ వెలువడే వీలుంది. పోలీసు శాఖలో ఖాళీగా వున్న పోస్టుల్లో సివిల్ కానిస్టేబుళ్ల ఆరు వేల వరకు వు ండగా స్పెషల్ పోలీసు కానిస్టేబుళ్ల ఆరు వేల వరకు వున్నాయని తెలిసింది. దీంతో పాటు సాయుధ బలగంలో రెండు వేల వరకు కానిస్టేబుళ్ల పో స్టులు ఖాళీగా వుండగా వీటితో పాటు 1200 ఎస్‌ఐ పోస్టులు కూడా భర్తీ కానున్నాయి. వీటితో పాటు అంబర్‌పేట్‌లోని స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వ్ బ లగం, పోలీసు రవాణా, కమ్యూనికేషన్స్ విభాగం, ఐటి. ఫింగర్ ప్రింట్ బ్యూరో, ఫైర్ సర్వీస్, జైళ్ల శాఖ ఖాళీలు మరో రెండు వేల వరకు వుండే వీలుంది. అన్ని పోస్టులు కలిపి 16 వేల పై చిలుకు వుండే వీలుంది. పోలీసు శాఖలో ఖాళీగా వున్న పోస్టులో ఐదు వేలకు పైగా హైదరాబాద్ పోలీ సు విభాగంలో వుండగా సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో మరో వెయ్యికి పైగా వున్నాయి. స్పెషల్ పోలీసు విభాగంలోనూ భారీగా ఖాళీ వు న్నాయి. వాస్తవానికి ఈ ఖాళీలన్నీ గత ఏడాది భర్తీ చేయాలని అనుకున్నా అనేక కారణాల వల్ల సాధ్యపడలేదు.

**పోలీసు నియామక మండలి సవ్యంగా వ్యవహారించేనా...?**

ఇదిలావుండగా పోలీసు భర్తీలను పోలీసు నియామక మండలి చేబడుతుండడం తెలిసిందే. అయితే నియామక మండలి ఒంటెద్దు పోకడలపై అనేక వర్గాల నుంచి విమర్శలు వున్నాయి. భర్తీల గురించి, దేహదారుఢ్య పరీక్షలు, క్రీడాంశల పోటీల పోటీలు, అంతకు ముందు జరిపే పరుగు పందెం పోటీల వివరాలను ముందుగానే స్పష్టంగా వెల్లడించకుండా కొన్ని ప్రసార మాధ్యమాలకు నియామక మండలి నుంచి లీకులు రావడంపై విమర్శలు వున్నాయి. గతంలో జరిగిన భర్తీలపై దీనికి సంబంధించి అభ్యర్థులు ఏకంగా హోం శాఖకే ఫిర్యాదు చేశారు. ఇక దీని తరువాత ఎస్‌సి, ఎస్‌టి, లోక ల్ అభ్యర్థులు, మహిళా అభ్యర్థుల ఎంపికలో ప్రతీసారి నియామక మండలి సవ్యంగా వ్యవహరించక పోవడంతో అనేక మంది కోర్టులను ఆశ్రయించి పోలీసు ఉద్యోగాలు పొందిన ఉదంతాలున్నాయి. దీంతో పాటు కొందరు నాన్ లోకల్ అభ్యర్థుల విషయంలో నియామక మండలి సవ్యంగా వ్యవహరించలేదనే విమర్శలు వున్నాయి. ఇక ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు గతంలో జరిగిన భర్తీల సమయంలో అన్ని పరీక్షలు ఉత్తీర్ణులైన తరువాత సర్టిఫికే ట్ల పరిశీలన సమయంలో ఇంటర్ పాస్ కాలేదన్న కారణంగా ఉద్యోగాల్లోకి తీసుకోలేదు. దీనిపై నియామక మండలి వితండ వాదనపై నిరుద్యోగులు భగ్గుమన్నారు. తమ నుంచి ముందుగానే ఫీజు తీసుకుని, అన్ని పరీక్షలకు పిలిచి తీరా ఉత్తీర్ణులయ్యాక ఇలా చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. దీనిపై కొందరు కోర్టులను ఆశ్రయించారు.

# కష్టపడి పనిచేస్తే నాపై కుట్రా?

>> తన తండ్రి కాకా వెంకటస్వామినే అనే విషయం మర్చిపోతున్నారని తెలిపారు. తనమీద ఎందుకు ఇంత ఈర్ష్య అని.. తాను అందరితో కలిసికట్టుగా ఉంటానని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మాలల జాతి కోసం కొట్లాడుతున్నాం, కొట్లాడితేనే హక్కులు వస్తాయి, కలిసి ఉంటేనే కుల వివక్షను ఎదుర్కొగలమన్నారు. నేను ఎప్పుడు న్యాయంవైపు ఉంటాను, కష్టపడి పనిచేస్తున్న నాపై కొందరు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. నిజాయితీగా వ్యాపారం చేయమని మా నాన్న కాకా వెంకటస్వామి నాకు చెప్పారు. నాకు ఎలాంటి అహంకారం లేదు, నిస్వార్థంగా సేవ చేస్తానన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఎందుకు తనను టార్గెట్ చేసి విమర్శిస్తున్నాడో అర్థం కావడం లేదని అన్నారు. లక్ష్మణ్‌కు నాపై ఎందుకంత ఈర్ష్య అని ప్రశ్నించారు. కష్టపడి పనిచేస్తున్న నాపై కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో జరిగిన మాలల గర్జన వల్ల మాలల్లో ఐక్యత పెరిగింది. దేశంలో ఒక సామాజిక వర్గానికి చెందిన సభ అంత పెద్దగా జరగటం ఇదే మొదటిసారి. మాలల కోసం పోరాటం చేస్తుంటే కొందరు కుట్రలతో సోషల్ మీడియా వేదికగా తనను అవమానించే ప్రయత్నం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ 15 నుంచి 18 శాతానికి పెంచాలని తీర్మానం చేశాం, కానీ అలా జరగలేదు అన్నారు. రోస్టర్ విధానంలో మాలలకు అన్యాయం జరిగింది. పోరాడితేనే ఫలితాలు వస్తాయి. దేశంలో ఇంకా కులవివక్ష ఉంది. మాల ఉద్యోగులకు వేధింపులు తప్పటం లేదు. మంత్రిగా నా పని నేను చేసుకుంటూ పోతున్నా. ఆయన నా మీద కావాలనే విమర్శలు చేస్తున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అంశంలోనూ అనవసరంగా నా పేరు ప్రచారం చేశారు. మంత్రి అడ్లూరిని రాజకీయంగా ప్రోత్సహించింది కాకా. మంత్రి అడ్లూరిని కావాలనే నా మీద విమర్శలు చేస్తున్నారు అని వివేక్ ఆరోపించారు. వివేక్ వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందించారు. ఆదివారం సాయంత్రం ఆయన ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడుతూ ముగిసిన వివాదాన్ని వివేక్ మళ్లీ తెరమీదకు తెస్తున్నారు. ఇక నేను ఏం మాట్లాడను... వివేక్ అంశాన్ని అధిష్టానం చూసుకుంటుంది. వివేక్ వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా... వివేక్ కొడుకును ఎంపీగా గెలిపించింది ఎవరో ఆయనకు కూడా తెలుసు.. ఎవరు ఎవరిని అవమానిస్తున్నారో చర్చకు సిద్ధం అని వివేక్‌కు అడ్లూరి లక్ష్మణ్ సవాల్ చేశారు. మాలలను గౌరవించిందెవరో అందరికీ తెలుసు అని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

13-10-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
సప్తమి మ.11.29
ఆరుద్ర మ.12.30
వర్జ్యం : రా.12.14-1.48
దు.మ.12.18-మ.1.05,
2) మ.2.40-3.27
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. ప్రయాణాలు.

**వృషభం:** సంక్షేమ సంఘాల వలన లాభపడతారు. వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి.

**మిథునం:**వ్యాపార విస్తరణకు నిపుణులతో చర్చించి కార్యాచరణలో కొంత అభివృద్ధిని సాధిస్తారు.

**కర్కాటకం:**చాలా కాలంగా పరిష్కారము కాని కుటుంబ సమస్యలు పరిష్కారమవుతాయి.

**సింహం:**వృత్తి ఉద్యోగాలలో ఎక్కువ శ్రద్ధ కనబరచి అనుకూల ఫలితాలు సాధిస్తారు.

**కన్య :** మీ క్రింది స్థాయి ఉద్యోగులు మీపై కొండెములు చెప్పడం మీకు తలనొప్పిగా మారుతుంది.

**తుల :** ఉత్తర ప్రత్యుత్తరములకు, ప్రకటనలకు వారితో సంబంధ బాంధవ్యములు పెంచుకొనులుకు అనుకూలం.

**వృశ్చికం:**విచారణలు, సంప్రదింపులు, సంభాషణలు, సందర్శనాలు అనుకులిస్తాయి.

**ధనుస్సు:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి.

**మకరం:** ఇంటా బయటా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**కుంభం:** ఆప్తుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు.

**మీనం :** సన్నిహితుల సహాయ సహకారాలతో ఇంటియందు శుభకార్యం నిర్వహిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎస్సారెస్పీ స్టేజ్-2కు దామోదర్ రెడ్డి పేరు

>> కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. 40 సంవత్సరాల రాజకీయ జీవిత చరిత్రలో పార్టీ కోసం కార్యకర్తలు ప్రజల సంక్షేమానికి ఆస్తులను సైతం కరగపెట్టుకొని నమ్మిన సిద్ధాంతం కోసం పార్టీకి సర్వం త్యాగం చేసిన గొప్ప నాయకుడు మాజీ మంత్రి టైగర్ రామ్ రెడ్డి దామోదర్ రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంలో ఆదివారం జరిగిన దామోదర్ రెడ్డి సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా దామోదర్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వేలాది ఎకరాల భూములను త్యాగం చేశారని, తన భూములను అత్తింటి వారిచ్చిన భూములను సైతం పేదలకు దానం చేశారని అన్నారు. కార్యకర్తలకు కష్టం వస్తే తన కష్టంగా భావించి ఆదుకున్నారని ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఆయన చేసిన సేవ ఎనలేనిది అన్నారు. పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందని ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. తుంగతుర్తి ప్రాంతంలో కమ్యూనిస్టులు బలంగా ఉన్న సమయంలో ధైర్యంగా నిలబడి పోరాడడంతోపాటు పార్టీ ఉనికిని నిలబెట్టారని కార్యకర్తలకు అండగా నిలిచారన్నారు. రాజకీయ కక్షలు, దాడులు, భయాందోళనకరమైన రాజకీయ పరిస్థితులు ఏర్పడ్డ సమయంలో కూడా విపత్కర పరిస్థితులను ఎదుర్కొని నిలబడ్డ దామోదర్ రెడ్డి ఆశలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కు కేరాఫ్ రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న ప్రజల కష్టాలను గుర్తించి సమస్య పరిష్కారానికి నడుం బిగించారన్నారు. పేద ప్రజలకు అండగా నిలబడి ఫ్లోరైడ్ సమస్య నుంచి గట్టెక్కించారని పేర్కొన్నారు. ఫ్లోరైడ్ సమస్యతో నిర్మానుష్యంగా మారిన ప్రాంతాలను సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో దామోదర్ రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన కృషి ఫలితంగానే గోదావరి జలాలు తుంగతుర్తి ప్రాంతానికి అందుతున్నట్లు ఎడారిగా ఉన్న ప్రాంతం సస్యశ్యామలంగా మారిందన్నారు. మంచినీరు రప్పించేలా కృషి చేశారన్నారు. ఆయన చేసిన అభివృద్ధి పనులు, కార్యకర్తలకు అండగా నిలబడి పార్టీ జెండాను భుజంపై వేసుకొని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ జెండాను ఎగిరే విధంగా చేసిన కృషిని ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. ఆయన త్యాగాలను గుర్తు చేసుకుంటున్నారన్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు రెండవ దశకు రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు నామకరణం చేస్తున్నట్లు సంతాప సభ ముఖంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. 24 గంటల్లో జీవో జారీ చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నాయకుల కోరిక మేరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఆర్డీఆర్ పేరు నామకరణం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పేరు నామకరణం చేయడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు త్యాగాలను, పోరాటాలను గుర్తు చేసుకున్నట్లు అవుతుందని తగిన గౌరవాన్ని కల్పించిన వారు అవుతామని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకులను ప్రజలు ఎప్పుడూ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారన్నారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గం మంచినీరు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశాలు, సభలు నిర్వహించినప్పుడు పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి విజయవంతం చేయడంతో పాటు పార్టీలో తనకంటూ ఒక ముద్ర వేసుకొని అభివృద్ధిలో ముందుకు సాగినందున టైగర్ దామన్నగా పేరు సాధించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

రాష్ట్ర మంత్రులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంతరావు, నల్లగొండ, భువనగిరి ఎంపీలు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి లు మాట్లాడుతూ కమ్యూనిస్టు, తెలుగుదేశం పార్టీలను ఎదుర్కొని పోరాటాలు సాధించాలని, రక్త తర్పణం బస్సు యాత్రను గుర్తు చేశారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయించిన ఘనత దామోదర్ రెడ్డికి దక్కుతుందన్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులంతా ఒకే తాటిపై నిలబడి దామన్న ఆశయ సాధనకు కంకణ బద్దులు కావాలన్నారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో గెలుపొందేలా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. చేసిన మంచి పనులను ప్రజలు ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, డిప్యూటీ స్పీకర్ రామచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్ కనికట్టు.. కోటిన్నర హాంఫట్టు!

>> రైసుమిల్లరు, బండ లలిత నాయకత్వంలో గుంట, రెండు గుంటలు భూమి కలిగిన 12 మంది చిన్న, సన్నకారు రైతులను తమ అక్రమ దందాకు పావులుగా ఎంపిక చేసుకొన్నారు. ఆ పన్నెండు మంది రైతులు 278 ఎకరాలలో వరి సాగు చేసినట్లు 8049క్వింటాళ్ళ వరిధాన్యం ఉత్పత్తి చేసినట్లు కాగితాల్లోనే కనికట్టును ప్రదర్శించారు. బెజ్జంకి శ్రీనివాస్‌కు వ్యవసాయాధికారి కె.గంగాజమున, వ్యవసాయ విస్తరణ అధికారి బి అర్చన, ఎం సుప్రియలు ఐకెపి సెంటర్ నిర్వాహకులు హైమవతి, అనిత, ప్రైవేటు ల్యాబ్ ఆపరేటర్ వాంకడోత్ చరణ్, ధాన్యం రవాణా కాంట్రాక్టరు రాజేశ్వరరావులు సహకరించడంతో ప్రభుత్వం సొమ్ము కొల్లగొట్టడానికి మార్గం సుగమం అయినట్లు విజిలెన్స్ అధికారుల విచారణలో వెల్లడైంది. కొల్లగొట్టిన కోటి86లక్షల రూపాయలు వారివారి స్థాయిని బట్టి రూ.7.5నుంచి రూ. 22.6లక్షల వరకు పంచుకున్నట్లు గుర్తించిన చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శశిధర్‌రాజు వాటిని రికవరీ చేయాలని సూచించారు. బెజ్జంకి శ్రీనివాస్ బంధువులు బెజ్జంకి చందు, బెజ్జంకి శోభరాణి, బెజ్జంకి శివకుమార్ అకౌంట్లో కూడా వీటి మళ్ళించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. యాసంగిలో ఐకేపీ ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై గత సోమవారం నుంచి విజిలెన్స్ అధికారులు రోజుల తరబడి విచారణ చేశారు. హనుమకొండ సివిల్ సప్లయ్ కార్యాలయంలో ఆ శాఖ హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ నేతృత్వంలో విచారణ కొనసాగింది. కాట్రపల్లి, శాయంపేట ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ అధికారులను విచారించారు. యాసంగి కొనుగోళ్లలో భారీ స్కాం జరిగినట్లు తేలడంతో లోతుగా విచారణ చేసి పూర్తి ఎవిడెన్స్ సంపాదించినట్లు తెలిసింది. యాసంగిలో శాయంపేట, కాట్రపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు నిర్వాహకులు అక్రమాలకు పాల్పడినట్లు సివిల్ సప్లయ్ కమిషనర్‌కు ఫిర్యాదు వెళ్లిన క్రమంలో విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుపెట్టారు. హనుమకొండ జిల్లాలోని కమలాపూర్‌లోని సాంబశివ మిని రైస్‌మిల్లు కేంద్రంగా ధాన్యం కొనుగోళ్ల అక్రమాలు జరిగినట్లు, శాయంపేటకు చెందిన ఒకరు ఇందులో ప్రధాన పాత్ర పోషించినట్లు గుర్తించారు. ధాన్యం లేకుండానే నకిలీ రైతులను సృష్టించి కోటి 86లక్షల రూపాయలు కాజేసినట్లు తేలింది. నకిలీ ట్రక్‌షీట్లను తయారుచేసి మిల్లు యజమానితో పాటు ఐకేపీ నిర్వాహకులు అక్రమాలకు తెరలేపినట్లు, ఇందులో శాయంపేట, కాట్రపల్లి అగ్రికల్చర్ అధికారులు భాగస్వాములైనట్లు తేల్చారు. అయితే హనుమకొండలోని జిల్లా సివిల్ సప్లయ్ అధికారులతో పాటు శాయంపేట, కాట్రపల్లి ఐకేపీ ఇన్‌చార్జి సీసీలు, ఏపీఎంను కూడా విజిలెన్స్ అధికారులు విచారించారు. ఇప్పటికే ఐకేపీ కొనుగోలు నిర్వాహకులు, సీసీ, ఏఈవోలను విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు రహస్యంగా విచారించి రికార్డులు సీజ్ చేశారు. ఏఈవోలు ఇచ్చిన టోకెన్ల వివరాలు సేకరించారు. అయితే నకిలీ రైతుల పేరుతో ట్రక్‌షీట్లను తయారు చేసి మిల్లర్‌తో కుమ్మక్కై రూ.కోటి వరకు అకౌంట్లకు మళ్లించినట్లు గుర్తించారు. కమలాపూలోనిరైస్‌మిల్లు యజమాని, శాయంపేట, కాట్రపల్లిలోని ఇద్దరు ఇందులో ప్రధాన పాత్ర పోషించినట్లు అధికారులు గుర్తించి వివరాలు సేకరించారు. మిల్లర్‌కు సంబంధించిన ఒకరికి పెద్ద మొత్తంలో డబ్బులు జమైనట్లు అధికారులు గుర్తించారు. సీఎంఆర్ ఉన్నప్పటికీ మిల్లులో ధాన్యం లేకపోవడంతో తీగ లాగితే డొంక కదిలి అక్రమాలు బయటపడినట్లు తెలుస్తున్నది. రాష్ట్ర స్థాయిలో ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు ఎప్పుడూ జరగలేదని చెబుతున్నారు. విజిలెన్స్ అధికారులు అక్రమార్కులపై క్రిమినల్ కెసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. అయితే కాట్రపల్లి, శాయంపేటలోనే కాకుండా మరికొన్ని చోట్ల కూడా ఇలాంటి అక్రమాలు చోటుచేసుకున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది.

# స్కూళ్ల తనిఖీలకు కమిటీలు

>>ఏర్పాటు చేయాలని డైరక్టర్ సూచించారు. ప్రాథమిక పాఠశాలల తనిఖీ బృందంలో ముగ్గురు సభ్యులుంటారు. వారిలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నోడల్ అధికారిగా కొనసాగనుండగా, సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జిటి) సభ్యుడు, సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జిటి) సభ్యుడుగా ఉంటారు. ప్రాథమికోన్నత పాఠశాలల తనిఖీ బృందంలో ముగ్గురు సభ్యులుంటారు. స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) నోడల్ ఆఫీసర్‌గా కొనసాగుతాడు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఒక సభ్యుడుగా, సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జిటి) మరో సభ్యుడుగా ఉంటారు. ఉన్నత పాఠశాలల(హైస్కూల్) తనిఖీ బృందంలో 9 మంది సభ్యులుంటారు. గెజిటెడ్ హెడ్ మాస్టర్ (జిహెచ్‌ఎం) గ్రేడ్-2 నోడల్ ఆఫీసర్‌గా కొనసాగుతూ 7 మంది సబ్జెక్టు టీచర్లు (భాష, భాషేతర ఉపాధ్యాయులు) సభ్యులుగా ఉంటూ స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్(పిఈటి)) సభ్యుడుగా మొత్తం 9 మందితో కమిటీ ఉంటుంది. తనిఖీ కమిటీలో సభ్యుల ఎంపికలో కనీసం 10 సంవత్సరాల బోధనా అనుభవం ఉండాలి, ఉపాధ్యాయుడు సబ్జెక్టులో నైపుణ్యాన్ని కలిగి ఉండాలి, ఉపాధ్యాయుడు తప్పనిసరిగా సర్వీస్ శిక్షణా కార్యక్రమాలలో పాల్గొని ఉండాలి. ప్రధానంగా ఉపాధ్యాయుడి(అతని/ఆమె)పై గతంలోగానీ ప్రస్తుతంగానీ క్రమశిక్షణా చర్యలు ఉండకూడదని పాఠశాల విద్య డైరక్టర్ డీఈవోలను ఆదేశించారు. కమిటీల్లోకి తీసుకునే ఉపాధ్యాయులను తక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న స్కూల్ నుంచి ఎంపిక చేయవద్దని సూచించారు. కమిటీలోకి తీసుకున్న వారికి డిప్యూటేషన్ విధానంలో అదే బాధ్యతల్లో కొనసాగేలా ఉత్తర్వులను డీఈవోలు ఇవ్వాల్సి ఉంటుంది.



ఆదివారం హైదరాబాద్‌లో సమావేశమైన బిసి సంఘాల నేతలు కృష్ణయ్య తదితరులు

# రేపటి రాష్ట్ర బంద్ 18కి వాయిదా

>> ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా బిసి జెఏసి ఛైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ఛైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్‌ఛైర్మన్‌గా విజిఆర్.నారగోని, కో ఛైర్మన్లుగా రాజారాం యాదవ్, దాసు సురేష్‌లు, సమన్వయకర్తగా గుజ్జకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 14న ఇచ్చిన బిసిల రాష్ట్ర బంద్ 18కి వాయిదా వేస్తున్నట్లు, 13న జాతీయ రహదారుల దిగ్బంధం చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించి బిసిలకు అన్యాయం చేసిందన్నారు. ఈ అన్యాయాన్ని బిసిలంతా రాజకీయాలకు అతీతంగా ఏకమై పోరాడితేనే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు దిగొచ్చి బిసిలకు రిజర్వేషన్లు అమలు చేస్తాయన్నారు. 18న తలపెట్టిన బిసిల రాష్ట్రవ్యాప్త బంద్‌లో బిసిలందరూ పాల్గొని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్రంలోనున్న 60శాతం బిసిలు ఐక్యంగాలేరని బిసిలకు రావాల్సిన నోటికాడ ముద్దను పిడికెడు శాతంలేని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని, ఈ వ్యతిరేకులకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సెగపుట్టించడానికి బిసి ఉద్యమాన్ని పటిష్టం చేస్తామని, అందుకే జెఏసిగా ఏర్పాటు కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నాయకులంతా ఐక్యతను చాటుతూ అభివాదం చేశారు. ఈ సమావేశంలో 30 బిసి సంఘాలు, 110 బిసి కులసంఘాలతోపాటు ముఖ్య బిసి కులసంఘాల జెఏసి ఛైర్మన్ కుందారం గణేష్‌చారి, కుల్కచర్ల శ్రీనివాస్, నీల వెంకటేష్, విక్రంగౌడ్, కె.శ్యాంకుర్మా, వేముల రామకృష్ణ, గుజ్జసత్యం, రమాదేవి, లక్ష్మి, శేఖర్ సగర తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

# పోరు 'సుప్రీం'కు

>> సింఘ్వి మాట్లాడుతూ సుప్రీం కోర్టులో దాఖలు చేసే స్పెషల్ లీవ్ పిటిషన్‌కు సంబంధించిన వివరాలు తెలిపారు. బిసి రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని మొదటి నుంచి తాము హామీ ఇస్తూ వచ్చామని, ఈ మేరకే జివో కూడా విడుదల చేయడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూమ్ మీటింగ్‌లో వ్యాఖ్యానించారు. కాబట్టి దీనిపై ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా రిజర్వేషన్లు కల్పించేందుకు అన్ని విధాలా పోరాటం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. కోర్టులో నిలబడదని తెలిసి కూడా ప్రభుత్వం జివో జారీ చేసిందన్న విపక్షాల విమర్శలను ఎక్కడికక్కడ తిప్పి కొట్టాలని ఆయన మంత్రులకు సూచించారు. మీనాక్షి నటరాజన్ కల్పించుకుని ప్రభుత్వ చిత్తశుద్ధిని ఎవరూ శంకించడం లేదని అన్నారు. మీరు ఎంతో కృషి చేశారని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారని, ఇంకా హైకోర్టు స్టే ఇవ్వకుండా ముందుగానే సుప్రీం కోర్టులో కూడా పిటిషన్ దాఖలు చేయించారని వీటన్నింటినీ బిసిలు తప్పకుండా గుర్తు పెట్టుకుంటారని ఆమె తెలిపారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ఎంతో సీరియస్‌గా ప్రయత్నిస్తున్నదని బిసిలు అర్థం చేసుకున్నారని చెప్పారు. తనకు వందలాది ఫోన్లు వస్తున్నాయని, ప్రభుత్వం చేసిన కృషిని అభినందిస్తున్నారని ఆయన తెలిపారు. విపక్షాలు చేసే విమర్శలను తాను ఇంకా మంత్రులు ఎప్పటికప్పుడు తిప్పి కొడుతున్నామని ఆయన చెప్పారు. జిల్లా పార్టీ నాయకులు కూడా స్థానికంగా విలేకరుల సమావేశాల్లో, సభలు, సమావేశాల్లో ప్రభుత్వం చేసిన కృషిని చెబుతున్నారని ఆయన వివరించారు. కేంద్రంలో బిజెపి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అడ్డుపడుతున్నదని, దీనికి బిఆర్ఎస్ బాసటగా నిలుస్తున్నదని ఆరోపించాలని జిల్లా పార్టీ నాయకులకు సూచించినట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కాగా, ప్రభుత్వ సమ్మతితోనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని పంచాయతీరాజ్‌చట్టంలో స్పష్టంగా పొందుపర్చారు. దీంతో ప్రభుత్వాన్ని కాదని ఎన్నికల సంఘం ఎలక్షన్స్ నిర్వహించడం సాధ్యమేనా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అదే సమయంలో హైకోర్టు మధ్యంతర తీర్పులో బీసీలకు 17 శాతం రిజర్వేషన్లు తగ్గించి 50 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించింది. ఇందులో ఏ నిర్ణయానికి కట్టుబడితే ఏ సమస్యలు వస్తాయోనని ఎన్నికల సంఘం అధికారులు ఒత్తిడికి గురవుతున్నారు. బీసీలకు ఎలాగైనా 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నది.

అన్ని అవకాశాలనూ వినియోగించుకుంటున్నది. ఈ సమయంలో రిజర్వేషన్లను ఎన్నికల సంఘమే తగ్గించి ఎలక్షన్స్ నిర్వహించడం సాధ్యమేనా?.. ఒక వేళ్ల తగ్గిస్తే బీసీ సంఘాలు, బీసీ వర్గాల ప్రజలు ఆగ్రహానికి గురయ్యే అవకాశం ఉంటుందనే కోణంలోనూ ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల సంఘమే రిజర్వేషన్లు తగ్గించి ఎలక్షన్స్ నిర్వహించిన దాఖలాలు ఉన్నాయా? అనే అంశంపైనా వివరాలు సేకరిస్తున్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయనుంది. దానిపై వచ్చే స్పందన ఆధారంగా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకునే అవకాశముంది.

కాగా, బీసీ రిజర్వేషన్ల అంశం కోర్టులో ఉండగానే ఎస్‌ఈసీ స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో సమస్య తలెత్తిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కోర్టు తీర్పు వచ్చాక షెడ్యూల్ విడుదల చేస్తే ఇన్ని సమస్యలు వచ్చేవి కావని చెబుతున్నారు. అదే సమయంలో ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ఆశావహులు, అధికారులకు ఇబ్బందులు తప్పేవని చెబుతున్నారు.

# చలికూడా ఎక్కువే

>> పరిస్థితులకు కారణమయ్యే లా నినా ఇప్పటికే పలుచోట్ల ప్రవేశించడం కూడా చలి తీవ్రతను పెంచనుందని వారు చెబుతున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా ప్రకారం 2025 చివరి నా టికి లా నినా మరింత అభివృద్ధి చెందే అవకాశం వుంది. ఇది 71 శాతంగా వుండే వీలుందని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. దీని వల్ల సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు, భారీ హిమపాతం, మంచు ఉత్తరాది రాష్ట్రాలలో సంభవించే వీలుందని, దీని కారణం గా దేశంలోని ఇతర ప్రాంతాలలో చలి తీవ్రత పెరిగే వీలుందని వారంటున్నారు.

ఈ అసహజ వాతావరణ మార్పులు గడచిన ఆరేళ్లలో ఐదవసారి ఏర్పడుతుందని వారం టున్నారు. అయితే భారత్ వంటి ఉష్ణ మండల దేశంలో లా నినా బలంగా ఎక్కువ కాలం కొనసాగదని నిపుణులు చెబుతున్నారు. యుఎస్ నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఎఎ) అంచనా ప్రకారం గత సెప్టెంబర్ నెలాఖరులోనే లా నినా మొదలయ్యింది. ఈ లా ని నా డిసెంబర్‌లో మరింత పెరిగి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు వుండే వీలుంది.

# ఆర్ అండ్ బి అధికారుల పోస్టింగుల్లో ప్రతిష్టంభన

## పోస్టింగ్ ఇచ్చే ముందు సంప్రదించాలని మంత్రి అభిప్రాయం

## ఇంకా విధుల్లో చేరని స్పెషల్ సెక్రటరీ సందీప్‌కుమార్‌ఝా

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలియకుండానే అనేక సంఘటనలు జరిగిపోతున్నాయి. మంత్రి మనోభావాలు తెలుసుకోకుండానే ప్రభుత్వపరమైన విధానాలు అమలు చేయడంతోపాటు ఆ శాఖలోకి అధికారులను పోస్టింగ్ ఇచ్చే కొత్త సాంప్రదాయం తెరపైకి వచ్చింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి తెలియకుండానే ఇటీవల విడుదలైన ఒక సినిమాకు సంబంధించిన టికెట్ల ధరలు పెంచడంతో ఆయన అసహనం వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఇప్పుడు వివాదస్పద అధికారిని తన శాఖకు స్పెషల్ సెక్రటరీగా ముందస్తుగా ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా బదలీ చేయడం కూడా ఆయనకు మనస్తాపం కలిగిందని తెలిసింది. ఆర్‌అండ్‌బి శాఖలో ఇటీవల హ్యామ్ రోడ్లుతోపాటు అనే విస్తరణ పనులు టీమ్ వర్క్‌గా మంత్రి తన అధికారులతో కలిసి ముందుకు తీసుకొని వెళుతున్నారు. ఆర్‌అండ్‌బి సాంకేతిక అధికారులతో సమన్వ యం చేసుకొనే నేర్పు వివాదరహితులకు పోస్టింగ్ ఆర్‌అండ్‌బి మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి జాగ్రత్తలు తీసుకొంటున్నారు. అందులో భాగంగానే ఐఎఎస్ అధికారి సందీప్‌కుమార్‌ఝాకు తమ శాఖలో పోస్టింగ్ ఇవ్వొద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సిఎస్ రామకృష్ణారావుకు లేఖ రాసినట్లు తెలుస్తున్నది. వివాదాస్పదుడిగా ముద్రపడిన సదరు ఆఫీసర్‌ను తమ శాఖలో చేర్చుకుంటే ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రతి విషయంలోనూ ఇబ్బంది పెడతారని ఆయనకు పేరుంది. అలాంటి ఆఫీసర్ మా శాఖకు వద్దు. అపాయింట్ చేసే ముందు నన్ను సంప్రదిస్తే బాగుండేది అంటూ మంత్రి కామెంట్ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా సిరిసిల్ల కలెక్టర్ రిలీవ్ అయిన సందీప్ ఇంత వరకూ ఆర్‌అండ్ శాఖలో జాయిన్ కాలేదు. సందీప్‌కుమార్‌ఝాకు సమర్థుడైన అధికారి అనే పేరు ఉంది. కానీ ఆయన వ్యవహారశైలితో ఇంటి బయట కార్యాలయం లో వివాదాల్లో ఇరుక్కుంటున్నారనే విమర్శలున్నాయి. రూలింగ్ పార్టీ లీడర్లతో గొడవలు పడుతున్నారని ఫిర్యాదులు వచ్చాయి. మిడ్‌మానేరు భూ నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆయన పాటించలేదు. పైగా అక్రమ కేసులు పెట్టించారని బాధితులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ విషయంపై సందీప్‌ను స్వయంగా విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించ డంతో ఆయన హాజరయ్యారు. ఆయన డ్రెసింగ్‌సెన్స్ సరిగ్గాలేదని, ఆయన్ను చూస్తే తమకే భయంగా ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సెప్టెంబరు 17 ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండాను ఆవిష్కరిం చారు. సిరిసిల్ల జిల్లాకు ముఖ్యఅతిథిగా వెళ్లిన విప్ ఆది శ్రీనివాస్ నిర్ధారించిన సమయానికి వెళ్లి జెండా ఎగురవేశారు. దీనికి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆలస్యంగా సిఎం, సిఎస్‌కు ఫిర్యాదు చేశారు. ప్రోటోకాల్ పాటించని అతనిని బదలీచేసి ఆర్ అండ్‌బి స్పెషల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇవ్వడంతో ఇక్కడ ప్రతిష్టంభన మొదలైంది.



సదస్సులో ప్రసంగిస్తున్న పరకాల ప్రభాకర్

# కేంద్రం చేతిలో కీలుబొమ్మయిన ఇసిని రద్దు చేయాలి

## ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 12, ప్రభాతవార్త:** ఎన్నికల సంఘం కే ంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మ వలే, బిజెపికి అనుబంధ మోర్చాగా మారిందని ప్రఖ్యాత రాజకీయ విశ్లేషకులు డా.పరకాల ప్రభాకర్ ఆరోపించారు. జాగో నవ తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రయత్నంలో- మీరు భాగస్వాములు కండి' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిధి గా పాల్గొని ప్రసంగించారు. ఇలాంటి ఎన్నికల సంఘాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓటు చోరి జరిగిందని మాట్లాడేవారు తక్షణమే ఎంపి పదవులకు రాజీనామా చేయాలని, పార్లమెంట్‌ను కూడా రద్దు చేయాలని కోరాలన్నారు. 15 రాష్ట్రాలలో 79 లోక్‌సభ నియోజకవర్గాల్లో 5 కోట్ల ఓట్లను అదనంగా లెక్కించడం జరిగిందని, ఈ 5 కోట్ల ఓట్లు అదనంగా రావడం వల్లనే ఎన్‌డిఎకి లోక్‌సభలో మేజార్టి వచ్చిందని, లేకపోతే 234 స్థానాలు మాత్రమే వచ్చేవని, ప్రతిపక్షంగా ఉన్న కూటమికి 313 స్థానాలు వచ్చేవని ఆయన స్పష్టం చేశారు. 79 స్థానాలు ఎన్‌డిఎకి అధనంగా రావడం వల్లనే ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. బీహార్ రాష్ట్రంలో లక్షలాది ఓట్లను రకరకాల పేర్ల మీద తొలగించడం జరిగిందన్నారు. చివరికి మోసం అని తెలిందన్నారు. తెలంగాణ ప్రజల పార్టీ అధ్యక్షు డు జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత విద్వే షాలను రెచ్చగొడుతున్నదని, దేశవ్యాప్తంగా 60 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసు కుంటే పట్టించుకోలేదని ఆరోపించారు. దేశంలో అవినీతి బాగా పెరిగిపోయిందని, ఎన్నికల కమిషన్‌ను ఎన్నుకునే పద్ధతి సరిగలేదన్నారు. ఎన్నికలు నిష్పాక్షపాతంగా జరగాలని, అప్పుడు ప్రజాస్వామ్యం బలంగా ఉంటుందన్నారు. ఈ సదస్సులో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, వివిధ పార్టీల నాయకులు, కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి సాగు నిర్మూలనకు డ్రోన్ పర్యవేక్షణ

## 51 గంజాయి మొక్కల గుర్తింపు

## గంజాయి సాగుచేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

**కెరిమెరి, అక్టోబరు 12, ప్రభాతవార్త:** మండల పరిధిలో గంజాయి సాగు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటామని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీ చిత్త నిరంజన్ అన్నారు. ఈ క్రమంలో ఆదివారం డ్రోన్ సహాయంతో పంటభూములపై పర్యవేక్షణ నిర్వ హించారు. డ్రోన్ సర్వే ద్వారా గంజాయి మొక్కలు సాగు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, సంబంధిత మండల పోలీస్ అధికారులు, ఎక్సైజ్ రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుని వెంటనే నిర్మూలన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో కెరిమెరి మండలం అంతపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నారాయణ గూడ గ్రామానికి చెందిన రాథోడ్ బాలాజీ అనే వ్యక్తి వ్యవసాయ పొలంలో 51 గంజాయి మొక్కలు గుర్తించారు. ఆ మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు ఏఎస్పీ మాట్లాడుతూ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, అమ్మకం, వినియోగం చట్టపరంగా తీవ్ర నేరమని, ఈ అక్రమ కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. జూన్ 2025 నుండి ఇప్పటికి ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో 51 కేసులు కాగా, 560 మొక్కలు స్వాధీనం చేసుకున్నాట్లు తెలిపారు. ప్రజలు స్వయంగా ఈ నేరాలకు దూరంగా ఉండి, గంజాయి సాగు జరుగుతున్న సమాచారాన్ని వవెంటనే డయల్ 100 లేదా 8712670551 నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి తగిన పారితోషికం ఇవ్వబడుతుందన్నారు. గంజాయి రవాణా, సరఫరా, అమ్మకం లేదా మొక్కల పెంపకం జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా అణచివేయడమే లక్ష్యంగా పోలీసులు నిరంతర పర్యవేక్షణ చర్యలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల పరిధిలో డ్రోన్ సర్వేలు, స్థానిక పోలీస్ బృందాల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సీఐ సత్య నారాయణ, కెరమెరి ఎస్సై మధుకర్ తదితరులు పాల్గొన్నారు.


# కామారెడ్డి పోలీసులకు చిక్కిన బీహార్ దొంగనోట్ల ముఠా

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా పోలీసులకు బిహార్ దొంగనోట్ల ముఠా పట్టుబడింది. ఈ సందర్భంగా ఈ ముఠా నుంచి మూడు లక్షల రూపాయలకు పైగా నకిలీ నోట్లతో నాటు 15 వేల 300 రూపాయల అసలు నోట్లు, నకిలీనోట్లను ముద్రించే సామాగ్రిని పట్టుకున్నా రు. ఈ ముఠా గుట్టు రట్టయిన వైనం విచిత్రంగా వుంది. కామారెడ్డి బస్ స్టాండ్ వద్ద వున్న ఓ వైన్ షాప్‌లో గత నెల 23వ తేదీన సిద్దా గౌడ్ అనే వ్యక్తి 500 రూపాయల నోటు ఇచ్చి మద్యం కొనుగోలు చేశాడు. అయితే మద్యం దుకాణంలో పనిచేసే అఖిల్‌కు సిద్దా గౌడ్ ఇచ్చిన 500 రూపాయ ల నోటు నకిలీదని అనుమానం వచ్చి అతని ఇంటికి వెళ్లి నిలదీయగా ఇది అసలైనదే నని అతను దబాయించాడు. దీంతో అఖిల్ ఈ నకిలీ నోటును పోలీసులకు అందించి ఫిర్యాదు చేశాడు. ఈ పిర్యాదు ఆధారంగా పోలీసులు సిద్దా గౌడ్‌ను పిలిపించి విచారణ చేయగా దొంగనోటుగా అతను అంగీ కరించాడు. దీనిని ఫేస్ బుక్‌లో వచ్చిన కరెన్సీ గ్రూపు ద్వారా కోల్‌కతాకు చెందిన సౌరబ్ డే అనే వ్యక్తి ద్వారా పరిచయం చేసుకుని ఐదు వేల రూపాయల అసలునోట్లకు పది వేల నకిలీ నోట్లు తీసుకున్నానని తెలిపాడు. దీంతో కామారెడ్డి పోలీసులు కోల్‌కతాకు వెళ్లి సౌరబ్ డేను అరెస్టు చేయగా హర్యానాలోని భగత్, బీహార్‌లోని రషీద్ ద్వారా తాను వీటిని కొన్నానని తెలిపాడు. దీని తరువాత కామారెడ్డి జిల్లా పోలీసులు ప్రత్యేక బృందాలు గా ఏర్పడి బీహార్‌కు వెళ్లి దొంగనోట్ల ముఠాకు లీడర్ రషీద్‌ను పట్టుకున్నాయి. ఇతని ఇంట్లో భారీగా దొంగనోట్లతోపాటు వాటిని ముద్రించే సామాగ్రి పట్టుబడింది. ముఠాలో 8 మందిని అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నారు.

# క్షమాపణ కోరిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్

## గాంధీపై విమర్శల వివాదం

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీపై సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై ఆదివారం ఎట్టకేలకు క్షమాపణలు కోరారు. నాటి నుంచి పెద్ద ఎత్తున నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో, ఆయన క్షమాపణలు కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. తన వ్యాఖ్యలతో బాధపడిన వారందరినీ క్షమించమని వేడు కున్నాడు. గాంధీ జయంతి అయిన అక్టోబరు 2న దసరా పండగ రావడంపై శ్రీకాంత్‌గాంధీపై వివాదాస్పద కామెంట్స్ చేసింది తెలిసిందే. ఈ విడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ఆయనపై నెటిజన్లు ఫైర్ అయ్యారు. నగర సిసిఎస్‌తో పాటు ఏపీలోనూ కేసులు నమోదు చేయడమే కాదు, మా మూవీ అసోసియేషన్‌కు వెళ్లి శ్రీకాంత్ సభ్యత్వం రద్దు చేయాలంటూ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శ్రీకాంత్ అయ్యంగార్ తాజాగా స్పందించారు. తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించమని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేశాడు. ఇటీవల మాట్లాడిన ఒక విషయం ఎంతో మందికి బాధ కలిగించింది. అది నా ఉద్దేశం కాదని, బాధపడిన వారందరికీ క్షమాపణలు చెప్తున్నాను. ఫ్రీడమ్ ఫైటర్స్ అందరికీ నేను శిరస్సు వంచి వేడుకుంటున్నాను. నాకూ, మీకూ స్వేచ్ఛా వాయువులు పీల్చే భాగ్యం కల్పించడానికి ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమర యోధులందరికీ మన్నించమని కోరుతున్నానని శ్రీకాంత్ అయ్యంగార్ అన్నారు.



శ్రీకాంత్ అయ్యంగార్


# పాప్‌స్టార్‌తో కెనడా మాజీ ప్రధాని ట్రూడో డేటింగ్!

**టొరంటో, అక్టోబరు 12:** కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో(53)కు సంబంధించిన విడియో ఇపుడు సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన పాప్ స్టార్ పెర్రీకి ముద్దులు పెడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో (53) పదవిలో లేనప్పటికీ ఏదో ఒక అంశంతో తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. ఇటీవల వరల్డ్ ఫేమస్ పాప్ సింగర్ కేటీ పెర్రీ(40) తో ట్రూడో డేటింగ్ లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వాటిని నిజం చేస్తూ..తాజాగా వారిద్దరు ముద్దులు పెట్టుకున్న ఫొటోలు బయటకు వచ్చాయి. కాలిఫోర్నియాలోని శాంటా బార్బరాలో ఓ బోటులో వారిద్దరు కిస్ చేసుకుంటూ కనిపించారు. ఇక వైరల్ అవుతోన్న ఫొటోలను చూసినట్లు అయితే పెర్రీ నల్లటి స్విమ్ సూట్‌లో ఉండగా షర్ట్ లేకుండా ట్రూడో ఉన్నారు. అంతేకాక వారిద్దరూ కౌగిలించుకుంటున్నారు. ట్రూడో పెర్రీ చెంపకు ముద్దు పెడుతున్నట్లు ఆ పిక్స్ లో కనిపిస్తుంది. ఈ సన్నివేశాలను ఓ ప్రత్యక్ష సాక్షిచూసి సోషల్ మీడియాలో పోస్టుచేసాడు. తొలుత ట్రూడో, పెర్రీ ఉన్న బోటును దూరంగా చూసి దగ్గర వెళ్లిన తరువాత తాను ధృవీకరించుకున్నట్లు సదరు వ్యక్తి పేర్కొన్నారు. మొత్తంగా వారిద్దరి డేటింగ్ పుకార్లకు ఈ ఫొటోలు బలాన్ని చేకూరుస్తున్నాయి. గతంలో జులై 28న మోంట్రియాల్‌లోని ప్రముఖ రెస్టారెంట్లో వీరిద్దరూ కలిసి డిన్నర్ చేశారు. అందుకు సంబంధించిన చిత్రాలు వెలుగులోకి రావడంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే తొలుత వార్తలు వచ్చాయి. పెర్రీ, యాక్టర్ ఓర్లాండో బ్లూమ్‌తో ఏడేళ్లు కలిసి జీవించింది. అంతేకాక నిశ్చితార్థం కూడా జరిగింది. అయితే వివిధ కారణాలతో ఈ ఏడాది జూన్‌లో వారి నిశ్చితార్థం రద్దైంది.

# జాతీయ రహదారిపై ఒకేసారి ఐదు వాహనాలు ఢీ

## నలుగురు మృతి.. మరికొందరికి గాయాలు

**చెన్నై, అక్టోబరు 12:** తమిళనాడులో జరిగిన ఘోర ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం తెల్లవారు జామున కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపంలోని బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిపై ఒకేసారి ఐదు వాహనాలు ఢీకొన్నాయి. వేగంగా వెళ్తున్న ఓ కారు ట్రక్కును ఢీకొట్టింది. దీంతో వెను కనే ఉన్న ఉన్న మరో మూడు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమా దానికి గురైన కారు హోసూరు నుంచి కృష్ణగిరి వైపు వెళ్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ రోడ్డు ప్రమాదంతో బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మృతుల్లో ఒకరిని ముకిలాన్(30)గా గుర్తించారు. ప్రస్తుతం బెంగళూరులోని ఓ ప్రయివేటు కోచింగ్ సెంటర్‌లో యూపీఎస్సీ పరీక్షల కోసం ప్రిపేరవుతున్నట్లు తెలిసింది. మరో ముగ్గురి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హోసూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు.



# అభివృద్ధికి చిహ్నంగా ముందుకెళ్తోన్న రియల్ ఎస్టేట్

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## సెప్టెంబరులో ఇళ్ల రిజిస్ట్రేషన్లలో 35 శాతం పెరుగుదల

## వ్యవసాయం తర్వాత రియల్ ఎస్టేట్‌లోనే ఎక్కువ మందికి ఉపాధి

## ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 12:** రాష్ట్రంలో అభివృద్ధికి చిహ్నంగా రియల్ ఎస్టేట్ ముందుకువెళ్తోందని, కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనను చాలా కీలకంగా ముందుకు తీసుకెళ్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు, తెలంగాణలో రోడ్ల అభివృద్ధికి రూ.లక్ష 80వేల కోట్ల చేస్తున్నామన్నారు. మన దేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన ఉండాలని ప్రధాని నరేంద్రమోడీ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఆదివారం నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్ మెంట్ కౌన్సిల్(నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్ లో నిర్వహిస్తున్న 15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2047లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చెందిన దేశాల వరుసలో మన దేశం ఉండాలని పేర్కొన్నారు. దేశంలో ప్రతి శాఖకు మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో అత్యధిక కల్పన చేస్తున్నామన్నారు. ప్రపంచంలో 4వ ఆర్థిక ఎకనామిగా అభివృద్ధి చెందుతున్నామని, ప్రధాని నరేంద్ర మోడీ సంస్కరణలు లేకుండా అభివృద్ధి పనులు చేయమని పేర్కొంటున్నారని తెలిపారు. 331 లక్షల కోట్లకు మన దేశ జిడిపి పెరిగిందని, 20 మంది ప్రజలు దారిద్ర్య రేఖ నుంచి బయటకు వచ్చారని తెలిపారు. అవినీతి లేని పాలన మోడీ అందిస్తున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు తగ్గించారని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ సెక్టార్‌లో రెరా యాక్ట్ మైల్ స్టోన్‌గా ఉపకరిస్తుందని,జిఎస్‌టీ స్లాబ్ తగ్గడంతో రియల్ ఎస్టేట్‌కు బాగా లాభం జరిగిందని పేర్కొన్నారు. 2024-25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80వేల కోట్లకు పైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జీఎస్ డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు.


నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్ మెంట్ కౌన్సిల్(నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్ లో నిర్వహిస్తున్న 15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఆయన ఆదివారం పాల్గొని ప్రసంగించారు. "హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలో 2024 సెప్టెంబర్ లో రూ.2820 కోట్ల విలువైన 4903 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్ లో రూ.4804 కోట్ల విలువైన 6612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇది 35 శాతం అధికం. విలువలో వార్షిక వృద్ధి 70 శాతంగా నమోదయ్యింది. ఇవి కేవలం గణాంకాలు కాదు, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలయ్యిందంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి ధీటైన సమాధానాలు అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ సెప్టెంబర్ లో రూ.కోటిపైన విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 151 శాతం పెరుగుదల ఉంది. మొత్తం విక్రయాల్లో విలువ పరంగా వీటి వాటానే 53 శాతం అని చెప్పారు. భారత్‌లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే... అభివృద్ధి చెందిన దేశాల జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా సగటున 10 శాతం 15 శాతం కాగా... చైనాలో అత్యధికంగా 23 శాతం నుంచి 25 శాతం వరకుంది. మన దేశంలో ఇది 6 శాతం నుంచి 8 శాతమే. ఇది మరింత పెరగాల్సిన అవసరముంధి అని అభిప్రాయపడ్డారు. ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో ఫేజ్ - 2, భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు తదితర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు మారిపోనున్నాయి. డిసెంబర్ నాటికి "ఫ్యూచర్ సిటీలో జోనలైజేషన్ ప్రక్రియను పట్టలెక్కించాలనే పట్టుదలతో ఉన్నాం. అక్కడే 200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న ఏఐ సిటీకి రెండు, మూడు నెలల్లోనే భూమి పూజ చేయబోతున్నాం అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నారెడ్కో తెలంగాణ ప్రతినిధులు విజయసాయి మేక, కాళీ ప్రసాద్ దామెర, డా.లయన్ కిరణ్, కె.శ్రీధర్ రెడ్డి, ఆర్.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎఐజిలో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకున్న వ్యక్తి మృతి

## ఆస్పత్రి ముందు బంధువుల ఆందోళన

# ప్రాణం గాలిలో.. బిల్లు లక్షల్లో!

**హైదరాబాద్ (గచ్చిబౌలి), అక్టోబరు 12, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని ఎఐజి ఆస్పత్రిలో దారుణం చోటుచేసుకుంది. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఆస్పత్రిలో చేరిన వ్యక్తి సర్జరీ తర్వాత మృతి చెందారు. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే ప్రాణం పోయిందని, బిల్లు ఎక్కువగా వేశారని రోగి బంధువులు ఆందోళనకు దిగారు. మాదాపూర్ డిసిపి రీతురాజ్ ఆందోళనకారులకు సర్దిచెప్పి కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని చింతల్‌కు చెందిన ము రళి(40) కాలేయం చెడిపోవడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఆగస్టు 26న గచ్చి బౌలిలోని ఎఐజి ఆస్పత్రిలో చేరారు. లివర్‌ను దానం చేసేందుకు మురళి భార్య ముందుకువచ్చారు. మొత్తం 35 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పగా అందుకు వారు అంగీకరించారు. ఆగస్టు 28న మురళికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. అప్పటి నుంచి ఆయన పూర్తిగా కోలుకోకపోవడంతో ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందిస్తు న్నారు. కాగా మురళి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి శనివారంరాత్రి ఆస్పత్రిలోనే మృతి చెందాడు. ఆస్పత్రి యాజమాన్యం రూ.49 లక్షల బిల్లు వేసిందని, ఇప్పటికే రూ. 35 లక్షలు చెల్లించినా మురళి బతుకలేదని బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే మురళి మృతి చెందారని, అధికంగా బిల్లు వేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఆపరేషన్‌కు ముందు లివర్ కోసం మురళి కుటుంబసభ్యులు జీవన్ దాన్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలి పారు. కానీ డాక్టర్లు ఆయన వయస్సు 40కు బదులు 60 వేయడంతో దోనర్లు ముందుకు రాలేదని తెలిపారు. జీవన్‌దాన్‌లో అవకాశం వస్తే 7 లక్షల బిల్లు తగ్గేదన్నారు. ఆస్పత్రి నిర్లక్ష్యం కారణంగానే జీవన్‌దాన్‌లో అవకాశం కోల్పోయా మన్నారు. బాధితుల ఆందోళనతో రాయదుర్గం పోలీసులు ఆసుపత్రికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షి ంచారు. బాధి తుల ఫిర్యాదు మేరకు ఆస్పత్రి నిర్లక్ష్యంపై కేసు నమోదు చేస్తామని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సిహెచ్ వెంకన్న బాధితు లకు తెలిపారు.



ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

# ఆందోళన చెందకండి

## జోర్డాన్‌లో చిక్కుకున్న గల్ఫ్ కార్మికులకు

## మాజీమంత్రి హరీశ్‌రావు భరోసా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 12:** ఉపాధి కోసం వెళ్లి జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది తెలంగాన వలస కార్మికులకు బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆదివారం భరోసా కల్పించారు. వారి సమస్యలను విదేశీ వ్యవహారాల శాఖ దృష్టికి తీసుకెళ్లామని.. వారిని తెలంగాణకు రప్పించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని తెలిపారు. మీరు ఇబ్బంది పడుతున్నారనే విషయం మా దృష్టికి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లామని జోర్డాన్‌లో చిక్కుకుపోయిన వారికి హరీశ్‌రావు వివరించారు. ఎలాగైనా మిమ్మల్ని తెలంగాణకు తీసుకువచ్చే కృషి చేస్తున్నాం.. అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఏడాది క్రితం ఉపాధి కోసం 12 మంది వలస కార్మికులు జోర్డాన్‌కు వెళ్లారు. వీరిలో నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన గల్ఫ్ కార్మికులు ఉన్నారు. ఈ క్రమంలో వారి ఇబ్బందులను చెబుతూ ఇటీవల ఒక వీడియోను పంపించారు. అక్కడే ఉండి బతికేందుకు చేతిలో డబ్బులు లేక, కంపెనీ అనుమతి ఇవ్వకపోవడంతో తిరిగి స్వదేశానికి రాలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని హరీశ్‌రావుకు వలస కార్మికులు గోడు వెళ్లబోసుకున్నారు. ఎలాగైనా తమను తెలంగాణలో ఉన్న కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో వారికి హరీశ్‌రావు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు.

# నేడు జూబ్లీహిల్స్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

## నామినేషన్‌కు మార్గదర్శకాలు జారీ

## 21 వరకు నామినేషన్ల స్వీకరణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 12, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి నేడు గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. అనంతరం వెంటనే నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం తెలిపారు. ఫారం 2బి(నామినేషన్), ఫారం 26(అఫిడవిట్- అన్ని కాలమ్స్ తప్పనిసరి, నోటరైజ్ చేయాలి)లతో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. ఈ నెల 21 వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. పబ్లిక్ హాలిడేలు, రెండో, నాల్గో శనివారాలు మినహాయించి నామినేషన్లను దాఖలు చేయవచ్చని అన్నారు. అభ్యర్థి కనీస వయసు 25 ఏళ్లు ఉండాలని, ప్రతిపాదకులు తప్పనిసరిగా ఉండాలని, గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థులకు నియోజకవర్గ ఓటరుగా ఉన్న వారు ప్రతిపాదకుడిగా ఉండాలన్నారు. స్వతంత్ర, గుర్తింపు లేని పార్టీ అభ్యర్థులకు పది మంది ప్రతిపాదకులు నియోజకవర్గం లోని ఓటర్లై ఉండాలన్నారు. ఇతర నియోజకవర్గ అభ్యర్థులు సంబంధిత ఈఆర్ఓ నుండి ఓటర్ల వివరాలు సమర్పించాలన్నారు. ఎన్‌కోర్ పోర్టల్ ద్వారా డిజిటల్ నామినేషన్ దాఖలు చేయవచ్చని ఇందుకోసం ఎన్‌కోర్ వెబ్‌సైట్ ద్వారా నామినేషన్ ఫారం ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రింటెడ్ హార్డ్‌కాపీని తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్ డిపాజిట్ బ్యాంక్ /ట్రెజరీలో క్రెడిట్ అయ్యి ఉండాలని లేదంటే మాన్యువల్‌గా డిపాజిట్ చేయాలన్నారు. అయిదుగురు వ్యక్తులకే ప్రవేశం ఉంటుందని, ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా మూడు వాహనాలకే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

# రైతుల ఖరీఫ్ ధాన్యానికి రూ.21 వేల కోట్లు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ప్రస్తుత ఖరీఫ్ (వానకాలం) సీజన్‌లో రైతుల నుండి మద్దతు ధరలకు వరి సేకరించేందుకు బోనస్‌తో కలిపి 21,112 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని సర్కార్ అంచనా వేసింది. ఇందుకు ప్రభుత్వం సెక్యూరిటీ ఇవ్వనుండగా, ఈ నిధులను ఆర్థిక సంస్థల నుండి సేకరించనున్నారు. ప్రస్తుతం 7 వేల కోట్లు అధికారుల వద్ద అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో నాబార్డ్ 3,800 కోట్ల రూపాయల రుణం మంజూరు చేయగా, గతంలో మంజూరైన రుణాల్లో రూ.3,200 కోట్లు తీసుకునే వెసులుబాటు ఉన్నట్టు సమాచారం. ఇంకా రూ.14,112 కోట్ల నిధులు అవసరం కానున్నాయి. మరోపక్క రబీ ధాన్యం కొనుగోలు చేసి నాలుగు నెలలు అయినా ఇంత వరకూ క్వింటాలుకు 500 రూపాయలు చొప్పున రైతులకు చెల్లించాల్సిన బోనస్ సొమ్ము ఇంత వరకూ విడుదల చేయలేదు. యాసంగి సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా 74.23 లక్షల టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. ఇందులో సన్న రకానికి చెందిన ధాన్యం దాదాపు 23.20 లక్షల టన్నులు కాగా, వీటికి బోనస్‌గా 1,160 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇక ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 67.33 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడగా, ఇందులో 62 శాతం మేర సన్న రకాలను రైతులు సాగు చేయగా, 42 నుండి 45 లక్షల టన్నులు దిగుబడి అవుతుందని అధికారులు చెబుతున్నారు.

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివి తేటలు ఉండి అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

-సి.డబ్ల్యు.వెండెట్

# ధన ధాన్య సమృద్ధికి కొత్త యోచన

ఈ దేశానికి కావల్సింది ఆహార భద్రతేకాదు. ఆహారధాన్య క్రమంలో దానిని పండించే రైతుకు ఆదాయ భరోసా కూడా అవసరమే. ఇందుకోసం ప్రభుత్వాలు ఎంతగా సంకల్పించినా ఎక్కడో అక్కడ వెనుకబాటుతనం వల్ల సఫలీకృతం కాలేకపోతోంది. వ్యవసాయ క్షేత్రంలో దిగినాక రైతుకు పెట్టుబడితోపాటు నేల స్వభావం, సాగు సౌలభ్యం, మంచి విత్తనం, పెట్టుబడి, మార్కెటింగ్ వంటి అన్ని అంశాలు ఎదురౌతాయి. కొన్నింటంశాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న సౌకర్యాలు అక్కరకొస్తాయి. మరికొన్ని వేధిస్తుంటాయి.దారి దొరకదు. అప్పుడే రైతు డీలాపడతాడు.వీటి విషయంలో రైతు ప్రభుత్వ సాయం కోసం ఆధారపడాల్సి వస్తుంది. ఒకవేళ ప్రకృతి బీభత్సాలు కలవరపెట్టినా ప్రభుత్వమే ఆదుకోవాలి. ప్రస్తుతం వ్యవసాయ పరిస్థితుల్లో వ్యవసాయానికి రైతుకు ఏమేమి కావాలో తెలుసుకొని అందించేందుకు పూర్వ పరిస్థితులకు భిన్నంగా రైతునాదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతు విస్తృత ప్రయోజనాలు కాపాడలేని ఎన్ని పథకాలున్నా అవి నిరర్థకమే. వ్యవసాయ రంగాన్ని పునస్సంఘటితం చేయడానికి తాజాగా 'ప్రధానమంత్రి ధన ధాన్య కృషియోజన' పథకాన్ని ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించారు. రైతుకు నేరుగా ఆర్థిక, సాంకేతిక మద్దతు అందించగలిగితే రైతు కొంత తేలిక పడతాడనే ఆలోచన కావొచ్చు.ఈపథకాన్ని ప్రయోగాత్మకంగా దేశమంతటా 100జిల్లాల్లో అమలుకు సంకల్పించింది. ముందుగా ఆయా జిల్లాలకు ఈపథక ప్రయోజనాలు, పర్యవసానాలు, చేకూరిన లబ్ధివంటి అన్ని అంశాలను క్రోడీకరించుకుని దశల వారీగా మిగిలిన జిల్లాలకు విస్తరించాలన్నది కేంద్రప్రభుత్వ లక్ష్యం. రైతు సాగు సుసంపన్నం కావాలంటే ఏమేమీ కావాలో తెలియనిది కాదు. చేసేది సంప్రదాయ వ్యవసాయమైనా, సేంద్రియ వ్యవసాయమైనా ఏ ఇతర పరిపక్వత కలిగిన వ్యవసాయానికైనా కావాల్సిన ఉత్పాదకత వనరులన్నీ సర్వసాధారణమైవే.కానీ వాటిని సమాకూర్చుకునే అంశాలు మాత్రం దేనికైనా సమానంగా ఉంటాయి. ఎవరెన్ని చెప్పినా సాగు విధానాల సక్రమ అమలు, నిర్వహణ పర్యవేక్షణకు గ్రామసీమలో చేపట్టడమే మేలని ఎంచి కేంద్రప్రభుత్వం జిల్లాకు 4గ్రామాలను ఎంపిక చేసుకుని అందులోనే ఈ ప్రక్షాళన కార్యక్రమాలను అమలు చేయతలపెట్టింది. ఈ పథకంలో భాగంగా ఆ ప్రాంతాల్లోని రైతులకు నేరుగానగదు సాయం, పెట్టుబడి ఖర్చుల్ని అందిస్తుంది. వారిని సతాయించకుండా ఎప్పటికప్పుడు రైతు అవసరం మేరకు విత్తనాలు, ఎరువులు, తదనుకూలంగా సాంకేతిక పరిజ్ఞానం అందిస్తుంది. దీనివలన మంచి దిగుబడి రాబట్టువచ్చు. మార్కెటింగ్ సౌకర్యాలు ఏర్పరిచి, గోదాములు, రవాణా సౌకర్యాన్ని అభివృద్ధి చేసుకోగలిగితే మంచి ఆదాయం లభిస్తుంది. తొలిదశలో ఈరకం సాగు సంస్కరణలు రైతుల్లోకి వెళ్తాయి. ఇవన్నీ పాత అంశాలుగానే కనబడుతున్నా ఆధునిక సాగునిర్వహణలతో వ్యవసాయాన్ని మరింత వేగవంతం చేసుకోవాల్సి ఉంటే.దీంతో వ్యవసాయ ఉత్పాదకత పెరిగి దేశంలో ఆహారభద్రత ఏర్పడుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం ఏర్పడుతుంది.దాదాపు 24వేల కోట్లరూపాయల నిధులతో కనీసం ఆరు సంవత్సరాలపాటు అమలులో ఉండే పథకానికి రూపకల్పన చేశారు. తొలిదశలో తక్కువ పంట దిగుబడి, క్రెడిట్‌పొందడంలో సంక్లిష్టత ఉన్న సాగుభూమి కనిపించిన జిల్లాలనే ఎంపిక చేయడం విశేషం. అన్నీ బాగున్న జిల్లాలనే మోడల్ జిల్లాలుగా ఎంపిక చేయకుండా నిర్దిష్ట లోపాలున్న జిల్లాలను ఎంపికచేయడం స్వాగతించదగిన విషయం. సుమారు 1.7కోట్ల రైతులు దేశం మొత్తంమీద ఈపథకం లబ్ధిదారులౌతారు. వారి అనుభవాలు,ఆర్థిక లబ్ధిప్రయోజనాల ఆసరాగా దేశంలోని అందరు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కల్పించే విధంగా విస్తరిస్తారు. ఉత్పాదకత పెంపు, పంట విలిదీకరణ, స్టోరేజి వసతుల అభివృద్ధి, క్రెడిట్ సౌకర్యం పెంపు, నీటివసతుల సమీకరణ వంటి అంశాలు ఈపథకంలో ప్రముఖంగా చోటు చేసుకుంటాయి.నాణ్యత కలిగిన విత్తనాలు, కల్తీలేని ఎరువులు, వ్యవసాయ పరికరాలు, సాగుశిక్షణ సౌకర్యాలు కల్పించడం వలన ఉత్పాదకత పెరుగుతుంది. సాగు ఖర్చుతగ్గించడం కోసం ఆధునిక యంత్ర పరికరాలు, నీటి వనరులు, సబ్సిడీలను తక్కువ వ్యయంతో అందించడం వంటివి ప్రభుత్వమే పర్యవేక్షిస్తుంది. స్మార్ట్ ఫార్మింగ్ సెన్సర్లు, డ్రోన్ సర్వేలు వంటి ఆధునిక వ్యవ సాయ సాంకేతికతను రైతుకు చేరువ చేస్తుంది. వ్యవసాయ ప్రాసెసింగ్,వడపోత కేంద్రాలు, ట్రాన్స్‌పోర్టేషన్ వలన గ్రామీణ ఉపాధికిఆస్కారమిస్తుంది. ఇవన్నీ ప్రణాళిక బద్ధంగా అమలు జరిగితే రైతు ఉత్పాదకత తద్వారా ఆదాయం పెరిగి కొనుగోలు శక్తి కలిగి గ్రామీణ మార్కెట్ అభివృద్ధి వీలవుతుంది. కోల్డ్‌స్టోరేజీ, మార్కెట్ యార్డుల వంటి సౌకర్యాలు మెరుగుపడతాయి. లక్ష్యాల సాధనలో వ్యవసాయ సంబంధిత ప్రభుత్వశాఖల చిత్తశుద్ధి మాత్రమే ఈ పథకం విజయవంతం చేయగలుగుతుంది.ఈ పథకం కింద నిర్దేశించబడిన అన్నివనరులు, వసతులు లక్ష్యాల ను క్రమపద్ధతిలో సమన్వయపరుచుకుంటేనే సత్ఫలితాలు వస్తాయి.పంట దిగుబడులు 15 నుంచి 30శాతం పెంపు, రైతుల వార్షికఆదాయం 20 నుంచి 40శాతం పెరుగుతుందని అంచనా. 25 శాతం మేరకు నీటివనరుల సమర్ధ వినియోగం,60శాతం మేరకు గ్రామీణ ఉపాధి సృష్టి రైతు ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యం పెంపువంటి లక్ష్యాలు ఘనంగానే రూపొందించారు. ఇవన్నీ సానుకూలపడాలంటే ప్రభుత్వశాఖల సమన్వయం, పథకం అమలులో చిత్తశుద్ధి అవసరం.



మంచి జీవితం అనే సిద్ధాంతాన్ని అనుకరించాలనే గాని, చెడు జీవితాన్ని కాదు. ధర్మపరాయణ సంపన్నులు ఈ జన్మలోనూ, రాబోయే జన్మలోనూ సుఖంలో ఉండగలరు.

గౌతమ బుద్ధుడు



చదవడం వల్ల ప్రయోజనం ఏమిటంటే నలుమూలల నుంచి వచ్చే విజ్ఞానాన్ని అంగీకరించడం, దాని నుండి గుణపాఠాలు నేర్చుకోవడం.

మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



### వైద్య కళాశాలల విస్తరణ అవసరం

వైద్య విద్యను,ఆరోగ్యసేవలను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వ వైద్యకళాశాలల విస్తరణ అవసరంగా మారింది. ప్రస్తుతం లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం రెండు తెలుగురాష్ట్రాలలో ప్రైవేటు వైద్యకళాశాలల సంఖ్య ప్రభుత్వ కళాశాలలకంటే ఎక్కువగా ఉంది. అయినప్పటికీ విద్యార్థులపెరుగుతున్న డిమాండ్‌కి, జనాభాకు తగిన వైద్యుల నిష్పత్తి దృష్ట్యా ఈ సంఖ్య పరిమితంగా ఉంది. అధిక శాతం వైద్య సీట్లు ప్రైవేట్ లేదా మేనేజ్‌మెంట్ కోటాలో ఉండటంవల్ల మెరిట్ ఉన్న ప్పటికీ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఎంబీబీఎస్ సీటు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు విద్యా, సామాజిక రీత్యా అనేక ప్రయోజనాలను అందిస్తాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పంట పొలాల్లో కరెంట్ పోల్స్

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రామాలలో పంట పొలాల్లో మధ్యలోమెయిన్ లైన్ కరెంటుపోల్స్ ప్రమాదకరంగా వుండి వంగి ఉన్నాయి.అసలే ఇది వానాకాలం. ఈ సమయంలో ప్రమాదవశాత్తు భారీ వర్షానికి గాని, ఈదురు గాలులకు గాని వైర్లు తెగి, నేల మీద పడితే మనుషుల, పశువుల ప్రాణాలుపోయే ప్రమాదంలేకపోలేదు. గతంలో ఎంతోమంది మృత్యువాత పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పం దించాలి.

- కె. సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### అక్రమ కట్టడాలను నిర్మూలించాలి

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రభుత్వ ఆర్థిక సహకారంతో పేద ప్రజలకు పంచిన ఇళ్ల స్థలాలలో కబ్జాదారులు కన్నువేసి చాలాగజాలు ఆక్రమించుకోవడం జరుగుతుంది. అక్రమకట్టడాలు నిర్మించడం జరుగుతుంది.కాలనీలలో కొన్ని ఇండ్లస్థలాలు కొనుగోలు అమ్మకాలు జరిగాయి. ప్రభుత్వ రెవెన్యూ రికార్డులలో ఎవరికి ఎంత భూమి ఎంత ఇంటి స్థలం ఉందో రికార్డులుచూపుతున్నాయి.కానీ కబ్జాదారులు ఇళ్ల స్థలాల అక్రమణకు పాల్పడుతున్నారు.రాష్ట్ర రెవిన్యూ శాఖ ఇంటి స్థలాల కొలతలు,సరిహద్దులు, వంటి విషయాలను పరిశీలించి వివాదాలు లేకుండా చూడాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### మహువ లడ్డూను ప్రోత్సహించిన మోడీ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహువ లడ్డూ గురించి ప్రస్తావించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మహువ పువ్వులతో తయారు చేసే ఈ లడ్డూ గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల సంప్రదాయ వంటకం. మోదీ గారి ప్రోత్సాహం వల్ల ఈ స్థానిక వంటకం జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందుతోంది. మహువ లడ్డూను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ మహిళా సంఘాలు, స్వయం సహాయ సమూహాలకు కొత్త ఆర్థిక అవకాశాలు లభిస్తున్నాయి.స్థానికంగా లభించే పర్యావరణహిత పదార్థాలతో తయారయ్యే ఈలడ్డూ ఆరోగ్యానికి కూడా మేలుకలిగించేది. ఇలాంటి సంప్రదాయ వంటకాలను ప్రోత్సహించడం ద్వారా మన దేశపు సాంస్కృతిక వారసత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని అందిస్తుంది. మోడీ గారి ప్రోత్సాహం వల్ల మహువ లడ్డూ ఒక సాధారణ వంటకం నుంచి భారతీయ సంప్రదాయానికి, గ్రామీణ గౌరవానికి ప్రతీకగా నిలిచింది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ఉత్పత్తులను పెంచాలి

ప్రధాని నరేంద్రమోడీ ఇవ్వాళ ప్రారంభించబోయే రెండు వ్యవసాయ పథకాలు చాలా ముఖ్యమైనవి. దేశంలోని 100 తక్కువ సాగు విస్తీర్ణం తక్కువ ఉత్పాదకత తక్కువ ఉత్పత్తి ఉన్న జిల్లాలను గుర్తించి స్వయం సమృద్ధం అయ్యే విధంగా ప్రోత్సహించడం దీనిలో తెలంగాణ నుండి జనగామ నాగర్ కర్నూల్ నారాయణ పేట గద్వాల్ లాంటి జిల్లాలు ఉన్నాయి. ఇకపోతే వీటి కింద నీటి వనరుల కల్పన, నీటిని నిల్వ చేయడం ద్వారా పంటల ఉత్పాదకతకు, ఉత్పత్తికి ప్రోత్సాహం అందించడం ద్వారా కరువు నేలలను సిరులు పండే నేలలుగా మార్చే ప్రయత్నం జరుగుతుంది.

- భారత అవినాష్, జనగామ

### కల్తీలకు అడ్డుకట్ట వేయాలి

ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న నిత్యావసర వస్తు వుల ఆహార పదార్థాల కల్తీ, నకిలీ సరుకులకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి. ముఖ్యంగా ఆహారపదార్థాలు కృత్రి మంగా తయారు చేయడం జరుగుతుండడంవిచారకరం. ప్లాస్టిక్ బియ్యం, ప్లాస్టిక్ గుడ్లు ,కృత్రిమ మాంసం,నల్ల బియ్యం తదితర కృత్రిమ నిత్యావసర ఆహార పదార్థాల కల్తీలకు అడ్డుకట్ట వేయాలి.లేదంటే ప్రజల ఆరోగ్యంపై వీటి ప్రభావం పడుతుంది.

-డి చాంద్ బాషా, కర్నూలు

# ప్రకృతి వైపరీత్యాలే ప్రపంచ సవాళ్లు

**మానవ స్వార్థ ప్రయోజనాల ఫలితంగా ఏర్పడుతున్న విపత్తులను అరికట్టడం కొంతవరకు మన చేతుల్లోనే ఉంది. అలాగే ప్రకృతి సంబంధిత విపత్తుల వలన జరిగే ప్రాణ,ఆస్తినష్టాలను కనీస స్థాయికి తగ్గించడం కూడా సుసాధ్యమే. ఇందుకు ప్రభుత్వాలు,ప్రజలు కంకణబద్ధులు కావాలి.ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కూడా ఇదేవిధమైన ఆలోచనలతో ప్రజలను జాగృతం చేయాలని భావించి 2009 వ సంవత్సరంలో ఒక తీర్మానంచేసింది. అంతర్జాతీయ విపత్తుల తీవ్రతను తగ్గించేందుకు ప్రజల ప్రేరణతో ఒక ఉద్యమంగా మలచడానికి ప్రతీఏటా అక్టోబర్ 13వ తేదీన నిర్వహించే 'ఇంటర్నేషనల్ డిజాస్టర్ రిస్క్‌రిడక్షన్ డే'ఒక అవగాహనా కార్యక్రమం.ఎన్నిసంస్థలు ఎన్నివిధాలుగా కృషిచేసినా, ప్రజాచైతన్యం, ప్రజాభాగస్వామ్యం లేనిదే ఏ ప్రయత్నమైనా నిర్వీర్యం కాక తప్పదు. కాబట్టి లోక కల్యాణార్థం చేపట్టే కార్యక్రమాలకు,సంకల్పానికి వికల్పం కలగకుండా చూడవలసిన బాధ్యత ప్రజలపైన,ప్రభుత్వాలపైన ఎంతైనాఉంది.**



సుంకవల్లి సత్తిరాజు

ప్రపంచంలోని అనేక దేశాలు పలు ప్రకృతి వైపరీత్యాలకు గురవుతున్నాయి.వాతావరణంలో సంభవించే ఆకస్మిక మార్పులకు, అధిక వర్షాలకు,వరదలకు జనజీవితం అతలాకుతలం కావడం చూస్తున్నాం. ప్రకృతి విపత్తుల వలన సంభవిస్తున్న పరిణామాలు అత్యంత భయానకంగా ఉంటున్నాయి. ఈ అనర్థాలను అనుభవాలను, పాఠాలుగా స్వీకరించి, ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి, నష్టాన్ని సాధ్యమైనంత తక్కువ స్థాయికి తగ్గించడానికిఅంతర్జాతీయ వేదికలు కృషి చేస్తున్నాయి. మానవ మేధస్సుకంటే ప్రకృతి అత్యంత బలీయమైనది. ఎన్నో పరిశోధనలు జరిగినా, ఎన్నో ఆవిష్కరణలు జరిగినా ఇప్పటివరకు మానవుడు మృత్యువును,ప్రకృతిని జయించలేకపోయాడు. రోగానికి వైద్యపరంగా చికిత్స అందించవచ్చు. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించవచ్చు. కాని ప్రకృతి విలయాలను ఆపడంసాధ్యం కాదు.పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వలన ప్రకృతివిపత్తుల వలన సంభవించే ప్రాణ నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని పూర్తిగా నివారించలేకపోయినా కనీస స్థాయికి తగ్గించే అవకాశాలున్నాయి.ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి,నష్టాన్ని సాధ్యమైనంత తక్కువ స్థాయికి తగ్గించడానికి ఐక్యరాజ్య సమితి ప్రతీ ఏటా అక్టోబర్ 13వ తేదీని అంతర్జాతీయ విపత్తుల తగ్గింపు దినోత్సవం (ఇంటర్నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ డే)గా పాటిస్తున్నది. ప్రకృతిలో సంభవించే తీవ్రమైన పరిణామాలను 'విపత్తు' అని నిర్వచించవచ్చు. ప్రపంచాన్ని ఎలాంటి విపత్తులు లేకుండా కాపాడాలనే మానవ సంకల్పానికి వికల్పమే వైపరీత్యం.వర్తమానంలో సంభవిస్తున్నప్రకృతి విపత్తుల్లో చాలా వరకు మానవ తప్పిదాలే కారణమవుతున్నాయి. వరదలు, భూకంపాలు,తుఫానులు, సునామీలు ఇత్యాదులన్నీ సహజ విపత్తులు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం కలిగించి, విధ్వంసం చేసి, కోలుకోలేని విధంగా మానవజీవితాలను అతలాకుతలం చేసిన అనేక సంఘటనలు ఈ ప్రపంచంలో సంభవించాయి. అతివృష్టి వలన వరదలు సంభవించడం, ప్రజాజీవితాన్ని స్థంభింపచేయడం, అనావృష్టి వలన పంటలన్నీ ఎండిపోయి, ఆహారోత్పత్తి దెబ్బతినడం త్రాగడానికే నీరు లేక కటకటలాడడం మనం చూస్తున్నాం. వీటన్నింటినీ విపత్తులుగా పేర్కొనవచ్చు. జనజీవనానికి తీవ్ర విఘాతం కలిగించి, జీవనోపాధిని దెబ్బతీసి,ప్రాణాలకు, ప్రభుత్వ, ప్రజల ఆస్తులకు నష్టం కలిగించడంలో ప్రకృతి విపత్తుల పాత్ర అధికం. ప్రకృతి వైపరీత్యాల నుండి కోలుకుని, జనజీవనం సాధారణ స్థితికి రావడానికి సుదీర్ఘకాలం పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో ప్రజాజీవనాన్ని పునరుద్ధరించడానికి ప్రభుత్వాల, జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల అవసరం ఎంతైనా ఉంది. మానవ జీవితాలను అతలాకుతలం చేసే ఇలాంటి ప్రమాదాలన్నీ సాధారణ స్థాయిని దాటి తీవ్రమైన స్థితికి చేరడం వలన విపరీతమైన ప్రాణనష్టం జరుగుతున్నది. ప్రకృతి వైపరీత్యాల్లో వాతావరణ పర్యావరణ,సంబంధమైన అంశాలు మిళితమై ఉన్నాయి. ప్రస్తుతం ఏర్పడుతున్న వైపరీత్యాల్లో మానవ ప్రేరిత వైపరీత్యాలదే సింహభాగం. ఈ సంవత్సరం మయన్మార్, థాయ్‌లాండ్, వియత్నాం దేశాల్లో సంభవించిన భూకంపం దాటికి ఆకాశహర్మ్యాలు నేలమట్టమయ్యాయి. ఫిలిప్పీన్స్‌లో సంభవించిన భూకంపం విధ్వంసం సృష్టించింది. పాక్ వంటి దేశాల్లో వరదల కారణంగా అపారమైన ప్రాణ,ఆస్తి నష్టం సంభవించింది. కేరళలోని వయనాడ్ జిల్లాలో జరిగిన ప్రకృతి విధ్వంస ఫలితాలను మరువలేం.భారతదేశంలోని పలు రాష్ట్రాలు వరదల వలన




అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో బుడమేరు వరదలు ప్రజాజీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసాయి. హైదరాబాద్ మహానగరంలో చినుకు పడితే చాలు రోడ్లన్నీ జలమయమై పోతున్నాయి. మానవ తప్పిదాలు మహోగ్ర రూపం ధరించి మహా ఉపద్రవాలకు కారణభూతమవుతున్నాయి. ప్రకృతిని పరిరక్షించకపోవడమే సకల అనర్థాలకు కారణం. ఈ భూప్రపంచంలో మానవమనుగడ కొనసాగించాలంటే పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలి. స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను నరికే విధానం మారాలి. వృక్షజాతిని పెంపొందించాలి. మొక్కలనునాటే కార్యక్రమాన్ని దైవభక్తి, దేశభక్తితో ముడిపెట్టాలి. అప్పటివరకూ మొక్కలు నాటే కార్యక్రమం ఊపందుకోదు. చెట్లను పెంచడం వలన భూతాపం తగ్గుతుంది. వాయు కాలుష్యం తగ్గి మనం పీల్చే గాలిలో నాణ్యతాశాతం పెరుగుతుంది. అనారోగ్య సమస్యలు అరికట్టబడతాయి.వాతావరణం చక్కబడుతుంది. పచ్చని చెట్లను నరకడం వలన వాతావరణంలో సమతుల్యత దెబ్బతింటున్నది. మానవాళికి అవసరమైన ప్రాణవాయువు లభించడం లేదు. కాలుష్యం పెరిగి, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. మానవ మనుగడకు రక్షాకవచమైనఓజోన్ పొర దెబ్బతినడం వలన రేడియోధార్మికత వెలువడుతున్నది. దీనివలన అనేక విపత్కర పరిణామాలు సంభవిస్తున్నాయి.వాతావరణంలో అవాంఛనీయ పరిణామాలకు మనదే బాధ్యత. గ్లోబల్ వార్మింగ్ ఒక విషమ సమస్య. ఈ విషమ సమస్యకు విరుగుడు మనచేతుల్లోనే ఉంది. భారతదేశంలోని సముద్రతీర ప్రాంతాలు తరచూ తుఫానులకు గురౌతున్నాయి. నదులన్నీ పోటెత్తి వరదలు ముంచెత్తుతున్నాయి.ఉత్తరభారతంలో సంభవించిన విలయాలను విస్మరించలేం.ఆంధ్రప్రదేశ్‌లో గతంలో సంభవించిన కోనసీమ తుఫాను సృష్టించిన బీభత్సాన్ని, 1977 వ సంవత్సరంలో దివిసీమ ఉప్పెన సంఘటన దుష్ఫలితాలను,ఉత్తర కోస్తాలో సంభవించిన హుద్‌హుద్ తుఫాన్ విలయాన్ని,టిట్లీతుఫాను సృష్టించిన భయానక సంఘటనలను తలచుకుంటే గగ్గుర్పాటు కలుగకమానదు.కోస్తా తీరప్రాంతం తరచూ తుఫాను కోరల్లో చిక్కుకుని,ప్రళయగర్జన చేస్తున్నది.అపారమైన ప్రాణ నష్టం, ఆస్తినష్టం సంభవిస్తున్నది. వరదల కారణంగా చేతికొచ్చిన పంటలన్నీ సర్వనాశనమోతున్నాయి.ప్రజలఆస్తులకు, ప్రాణాలకు విపరీతమైన నష్టం వాటిల్లడం తరచూ జరుగుతున్న ప్రకృతి ప్రకోప సంఘటనల పర్యవసానమే.ఇక భూకంపాలు కూడా విపత్తే ప్రపంచంలోనూ, మన దేశంలోను సంభవించిన పలు భూకంపాలు విపరీతమైన నష్టం కలుగచేయడం విదితమే. గతంలో జరిగిన భూకంపాల వలన చిలీ వంటి దేశం చిగురుటాకులా వణికిపోయింది. జపాన్‌లో తరచూ సంభవించే భూకంపాల గురించి ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరం లేదు. ఇరాన్,ఇరాక్‌లలోనూ, మరికొన్ని దేశాల్లోను గతంలో ఎన్నోభూకంప ప్రళయాలు సంభవించాయి. మన దేశంలో మహారాష్ట్రలోని లాతూర్ భూకంప విలయాన్ని మరచిపోలేము. భూకంపాలు సంభవించడంలో కూడా మానవ తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయి. రిజర్వాయర్ల నిర్మాణం, నీటి ప్రాజెక్టులు,క్వారీలు,లోతైన బోరు బావులు భూకంపాలకు కారణమోతున్నాయి. అసాధారణ రీతిలో సాగుతున్న భూగర్భ సంపద వెలికితీత ప్రక్రియ భూకంపాలకు కారణభూతమోతున్నాయి.ప్రకృతి, పర్యావరణ, వాతావరణ సంబంధిత విపత్తుల్లోను, మానవ వైఫల్యాలవలన జరుగుతున్న విపత్తుల్లోను అపారమైన ప్రాణ నష్టం జరగడం బాధాకరం.శాస్త్ర,సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతి మానవ సుఖజీవనానికి వినియోగపడడం శుభదాయకమే అయినప్పటికీ,మానవ విజ్ఞానం వెర్రితలలు వేసి, అసలుకే ఎసరు పెడుతున్నది.విపత్తులకు మూలకారణమౌతున్నది. మానవ స్వార్థ ప్రయోజనాల ఫలితంగా ఏర్పడుతున్న విపత్తులను అరికట్టడం కొంతవరకు మన చేతుల్లోనే ఉంది. అలాగే ప్రకృతి సంబంధిత విపత్తుల వలన జరిగే ప్రాణ,ఆస్తినష్టాలను కనీస స్థాయికి తగ్గించడం కూడా సుసాధ్యమే. ఇందుకు ప్రభుత్వాలు,ప్రజలు కంకణబద్ధులుకావాలి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కూడా ఇదేవిధమైన ఆలోచనలతో ప్రజలను జాగృతం చేయాలని భావించి 2009 వ సంవత్సరంలో ఒక తీర్మానంచేసింది. అంతర్జాతీయ విపత్తుల తీవ్రతను తగ్గించేందుకు ప్రజల ప్రేరణతో ఒక ఉద్యమంగా మలచడానికి ప్రతీఏటా అక్టోబర్ 13వ తేదీన నిర్వహించే 'ఇంటర్నేషనల్ డిజాస్టర్ రిస్క్‌రిడక్షన్ డే'ఒక అవగాహనా కార్యక్రమం.ఎన్నిసంస్థలు ఎన్నివిధాలుగా కృషిచేసినా, ప్రజాచైతన్యం, ప్రజాభాగస్వామ్యం లేనిదే ఏ ప్రయత్నమైనా నిర్వీర్యం కాక తప్పదు.కాబట్టి లోకకల్యాణార్థం చేపట్టే కార్యక్రమాలకు,సంకల్పానికి వికల్పం కలగకుండా చూడవలసిన బాధ్యత ప్రజలపైన,ప్రభుత్వాలపైన ఎంతైనాఉంది. ●

# హింసాత్మక ధోరణులతో పెరుగుతున్న అశాంతి

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ప్రపంచంలో మానవజాతిని కలవరపెడుతున్న హింసాత్మక సంఘటనలు దేశాల మధ్య అంతర్గత యుద్ధాల వలన కోలుకోలేకపోతున్న సామాన్య జనాల గోడు పట్టించుకునే నాథుడు లేనిపరిస్థితి. కానీ కొందరు శాంతి కాముకులమని చెప్పుకుంటునే యుద్ధాలకు ఊపిరినందిస్తున్న కొన్ని అగ్రదేశాల కుటిల నీతి యుద్ధ ఆంక్షలతో,భిన్న వైఖరులు అంతర్గత ఆలోచనలో మతోన్మాదమే ప్రధాన లక్ష్యంగా హింసాత్మక వైఖరితో కొన్ని దేశాలు పరస్పర దాడులకు ఒడిగడుతున్న సందర్భాల్లో ప్రమాద అంచున దిక్కుతోచని మానవ జీవన ప్రయాణాలు యుద్ధబీజాలతో అణు ఆయుధాల బెదిరింపుల భయంతో బీతిల్లిపోతున్న సామాన్య జనాలు పుట్టి పెరిగిన ప్రదేశాలను వదిలి బ్రతుకు జీవుడా అని సుదూర ప్రాంతాలకు తరలివెళ్తున్న సందర్భాలు ప్రపంచ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో గోచరిస్తూనే ఉన్నాయి. నిజంగా పరస్పర సామరస్యంతో సంభాషణలకు వేదికగా సమస్య సాధనకు పరిష్కరించుకునే శైలి నేటి ఆధునిక జీవన విధానాల్లో సులభతరమైనప్పటికీ కొన్ని దేశాలు అత్యాధునిక ఆయుధాల సంపత్తి ముసుగులో ఆధిపత్యం కోసం మధ్యవర్తిత్వం నెపంతో నిరంతర దేశాల మధ్య యుద్ధ ప్రమాదాలకు కారణం అవుతున్నయేమో అనిపిస్తుంది. ప్రపంచంలోని ఏమతం కూడా మతోన్మాదానికి వత్తాసు పలుకదు.మానవుల మధ్య భిన్నాభిప్రాయాలున్నప్పటికీ మతాల మధ్య శాంతియుత అవగాహన ఆలోచన విధానాలు కలిగిన ఏకరూప సారూప్యత ఉందని గ్రహించాలి. అయితే మతాల సారం మానవ జాతి మనుగడే అని తెలిసినా కొన్ని దేశాల మధ్య జరుగుతున్న దురాక్రమణ ధోరణి గమనిస్తే మానవుని ఆలోచన, మేధస్సు కుంచితత్వంతో కుదించకపోతుందా అనిపిస్తుంది. ఆధునికత సంతరించుకుంటున్న నేటి ప్రపంచంలోని మానవ జీవన విధానాల్లో అక్షరాస్యత క్రమం అభివృద్ధి చెందుతున్న దశలో ఆధునిక పోకడలతో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరాలకు అనుగుణమైన రీతిలో ఉపయోగించుకునే విధానాన్ని సులభతరం చేసుకుంటున్నటువంటి నాగరిక ప్రపంచంలో శాంతియుత జీవనవిధానాలకు విఘాతం కలిగించే యుద్ధ వాతావరణాన్ని కొందరు ఆకాంక్షించడం పర్యవసానంగా సామాన్య జీవనవిధానాలపై ప్రభావం చూపిస్తున్నాయి. ప్రధానంగా నేటి ఆధునిక పౌర సమాజం ఎదుగుతున్న క్రమంలో అవసరమైన మానవీయ విలువలతో కూడిన ఆలోచన విధానాలను ప్రతిబింబించేలా సమాజంలో మెరుగైన మానవ సంబంధాలు మంచి దృక్పథాలను కలిగే విధంగా ఆలోచన స్థాయిని మెరుగుపరిచేందుకు భావితరానికి ఉన్నతమైన విలువలను నేర్పించే బాధ్యతను అనుభవజ్ఞులైన బోధకులు అభ్యాసకులకు అలవర్చినట్లయితే విచక్షణ కలిగిన ఆలోచనావిధానంతో నైతిక విలువలతో కూడిన మానవ సమాజం ముందుకు పురోగమిస్తుంది. మానవ జీవన విధానాల్లో బాల్యదశ నుండి సరైన నిర్దేశకత లేక మానవీయ కోణంలో ఆలోచించే ధోరణి తగ్గిపోవడం కనికరం లేని కఠినత్వపు హింసాత్మక సంఘటనలు సమాజంలో ఎక్కువ అవుతుండటం మానవజాతిని కలవర పెడుతున్నాయి. అనాలోచిత దుశ్చర్యలు మానవీయ సంబంధాల మధ్య పెరుగుతున్న అగాధం మంచులా కరిగిపోతున్న ఆత్మీయతలు,హింస ప్రవృత్తి కలిగిన ఉగ్రవాదం,అంతర్గతంగా దేశభద్రతకు విఘాతం కలిగించే స్వార్థపూరిత దేశద్రోహులు ఇలా చెప్పుకుంటూ పోతే హింసాత్మక సంఘటనలకు పాల్పడుతున్నకొందరి మనస్తత్వాలు దయా,జాలి,కరుణ లేక విద్రోహులుగా మారి జాతీయ సమైక్యతవాదాన్ని మరిచి క్షమించరాని దోషులుగా మిగిలిపోతున్నారు.గత కాలంలో కరోనా వైరస్ విజృంభించిన తరుణంలో మానవ జాతి మొత్తం వణికిపోయి ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని బతుకు జీవుడా అని జీవితాలను వెల్లదీసిన నాటి జ్ఞాపకాలు మదిలో నుండి చెరిగిపోక మునుపే ప్రపంచంలో మతవిద్వేషాలతో దేశాల ఆధిపత్య ధోరణితో హింసాత్మక సంఘటనలతో యుద్ధాల వల్ల వణికిపోతున్న సామాన్య జనాలు చేసిన నేరం ఏమిటో అర్థంకాని పరిస్థితులు ఒకవైపు, మానవ మేధస్సు ఆలోచనలో మితిమీరిన విద్వేషాల పరంపర కరోనా వైరస్ కంటే భయంకరంగా ఉన్నాయానే సందేహాలు మరోవైపు.ఈక్రమంలో శాంతియుత మార్గాన్నిఎన్నుకునేఆలోచనలను ప్రతి బింబించేందుకు మానవమేధస్సు మరింత పరిణితి చెందాలి. ●

# మాదకద్రవ్యాల నిషేధం సమాజ బాధ్యత!



మేకిరి దామోదరం

విచక్షణాజ్ఞానం గల మనిషిని మాదకద్రవ్యాలు మృగంగా మార్చేస్తూ, ప్రజా ఆరోగ్యానికి, శాంతి భద్రతలకు ప్రథమ శత్రువులుగా పరిణమించాయి.గంజాయి, హెరాయిన్, కొకైన్, మెఫీడ్రిన్ వంటి పదార్థాలు నిత్యం ఎక్కడో ఒకచోట పట్టుబడుతూనే ఉన్నా, అదే సమయంలో ఎన్నో రెట్లు ఎక్కువ పరిమాణంలో మత్తు పదార్థాలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరి వినియోగదారుల కోరికలు తీర్చేస్తున్నాయి. విదేశాల నుంచి భారత్‌లోకి చోరబాట్ల ద్వారా ప్రవేశిస్తున్న ఈ మత్తు పదార్థాలకు తోడు, స్థానిక పరిశ్రమల్లో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న డ్రగ్ తయారీ దందాలు దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారాయి. ఇటీవల హైదరాబాద్‌లోని చర్లపల్లి ప్రాంతంలో పోలీసుల దాడిలో కోట్ల రూపాయల విలువైన మెఫీడ్రిన్ మత్తుమందు, ముడిసరుకులు స్వాధీనం కావడం ఈ వ్యవస్థీకృత నేరాల విస్తృతిని సూచిస్తోంది. గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కూడా ఇలాగే రూ.230కోట్ల విలువైన డ్రగ్స్ ఉత్పత్తి సామగ్రి పట్టుబడింది. ఇవన్నీ ప్రాణాధార ఔషధాల ముసుగులో జరుగుతున్న నేర కార్యకలాపాలు. వీటిని సమూలంగా అరికట్టకపోతే దేశాన్ని అనారోగ్యం, అల్లకల్లోలం వైపు నెడతాయి. పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు, వృత్తి,సాంకేతిక విద్యాలయాల వరకు మత్తుమందుల ప్రభావం విస్తరిస్తోంది. యువతలో ఒత్తిడి తగ్గించుకోవడం పేరుతో లేదా స్నేహితుల ప్రోత్సాహంతో డ్రగ్స్‌వైపు అడుగులు వేస్తున్నారు. ఉన్నత విద్యావంతులు, డాక్టర్లు, ఇంజినీర్లు సైతం ఈ మాదక రక్కసి కబంధహస్తాల్లో చిక్కి విలవిల్లాడుతున్నారు. మత్తు అలవాటుతో మానసిక స్థైర్యం కోల్పోయి నేరాలకు పాల్పడడం, ఆత్మహత్యలు చేసుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. డ్రగ్స్ ట్రీట్మెంట్ క్లినిక్‌లకు వెళ్ళే వారిసంఖ్య ఐదేళ్లలో 1300 శాతం పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి.ఇండోర్, ముంబై, చెన్నై, లఖ్‌నౌవంటి నగరాల్లో ఈ మహమ్మారి విస్తరిస్తూ ఉంది. మన రాష్ట్రంలోనే మత్తు మార్కెట్ విలువ దాదాపు1000 కోట్లకు పైగా ఉందని అధికారులు చెబుతున్నారు. పట్టుబడుతున్న మత్తు మందులు మొత్తం వ్యాపారంలో 10శాతానికి కూడా చేరవు. స్థానికంగా ఉత్పత్తి అవుతున్న గంజాయి,లాటిన్ అమెరికా నుంచి వచ్చే హెరాయిన్, అలాగే ఔషధ కర్మాగారాల రూ



పంలో తయారవుతున్న రసాయన డ్రగ్స్ మార్కెట్లో సులభంగా లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం 44కు పైగా రకాల మత్తు పదార్థాలు వినియోగంలో ఉన్నాయని అధికారుల అంచనా. ఇటీవల మహారాష్ట్ర పోలీసులు చర్లపల్లి పారిశ్రామికవాడలో రూ.12కోట్ల విలువైన మత్తు మందులు స్వాధీనం చేసుకోవడం, గత ఏడాది రూ.139 కోట్లు, ఈ ఏడాది జూలైవరకు రూ.68కోట్ల విలువైన డ్రగ్స్ ఈగల్‌అధికారులు పట్టుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియ జేస్తున్నాయి. పట్టణాలు, నగరాల ప్రతిమూలలో గంజాయి మత్తులో తేలుతున్న యువతను చూడడం ఇప్పుడు సాధారణదృశ్యమైంది. హైదరాబాద్‌లో ఖరీదైన హెరాయిన్, కొకైన్‌డ్రగ్స్‌తో పార్టీలు నిర్వహించడం ఫ్యాషన్‌గా మారింది. ముఠాలు మొదట ఉచితంగా సరఫరాచేసి, తరువాత ఆ వ్యక్తులను అమ్మకందారులుగా మార్చే వ్యూహం అవలంబిస్తున్నాయి.ఈ వ్యాపారం వ్యవస్థీకృతంగా సాగుతోంది. ప్రభుత్వం దీని కట్టడికి చర్యలు ప్రారంభించినా, అధికారుల కన్నుగప్పి వ్యాపారం విస్తరిస్తూనే ఉంది.2023లో ఈగల్ అధికారులు 104.75 గ్రాముల కొకైన్‌స్వాధీనం చేసుకోగా,2024లో అది336.56 గ్రాములుగా పెరిగింది. అలానే హెరాయిన్ విషయంలో కూడా ఇదే ధోరణి 2023లో 419 గ్రాములు, 2024లో 2,160.67 గ్రాములు పట్టుబడ్డాయి. నిన్నటికి నిన్న హైదరాబాదులో నిషేధిత ఎఫి డ్రిన్ మత్తు పదార్థాన్ని భారీగా తయారు చేసి విక్రయించేందుకు సిద్ధమైన ముఠాగుట్టు రట్టు చేసినది తెలంగాణ ఈగల్ (ఎలిటీ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) పట్టుకుంది. 220 కిలోల ఎఫీడ్రిన్ స్వాధీనం చేసుకున్నదీని విలువ రూ.72కోట్ల విలువ అంతర్జాతీయ మార్కెట్లో ఉంటుందంటున్నారు.ఈ పరిస్థితులు, గణాంకాలు భయంకర దిశను చూపుతున్నాయి. ఇలా ఊడలు దిగిన డ్రగ్స్‌విష వ్యాపారాన్ని నిర్మూలించాలంటే?కేంద్రం అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలి.దీనికి సంబంధించిన ముడిసరుకులు ఎక్కడినుంచి వస్తున్నాయి, ఏ ప్రాంతాల్లో మత్తుమందులను ఎలా తరలిస్తున్నారు అనే అంశాలపై లోతుగా ఆరాతీయాలి. ఆ రవాణా వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేయాలి. దేశవ్యాప్తంగా అన్నిపారిశ్రామిక ల్యాబ్ల కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. డ్రగ్స్ కేసులను పగడ్బందీగా దర్యాప్తుచేసేలా సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. దీని వెనుక అసలు సూత్రధారులను కటకటాల్లోకి నెట్టడం అత్యవసరం.వారికి వెంటనే కఠిన శిక్షలు పడాలంటే డ్రగ్స్ కేసుల విచారణ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి.నిర్లక్ష్యం వహిస్తే భావితరం ఇంకా బలహీనమై జాతి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోంది.ప్రభుత్వం కఠినచట్టాలతో పాటు పునరావాస కేంద్రాల ద్వారా మత్తుకు బానిసలైనవారికి సహాయంచేయాలి. ప్రతిపౌరుడు ఈ సమస్యపై బాధ్యతగాస్పందిస్తేనే రేపటితరాన్ని రక్షించగలం. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమెరికా బెదిరింపులకు భయపడం

## ప్రతీకార చర్యలకు వెనుకాడబోం
## ట్రంప్‌కు చైనా తీవ్ర హెచ్చరిక



**బీజింగ్, అక్టోబరు 12:** అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం తారస్థాయికి చేరింది. చైనా నుంచి వచ్చే అన్ని దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. దీనిపై చైనా తీవ్రంగా స్పందించింది. అమెరికా ఏకపక్షంగా ద్వంద్వ ప్రమాణాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, తాము ప్రతీకార చర్యలకు వెనుకాడబోమని గట్టిగా హెచ్చరించింది.నవంబర్ 1 నుంచి చైనా నుంచి దిగుమతయ్యే అన్నివస్తువులపై ప్రస్తుతం ఉన్న పన్నులకు అదనంగా 100శాతం సుంకం అమల్లోకి వస్తుందనితెలిపారు. అంతేకాకుండా, అమెరికాలో తయారైన కీలకమైన సాఫ్ట్‌వేర్ల ఎగుమతులపై కూడా కఠినమైన నియంత్రణలు విధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చైనా వాణిజ్యపరంగా అత్యంత దూకుడుగా వ్యవహరిస్తోందని, దానికి తగిన బదులు ఇవ్వాల్సిన సమయం వచ్చిందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ట్రంప్ నిర్ణయంపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆదివారం ఘాటుగా స్పందించింది. అమెరికా చర్యలు తమ దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని, ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చల వాతావరణాన్ని పూర్తిగా దెబ్బతీస్తాయని పేర్కొంది. మేము యుద్ధాన్ని కోరుకోవడంలేదు, కానీ పోరాడటానికి భయపడం అని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. అమెరికా తన వైఖరిని మార్చుకోకపోతే తమ చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దీనిలో భాగంగా అమెరికాకు చెందిన నౌకలపై ప్రత్యేక పోర్టు ఫీజులు విధించనున్నట్లు తెలిపింది. ప్రపంచ టెక్నాలజీ పరిశ్రమకు కీలకమైన రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఎగుమతులను చైనా కఠినతరం చేసింది. దీనికి ప్రతిస్పందనగానే ట్రంప్ ఈ భారీ సుంకాలను ప్రకటించారు. ఈ వాణిజ్య పోరు కారణంగా ఎలక్ట్రానిక్స్,ఎలక్ట్రిక్ వాహనాల వంటి రంగాలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరో వైపు, కొద్దివారాల్లో దక్షిణ కొరియాలో ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య జరగాల్సిన సమావేశం కూడా ఈ పరిణా మాలతో రద్దయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

## ఇకపై విద్యాసంస్థల్లో ఫీజులూ డిజిటల్ చెల్లింపులే..
### రాష్ట్రాలకు లేఖలు రాస్తున్న కేంద్రం

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యా రంగాన్ని కూడా అదే దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో ఫీజుల చెల్లింపులను పూర్తిగా డిజిటల్ విధానంలో స్వీకరించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర విద్యాశాఖ తాజాగా రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ విద్యా సంస్థలను ఆదేశించింది. డిజిటల్ లావాదేవీల విస్తరణ యూపీఐ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్/డెబిట్ కార్డు వంటి డిజిటల్ చెల్లింపు పద్ధతులు ప్రస్తుతం దేశవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగంలో ఉన్నాయి. చిన్న కొనుగోళ్ల నుంచి పెద్ద వ్యాపారాల వరకు డిజిటల్ పేమెంట్ వ్యవస్థ సాధారణమైంది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో కూడా ఫీజులు, అడ్మిషన్ రుసుములు, పరీక్ష ఫీజులు వంటి చెల్లింపులు యూపీఐ ద్వారా స్వీకరించేలా ప్రోత్సాహక చర్యలు తీసుకోవాలని కేంద్ర విద్యాశాఖ సూచించింది. ఎన్‌సీఈఆర్‌టీ, సీబీఎస్ఈ, కేవీఎస్, ఎన్‌వీఎస్‌లకు ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్ర పాఠశాలలకే కాకుండా, కేంద్రానికి చెందిన జాతీయ విద్యా సంస్థలకు కూడా ఇదే సూచనలు వర్తిస్తాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. జాతీయ విద్యా పరిశోధన మండలి, సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్, నవోదయ విద్యాలయ సమితిలకు లేఖలు పంపి, తమ పరిధిలోని పాఠశాలల్లో డిజిటల్ చెల్లింపు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. నగదు నుంచి డిజిటల్ వైపు పారదర్శకత, సౌలభ్య అని ఈ నిర్ణయం వల్ల తల్లిదండ్రులు ఇంటి నుంచే సులభంగా ఫీజులు చెల్లించగలరని, పాఠశాలల వద్ద క్యూలు తగ్గుతాయని విద్యాశాఖ తెలిపింది. అదనంగా, ప్రతి లావాదేవీకి డిజిటల్ రసీదు లభించడం వల్ల పారదర్శకత పెరుగుతుందని, అకౌంటింగ్ వ్యవస్థ మరింత సులభతరం అవుతుందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "డిజిటల్ భారత్" కార్యక్రమంలో విద్యా రంగం కీలక పాత్ర పోషించగలదని అధికారులు పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు, తల్లిదండ్రులు డిజిటల్ లావాదేవీలకు అలవాటు పడడం వల్ల ఆర్థిక అక్షరాస్యత పెరిగే అవకాశం ఉందన్నారు. విద్యా సంస్థల్లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ప్రవేశపెట్టడం ద్వారా ఆర్థిక నిర్వహణ మరింత సమర్థవంతంగా మారనుందని, నగదు ఆధారిత వ్యవస్థలలో ఉండేఅస్పష్టతలు తగ్గుతాయని విద్యాశాఖ విశ్వాసం వ్యక్తంచేసింది. డిజిటల్ పద్ధతుల్లో ఫీజుల చెల్లింపులు అమలులోకి రావడం ద్వారా విద్యా రంగం ఆధునీకరణ దిశగా మరో కీలక మైలురాయిని చేరుకున్నట్లు భావిస్తున్నారు.

## పడిపోతున్న జననాల రేటు..
### వరుసగా మూడోసారి తగ్గిన జననాల నమోదు

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** దేశంలో జననాల నమోదు గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. 2022 సంవత్సరంతో పోలిస్తే 2023లో రెండు లక్షలకు పైగా జననాలు తక్కువగా నమోదయ్యాయి. గత ఐదేళ్ల కాలంలో జననాల నమోదు తగ్గడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇదే సమయంలో మరణాల నమోదులో స్వల్ప పెరుగుదల కనిపించింది. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) విడుదల చేసిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) 2023 నివేదికలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నివేదిక ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా 2.52 కోట్ల జననాలు నమోదయ్యాయి. ఇది 2022లో నమోదైన జననాలతో పోలిస్తే 2,32,094 (0.9 శాతం) తక్కువ. దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గుతోందనడానికి ఇది ఒక సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. మరో వైపు, 2023లో మొత్తం 87 లక్షల మరణాలు నమోదయ్యాయి. 2022తో పోలిస్తే ఇది కేవలం 9,749 (0.1 శాతం) ఎక్కువ కావడంతో, మరణాల సంఖ్య దాదాపు స్థిరంగా ఉన్నట్లేనని నివేదిక స్పష్టం చేసింది. ఈ నివేదికలో మరి



కొన్ని ఆందోళనకరమైన అంశాలు కూడా ఉన్నాయి. దేశంలో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో జరిగే ప్రసవాల శాతం క్రమంగా తగ్గుతోంది. 2022లో ఇది 75.5 శాతంగా ఉండగా, 2023 నాటికి 74.7 శాతానికి పడిపోయింది. కరోనా మహమ్మారికి ముందు ఇది 80 శాతానికి పైగా ఉండేది. అలాగే, సరైన సమయంలో వైద్య సహాయం అందక ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. 2022లో ఇలాంటి మరణాలు 50.7 శాతంగా నమోదు కాగా, 2023లో ఆ సంఖ్య 53.4 శాతానికి పెరిగింది. కరోనాకు ముందు ఈ తరహా మరణాలు 40 శాతం లోపే ఉండటం గమనార్హం. ఈ గణాంకాలు దేశ ఆరోగ్య వ్యవస్థ పనితీరుపై కొత్త చర్చకు దారితీస్తున్నాయి.

## ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్
### ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్‌సిసి కూడా
### గాజా శాంతి ఒప్పందానికి రావాలంటూ ఆహ్వానం
### భారత్ తరఫున విదేశాంగ సహాయ మంత్రి కీర్తి వర్దన్ హాజరు



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేశాడు. సోమవారంనాడు ఈజిప్టులో జరుగనున్న గాజా శాంతి ఒప్పందం కార్యక్రమానికి రావాలంటూ ఆహ్వానించారు. ట్రంప్‌తోపాటు ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్‌సిసి కూడా మోడీకి ఫోన్ చేసి ఆహ్వానించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. భారత్ తరఫున ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి బదులుగా, కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్దన్ హాజరుకానున్నారు. ఈజిప్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం షర్మ్ ఎల్ షేక్‌లో గాజా శాంతి ఒప్పందం జరగనుంది. గాజా యుద్ధాన్ని ముగించి, శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది.

ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫతా అల్‌సిసి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రపంచ దేశాల నేతలు కూడా పాల్గొననున్నారు. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సహా 20కి పైగా దేశాల నాయకులు హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం. అయితే ఇందులో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ పాల్గొంటారా? లేదా? అనేది ఇంకా తెలియరాలేదు.

## లక్నోలో బాలికపై సామూహిక లైంగికదాడి

**లక్నో, అక్టోబరు 12:** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో దారుణ ఘటన చోటుచేసుకుంది. 16 ఏళ్ల బాలికపై ఐదుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఒకరిని ఎన్‌కౌంటర్ చేసి మరీ అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలు శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన సోదరి ఇంటికి వెళ్లేందుకు ఒక పరిచయస్తుడితో కలిసి మోటార్‌సైకిల్‌పై బయలు దేరింది. మార్గమధ్యలో బంత్రా ప్రాంతంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న మామిడి తోట వద్ద వారు ఆగారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఐదుగురు వ్యక్తులు, బాలికతో ఉన్న వ్యక్తిని చితకబాది, ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఈ క్రమంలో గత రాత్రి హరౌనీ రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు చేస్తుండగా, బైక్‌పై వస్తున్న ఇద్దరు అనుమానితులను ఆపేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారు పోలీసులపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఒక నిందితుడి కాలికి బుల్లెట్ తగిలింది. గాయపడిన నిందితుడిని లలిత్ కశ్యప్‌గా గుర్తించామని, అతడిని ఆసుపత్రికి తరలించామని డీసీపీ నిపుణ్ అగర్వాల్ తెలిపారు.

## హిందూమైనార్టీలపై దాడులు అంతా ఫేక్ న్యూస్: మహ్మద్ యూనస్



**ఢాకా, అక్టోబరు 12:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై హింస జరుగుతోందంటూ వస్తున్న వార్తలను ఆ దేశ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ తీవ్రంగా ఖండించారు. ఇదంతా భారత్ నుంచి ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేస్తున్న ఫేక్ న్యూస్ అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. గత వారం అమెరికన్ జర్నలిస్ట్ మెహదీ హాసన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్‌లో ఫేక్ న్యూస్ ఒక ప్రత్యేకతగా మారిపోయింది. అక్కడి నుంచి తప్పుడు వార్తలు వెల్లువెత్తుతున్నాయని యూనస్ ఆరోపించారు. దేశంలో జరుగుతున్న కొన్ని సంఘటనలను మతపరమైనవిగా చిత్రీకరిస్తున్నారని, అవి కేవలం భూవివాదాలు వంటి స్థానిక సమస్యల కారణంగా పొరుగువారి మధ్య జరిగే సాధారణ గొడవలు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ నిరంతరం ఒత్తిడి తెస్తున్నందున తమ ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

## రాత్రివేళల్లో బాలికలను బయటికి వెళ్లనీయొద్దు
### విద్యార్థినుల భద్రత ఆయా వైద్యకళాశాలలదే
### అయినా చర్యలుచేపట్టాం, ముగ్గురిని అరెస్టు చేసాం...
### మరింతగా దర్యాప్తు జరుగుతోంది: సీఎం మమతా బెనర్జీ



**కోల్‌కత్తా, అక్టోబరు 12:** పశ్చిమ బెంగాల్‌లో మెడికల్ కాలేజీ విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి జరిగిన ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మౌనం వీడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలను రాత్రివేళల్లో బయటకు వెళ్లనివ్వకూడదని వ్యాఖ్యానించారు. మెడికల్ కాలేజీ విద్యార్థిని భద్రతను నిర్ధారించడంపై ప్రైవేట్ మెడికల్ కాలేజీ బాధ్యత అని ఇందులోకి ప్రభుత్వాన్ని లాగడం అన్యాయమన్నారు. ముఖ్యంగా రాత్రిపూట ఆడపిల్లను బయటకు రావడానికి అనుమతించకూడదని వారు కూడా తమను తాము రక్షించుకోవాలన్నారు. గ్యాంగ్‌రేప్ ఘటనను 'షాకింగ్' అని పేర్కొన్నారు. ఇది ఒక దిగ్భ్రాంతికరమైన సంఘటన ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారని.. పోలీసులు మరికొందరి కోసం గాలిస్తున్నారని ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. దాదాపు ఒక నెల కిందట ఒడిశాలోని పూరి బీచ్‌లో ఒక విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన సంఘటనను ప్రస్తావించారు. ఒడిశా ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకుంటోంది ఆమె ప్రశ్నించారు. అక్టోబర్ 10న పశ్చిమ బర్ధ మాన్ జిల్లా దుర్గాపూర్‌లో ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. విద్యార్థిని మెడికల్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆ రోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో అదే కళాశాలకు చెందిన ఒక విద్యార్థి తన స్నేహితులతో కలిసి విద్యార్థినిని నిర్జన ప్రదేశానికి రప్పించి ఆ తర్వాత ఫోన్, డబ్బులు లాక్కోవడంతోపాటు లైంగిక దాడికి పాల్పడినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. విద్యార్థిని తన కుమార్తెకు బెంగాల్‌లో భద్రత లేదని, తిరిగి ఇంటికి తీసుకువెళ్తామని.. ఆమెను ఇక్కడ ఏ క్షణంలోనైనా చంపే ప్రమాదం ఉందం టూ అనుమానం వ్యక్తం చేశారు. తమ కూతురిని తిరిగి ఒడిశాకు తీసుకెళ్తామని తమకు నమ్మకం పోయిందని పేర్కొన్నారు. ఆమె బెంగాల్‌లో ఉండడం తమకు ఏమాత్రం ఇష్టం లేదని ఆమె ఒడిశాలో తన చదువును కొనసా గిస్తుందని బాధితురాలి తండ్రి మీడియాకు తెలిపారు. ఒడిశా నుంచి దుర్గాపూర్‌కు చేరుకున్న మహిళ తల్లిదండ్రులు న్యూ టౌన్‌షిప్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు.


తన కూతురు ఆరోగ్యం ఏమాత్రం బాగా లేదని నడవనలేని పరిస్థితుల్లో ఉందని వాపోయారు. లైంగిక దాడి వ్యవహారంలో పోలీసులు ఎస్‌కే రిజాయ్ ఉద్దీన్,ఎస్‌కే ఫిర్దౌస్, అప్పు అనే ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న మరో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. మొబైల్ టవర్ డంపింగ్ పద్ధతిలో ముగ్గురు నిందితులను గుర్తించారు. ఈ ఘటనలో మరికొందరి హస్తం ఉందని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగు తుందని పేర్కొన్నారు. బాధితురాలు ఫ్రెండ్ పాత్రపై సైతం పోలీసులు విచారించనున్నారు. గతేడాది ఆర్‌జీ ఖర్ ఆసుపత్రిలో జరిగిన ఘటన మరువక ముందే మరోసారి వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి జరుగడంపై బీజేపీ నాయకురాలు సుకాంత మంజుందార్ తీవ్రంగా విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతల పూర్తి పతనానికి ముఖ్యమంత్రిదే బాధ్యత అని ఈ విషయంలో ఆమె తప్పించుకోలేరన్నారు. ఆశ్చర్యకరంగా ముఖ్యమంత్రి ప్రైవేటు వైద్య కళాశాలపై నిందలు మోపుతుందని విమర్శించారు.



## రెండో పెళ్లికి అంగీకరించలేదని భార్యకు నిప్పంటించిన భర్త

**పాట్నా, అక్టోబరు 12:** ప్రియురాలితో పెళ్లికి నో చెప్పిందని తన రెండో భార్యకు భర్త నిప్పంటించాడు. ఈ దారుణ ఘటన బీహార్‌లోని నలంద జిల్లాలో వెలుగు చూసింది. వికాస్ కుమార్ ఐదేండ్ల క్రితం సునీత దేవి(25)ని వివాహం చేసుకున్నాడు. అతనికి అప్పటికే పెళ్లి అయినట్లు సునీతను వివాహమాడిన తర్వాత ఆమె తల్లిదండ్రులకు తెలిసింది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే సునీతను పెళ్లాడినట్లు తెలిసింది. దీంతో సునీత తల్లిదండ్రులు వికాస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తానికి అతని కుటుంబ సభ్యులు నచ్చజెప్పడంతో సునీత తల్లిదండ్రులు శాంతించారు. కొన్నాళ్లకు సునీత, వికాస్ దంపతులకు ఇద్దరు పిల్లలు జన్మించారు. కానీ పుట్టిన వెంటనే ఆ పిల్లలిద్దరూ చనిపోయారు. ఇక అప్పట్నుంచి కుమార్ సునీతను వేధింపులకు గురి చేస్తున్నాడు. తాను తన ప్రియురాలిని పెళ్లి చేసుకుంటానని, అంగీకరించాలని భార్యను వేధిస్తున్నాడు. ఇందుకు సునీత ఒప్పుకోలేదు. ఈ క్రమంలో ఆమెపై పగ పెంచుకున్న భర్త చంపాలని నిర్ణయించుకున్నాడు. ఆమెను ఓ గదిలో బంధించి పెట్రోల్ పోశాడు. ఆ తర్వాత సిలిండర్‌ను లీక్ చేసి నిప్పంటించాడు. పెట్రోల్ పోసి గదిని మూసిన వెంటనే సునీత తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి వికాస్ దారుణాలను వివరించి, తనకు నిప్పంటిస్తున్నట్లు తెలిపింది. అప్రమత్తమైన తల్లిదండ్రులు వికాస్ ఇంటికి చేరుకునేలోగా ఆమె ప్రాణాలు కోల్పోయింది. దహన సంస్కారాలు కూడా చేసే పనిలో వికాస్ కుటుంబ సభ్యులు నిమగ్నమయ్యారు. అయితే సునీత కుటుంబ సభ్యులను చూసి వికాస్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు పరారీ అయ్యారు. మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫోరెన్సిక్ బృందాలు నమూనాలను సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## కోడ్ ఉల్లంఘించారని ప్రశాంత్‌కిశోర్‌పై కేసు



**పాట్నా, అక్టోబరు 12:** ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణపై జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్‌పై వైశాలి జిల్లాలోని రఘోపూర్‌లో కేసు నమోదైంది. రఘోపూర్ ప్రాంతంలో ప్రశాంత్ కిషోర్ శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించిన అనంతరం ఆయనపై స్థానిక సబ్‌డివిజినల్ అధికారి ఈ ఫిర్యాదు నమోదు చేశారు. ఆర్జేడీ నేత తేజస్వియాదవ్‌కు గట్టి పట్టున్న రఘోపూర్ నుంచి ప్రశాంత్ కిశోర్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

## 58 మంది పాకిస్థాన్ సైనికులు హతం.. 25 ఆర్మీ స్థావరాలు స్వాధీనం : అఫ్ఘానిస్థాన్



**కాబూల్, అక్టోబరు 12:** అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఇరుదేశాల బలగాల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాము 58 మంది పాకిస్థానీ సైనికులను మట్టుబెట్టామని అఫ్ఘానిస్థాన్ ప్రకటించింది. ఇస్లామాబాద్ పదేపదే తమ సరిహద్దుల ఉల్లంఘనలకు పాల్పడిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. అదే విధంగా.. ఐసిస్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించొద్దని పాకిస్థాన్‌ను హెచ్చరించింది. దేశ రాజధాని కాబూల్‌తోపాటు ఓ మార్కెట్‌పై పాకిస్థాన్ బాంబు దాడులు చేసిందని అఫ్ఘానిస్థాన్ ఇటీవల ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే పాక్ దళాలే లక్ష్యంగా ప్రతీకార దాడులు చేపట్టినట్లు సమాచారం. తమ సేనలు పొరుగు దేశానికి చెందిన 25 ఆర్మీ పోస్టులను స్వాధీనం చేసుకున్నాయని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ వెల్లడించారు. 58 మంది పాక్ సైనికులు మృతి చెందారని, మరో 30 మంది గాయపడ్డారని చెప్పారు.

ఇటీవల అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌లో భారీ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) చీఫ్ నూర్ వాలి మెహ్సూద్ స్థావరం లక్ష్యంగా పాక్ యుద్ధ విమానాలు దాడి చేసినట్లు పాక్ రక్షణ విశ్లేషణ సంస్థలు కథనాలు వెలువరించాయి. అయితే, ఈ దాడులపై ఇస్లామాబాద్ ఎటువంటి ప్రకటన చేయలేదు. అఫ్ఘానిస్థాన్ విదేశాంగమంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ భారత పర్యటనలో ఉన్న సమయంలో ఈ దాడులు జరగడం గమనార్హం.

## ఎన్‌డిఎలో కుదిరిన సీట్ల సర్దుబాటు
### జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకటన
### బిజెపి 101, జెడియు 101, ఎల్‌జెపి 29, ఆర్ఎల్ఎం 6, హెచ్ఎఎం 6



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్‌డిఎ కూటమిలో సీట్ల సర్దుబాటు కుదిరింది. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీలో బిజెపి, జెడియులు సరిసమానంగా చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) 6, హిందుస్థానీ అవామ్ పార్టీ (హెచ్ఏఎం-ఎస్) 6 సీట్లు దక్కాయి. "సీట్ల సర్దుబాటు సామరస్యంగా జరిగింది, ఎన్‌డిఎలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆనందంగా స్వాగతించారని పేర్కొంటూ ఈ మేరకు జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్‌కుమార్ ఝా ఎక్స్ వేదికగా ప్రకటించారు. భారీ మెజారిటీతో నితీష్‌కుమార్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడానికి ఐక్యంగా ఉన్నారని సంజయ్ తన పోస్ట్‌లో రాశారు.

2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 115 సీట్లలో జెడియు, 110 స్థానాల్లో పోటీ చేసిన బిజెపి ఈసారి ఆ సంఖ్యను తగ్గించుకున్నాయి. ఆ మేరకు కూటమి భాగస్వామ్య పార్టీలకు సీట్లను కేటాయించాయి. నాడు ఎన్‌డిఎ కూటమి తరఫున వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) 11 సీట్లలో పోటీ చేసింది. తాజా విఐపి మహాఘట్ బంధన్ కూటమిలో చేరింది. ఈ నేపథ్యంలోనే ఎన్‌డిఎ కూటమిలోని బిజెపి-జెడియులు తమ సీట్లను త్యాగం చేసి భాగస్వామ్య పార్టీలకు ప్రధానంగా చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జెపికి 29 సీట్లు కేటాయించింది. గత ఎన్నికల్లో నితీష్‌తో విభేదించి, 135 స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగిన విషయం తెలిసిందే. తాజా ఎన్నికల్లో ఎన్‌డిఎ తరఫున ఎల్‌జెపి 29 స్థానాల్లో పోటీ చేయనుంది.

ఇక ఆర్‌జెడి, కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్ కూటమి సీట్ల సర్దుబాటుకు సంబంధించి చర్చలు కొనసాగుతున్నాయి, నేడో రేపో అధికారికంగా ప్రకటన చేసే అవకాశముందని ఆర్‌జెడి నేతలు చెబుతున్నారు. ఇప్పటికే తొలి దశ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడగా, సోమవారం రెండో దశ నోటిఫికేషన్ రానుంది.

నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరుగనుంది.

## సంక్షిప్తంగా..

### బిఎస్‌ఎఫ్ ఎయిర్‌వింగ్‌లోకి మహిళ



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** భారత సైన్యంలోకి మహిళల ప్రవేశం ఇటీవలే ప్రారంభమైంది. అందులో భాగంగానే సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్) వైమానిక విభాగంలోకి తొలిసారిగా మహిళా ఫ్లైట్ ఇంజినీర్ ప్రవేశించింది. బిఎస్‌ఎఫ్ 50ఏళ్ల చరిత్రలో మహిళ బిఎస్‌ఎఫ్‌లోకి అడుగుపెట్టడం ఇదే తొలిసారి. ఇన్‌స్పెక్టర్‌గా భావన చౌదరితోపాటు మరో నలుగురు సహోద్యోగులు (పురుషులు) ఇటీవల బిఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరి నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. 1969 నుంచి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బిఎస్‌ఎఫ్ వైమానిక కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అంతేగాక సాయుధ బలగాలు, ఎన్ ఎస్‌జి, ఎన్‌డిఆర్‌ఎఫ్ తదితర ప్రత్యేక దళాలకు సంబంధించిన కార్యనిర్వాహక అంశాలను బిఎస్‌ఎఫ్ పర్యవేక్షిస్తోంది. అందులో భాగంగానే వైమానిక విభాగంలోకి ఓ మహిళా అధికారితోపాటు నలుగురుని నియమించినట్లు బిఎస్‌ఎఫ్ డిజి దల్జీత్ సింగ్ చౌదరి తెలిపారు.

### 20 బంగారం బిస్కెట్లు సీజ్



**కోల్‌కతా, అక్టోబరు 12:** భారత్- బంగ్లాదేశ్ సరిహద్దులో అక్రమంగా రవాణా చేస్తున్న 20 బంగారం బిస్కెట్లను సరిహద్దు భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ అంతర్జాయ మార్కెట్‌లో రూ.2.82 కోట్ల మేర ఉంటుందని బిఎస్‌ఎఫ్ అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లోని నడియా జిల్లాలో ఈఘటన చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ నుంచి 2332.66 గ్రాముల బరువుగల 20 బంగారం బిస్కెట్లను ఓ ప్లాస్టిక్ కవర్‌లో తీసుకొస్తుండగా, పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టి, పట్టుకున్నట్లు బిఎస్ఎఫ్ సౌత్ బెంగాల్ అధికారులు వెల్లడించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

### ఆపరేషన్ బ్లూస్టార్ సరైన నిర్ణయం కాదు: చిదంబరం



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** స్వర్ణదేవాలయం నుంచి ఉగ్రవాదులను ఏరివేసేందుకు చేపట్టిన ఆపరేషన్ బ్లూస్టార్ సరైన మార్గంకాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం అన్నారు.ఆ ఆపరేషన్ కారణంగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తన ప్రాణాలనే కోల్పో వాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఆపరే షన్ బ్లూస్టార్ సరైన మార్గం కాదని, ఆ విష యాన్ని తాను అంగీకరిస్తానని చిదంబరం వ్యాఖ్యానించారు. ఆ పొరపాటు ఇందిరాగాంధీ ప్రాణాలనే తీసిందన్నారు. అయితే ఆపరేషన్ బ్లూ స్టార్ అనేది అందరూ కలిసి తీసుకున్న సమష్టి నిర్ణయమని ఆయన చెప్పారు. ఇండియన్ ఆర్మీ,ఇంటెలిజెన్స్, పోలీసులు, సివిల్ డిఫెన్స్ కలిసికట్టుగా తీసుకున్న నిర్ణయమని, ఈ విషయంలో కేవలం ఇందిరా గాంధీని మాత్రమే నిందించడం కరెక్టుకాదన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం కౌసాలీలోని కుశ్వంత్ సింగ్ లిటరరీ ఫెస్ట్‌లో అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన చిదంబరం ఈ వ్యాఖ్యలు చేశారు.

### అమెరికాలో మళ్లీ కాల్పులు: 8 మంది దుర్మరణం

**వాషింగ్టన్, అక్టోబరు 12:**అమెరికాలో మిసిసిపిలోని ఓ హైస్కూల్‌లో ఫుట్‌బాల్ హోంకమింగ్ వేడుకల్లో జరిగిన మూడుచోట్ల వేర్వేరుగా కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో 8మంది ప్రాణాలు కోల్పోగా, 18మందికి పైగా గాయపడ్డారు. అర్ధరాత్రి సమయంలో లేలాండ్‌లో అత్యంత పాశవికంగా దుండగులు కాల్పులకు పాల్పడ్డారని, ఈ ఘటనలో ఎనిమిది మంది మరణించారని పశ్చిమ మిసిసిపిలోని వాషింగ్టన్ కౌంటీ మేయర్ జాన్‌లీ తెలిపారు. 18 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందన్నారు.

### అమెరికాను వీడనున్న 'నోబెల్' దంపతులు



**వాషింగ్టన్, అక్టోబరు 12:** ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన దంపతులు ఎస్తర్ డుఫ్లో, అభిజిత్ బెనర్జీలు అమెరికాను వీడనున్నారు. స్విట్జర్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ జూరిచ్‌లో ఏర్పాటు చేయనున్న కొత్త ఆర్థిక శాస్త్ర విభాగానికి నేతృత్వం వహించను న్నా రు. ఈ మేరకు యూని వర్సిటీ ఆఫ్ జ్యూరిచ్ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం డుఫ్లో, అభిజిత్ బెనర్జీలు ఎమ్ఐటీలో ఉన్నారు. వచ్చే ఏడాది జులైలో ప్రొఫెసర్లుగా యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిచ్‌లో చేరతారు.

# మద్యం షాపులకు దరఖాస్తుల జోష్

## అందిన దరఖాస్తులు 5,663

### మరిన్ని పెరుగుతాయంటున్న అధికారులు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2620 మద్యం షాపులకు దరఖాస్తుల జోష్ కొనసాగుతోంది. శనివారం నాటికి తెలంగాణలో 5663 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈనెల 18 వరకు దరఖాస్తు చేసుకు నేందుకు అవకాశం ఉండటంతో వీటి సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు అంచవేస్తున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం కూడా చివరి మూడు రోజుల్లో 45 వేల నుంచి 50 వేల దరఖాస్తులు వచ్చినట్లు వారు చెబుతున్నారు. ఇప్పుడు కూడా దరఖాస్తు దారుల సంఖ్య పెరుగుతుందని అంచా వేస్తున్నారు. రెండో శనివారం కూడా దరఖాస్తుల స్వీకరించిన అధికారులు ఈ నెల 18వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ వారం రోజుల్లో 13న సోమవారం, సప్తమి మంచి రోజు, అదే విధంగా 15న నవమి, 16న దశమి ,17న ఏకాది, 18న ద్వాదని ఈ 5 రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనావేస్తున్నారు. 14వ తేదీన అష్టమి కావడంతో కొంతమేరకు దరఖాస్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉందంటున్నారు. చివరి రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అంచనాలు ఉండడంతో ఎక్సైజ్ డివిజన్ల వారిగా, రంగారెడ్డి, హైదరాబాద్ డివిజన్ల లో ను, ఉమ్మడి జిల్లాల వారీగా అదనపు కౌంటర్ల ఏర్పాటుతోపాటు దరఖాస్తుదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నారు. గత రెండేళ్ల క్రితం మద్యం షాపులకు 1.32 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఈసారి దరఖాస్తులు గతంలో కంటే మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలోలాగా ఈసారి కూడా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల నుంచి దరఖాస్తులు వేయడానికి మద్యం వ్యాపారులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే పలు రాష్ట్రాల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు గుర్తించారు. మరోపక్క మద్యం షాపులకు కేటాయించిన రిజర్వేషన్ల గౌడ్ ఎస్సీ, ఎస్టీ మద్యం షాపులకు కూడా దరఖాస్తులు పోటాపోటీగా పడుతున్నాయి. గౌడ షాపులకు 671 దరఖాస్తులు, ఎస్సి రిజర్వేషన్ల 202, ఎస్టి రిజర్వేషన్ల 84, జనరల్‌లో 46 86 దరఖాస్తులు వచ్చాయి. ఇదే రీతిలో ఉమ్మడి జిల్లాలోని అదిలాబాద్‌లో 142, హైదరాబాదులో 746, కరీంనగర్‌లో 392, ఖమ్మం లో 260, మహబూబ్ నగర్ లో 278, నల్లగొండలో 568, మెదక్ లో 411, నిజామాబాద్‌లో 255, రంగారెడ్డిలో 2353, వరంగల్‌లో 258 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.



## ఏఐసిసి చీఫ్ మల్లికార్జునఖర్గేను పరామర్శించిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షులు మల్లికార్జునఖర్గేను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం న్యూఢిల్లీలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## సనాతన ధర్మరక్షణే ధ్యేయంగా ప్రతి హిందువు పాటుపడాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (సికిందరాబాద్), అక్టోబరు 12, ప్రభాతవార్త:** సనాతన ధర్మాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా ప్రతి హిందువు పాటుపడాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. సనాతన ధర్మం హిందుత్వం భారతదేశంలో ఉన్నన్నినాళ్ళే సెక్యులరిజానికి అవకాశం ఉంటుందని హిందూ మతం మైనారిటీలో పడితే సెక్యులరిజం అనేది ఉండదని అన్నారు. సికింద్రాబాద్ స్కందగిరి దేవాలయంలో జరుగుతున్న శ్రీ జనార్ధన ఆనంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ 25వ రజతోత్సవాలు, శ్రీ తెలంగాణ వేదవిద్వాన మహాసభల వేడుకల్లో ఆదివారం ముఖ్య అతిథిగా కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థులకు నాలుగు రకాల వేద పరీక్షలు నిర్వహిస్తూ వేదాన్ని ప్రోత్సహించడం శుభ పరిణామన్నారు.
సనాతన ధర్మానికి మరింత గౌరవాన్ని ఇనుమడింపజేసేలా ప్రచారాన్ని నిర్వహిస్తూ ప్రధాని మోడీ నేతృత్వంలో సనాతన ధర్మ రక్షణకు కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. సనాతన ధర్మం, హిందూమతం గురించి మాట్లాడితే దేశంలోనే విమర్శలు వస్తుండడం బాధాకరమన్నారు. ఇతర మతాలను కించపరచకుండా హిందూమతం గురించి మాట్లాడే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి ఉందన్నారు. కార్య క్రమంలో ట్రస్ట్ చైర్మన్ తూములూరి సాయినాథ శర్మ, ప్రధాన కార్యదర్శి బ్రహ్మానంద శర్మ, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోసాల పునాదులపై కాంగ్రెస్ పాలన

### బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** బిజెపిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపిపై కెటిఆర్ చేస్తున్న విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. బిజెపిని పూజకు పనికిరాని పువ్వు అంటున్నారు.. కానీ రాష్ట్రానికి పనికి రావట్లేదనే ప్రజలు కారును షెడ్డుకు పంపించారని అన్నారు. ఈ విషయం గుర్తు ఉంచుకొని మాట్లాడాలని కెటిఆర్‌కు ఏలేటి కౌంటర్ ఇచ్చారు. లిక్కర్ స్కామ్ వంటి ఎన్నో స్కామ్‌లలో ఇరుక్కున్న బిఆర్ఎస్ నేతలు బిజెపి గురించి మాట్లాడుతుంటే నవ్వు వస్తుందని ఎద్దేవా చేశారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క సీటు కూడా గెలవలేదన్నారు. అక్కడే ప్రజల్లో బిఆర్ఎస్ పరిస్థితి ఏంటో తెలిసిపోయిందని అన్నారు. మరోవైపు.. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కొన్ని వేల కోట్ల కుంభకోణాలు జరిగాయని ఆరోపణలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిందని గుర్తుచేశారు.
కెసిఆర్ ప్రభుత్వం రైతు బంధుపై తన విధి విధానాలు ఏందో చెప్పిందని అన్నారు. రాష్ట్ర రైతాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వ విధి విధానాలు ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. రైతు సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫల అయిందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. రాబోయే రోజుల్లో బిజెపి అధికారంలోకి వస్తుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీలతో పాటు 420 హామీలను తుంగలో తొక్కారన్నారు. 80 శాతం హామీలు అమలు చేశామని గొప్పలు చెబుతున్నారని, వారికి నమ్మకం ఉంటే ప్రభుత్వాన్ని డిసాల్వ్ చేసి మళ్ళీ ఎన్నికలకు వెళ్ళమని చెప్పాలని, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని, మోసాల పునాదులపై కాంగ్రెస్ పాలన సాగిస్తుందన్నారు.

## రోజూ 5 నిమిషాలు మొబైల్ ద్వారా కేన్సర్ అవగాహన

### రాష్ట్ర ఐటి మంత్రి శ్రీధర్‌బాబు సూచన

### కేన్సర్ భూతం విజృంభణను బాధ్యతతో ఎదుర్కోవాలి : మంత్రి పొన్నం

### గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్‌కు భారీస్పందన.. ప్రత్యక్షంగా 30 వేలు, వర్చువల్‌గా లక్షన్నర మంది భాగస్వామ్యం

**హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 12, ప్రభాతవార్త :** యువత ప్రతీరోజూ 5నిముషాల సమయాన్ని కేటాయించడంతోపాటు మొబైల్ ద్వారా క్యాన్సర్ ముందస్తు పరీక్షల గురించి అవగాహన పెంచడం ఎంతో అవసరమని తెలంగాణ రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు, ప్రఖ్యాత అంకాలజిస్ట్ డా. సుంకవల్లి చిన్నబాబు విజన్, గొప్ప ప్రయత్నంతో మొదలై నేడు 130 దేశాలకు భారీ ఉద్యమంగా విస్తరించడం హర్ష దాయకమని ఆయన్ను సన్మానించారు. క్యాంబియంట్ డెవలపర్స్ గ్లోబల్‌గ్రేస్ కేన్సర్ రన్ 8వ ఎడిషన్‌లో ప్రత్యక్షం 30వేలు, వర్చువల్‌గా లక్షన్నరకుపైగా ఔత్సాహికుల భాగస్వామ్యంతో భారీస్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా, ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, బిసి సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడాశాఖ మంత్రి వి.శ్రీహరి, విశిష్ట అతిథులుగా ముఖ్యమంత్రి సలహాదారు వేమ్‌నరేంద్ర, తెలంగాణ క్రీడా సంస్థ ఛైర్మన్ శివసేనరెడ్డి, సినీనటుడు ఆదివిశేషు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్, సైబరాబాద్ సీపి అవినాష్ మోహంతి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ తదితర ప్రముఖులు పాల్గొని గ్లోబల్‌గ్రేస్ క్యాన్సర్ రన్‌ను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నేడు క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ బాధ్యతాయు తంగా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంచాలని సూచించారు. శ్రీహరి కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే తప్పకుండా నయం చేయగలమని, ఈ సందేశాన్ని యువతకు చేర్చాలని కోరారు. శివసేనరెడ్డి ఆరోగ్యకరమైన జీవనశైలి అవలంబించాలని యువతకు సూచించారు. ఈ రన్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా పురుషులు ఈశ్వర్, అనూజ్ యాదవ్, మనోజ్‌లు, మహిళలు రాజేశ్వరి, సునీత, ఉమాలు నిలిచారు. చివరిగా క్యాన్సర్‌ను జయించిన పలువురుని నీలిమా, ప్రకాష్, సంగీత, గీతల విజయగాథలను వేదికపై పంచుకున్నారు.



విజేతలతో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, డా. చిన్నబాబు తదితరులు

## 10వేల పిఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలి

### పెండింగ్‌లో ఉన్న 5 డిఎలను విడుదల చేయాలి

### పిఆర్‌టియు రాష్ట్ర కమిటీ తీర్మానం

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలకు 10వేల పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను ప్రకటించి, బిఈడి అర్హతగల వారికి అవకాశం కల్పించాలని పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం చేసింది. రాష్ట్ర అధ్యక్షులు ఎం. చెన్నయ్య అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం రంగారెడ్డి జిల్లా పరిషత్తు మీటింగ్ హాల్‌లో ఆదివారం జరిగింది. సమావేశంలో పెండింగ్‌లో ఉన్న 5 డిఏలు, పిఆర్‌సిలను వెంటనే ప్రకటించాలని తీర్మానం చేసినట్టు చెన్నయ్య తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు వెంటనే ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలన్నారు. డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకి కోర్టు ఉత్తర్వులను అనుసరించి వెంటనే ఓపిఎస్‌ను పునరుద్దరించాలని సమావేశంలో తీర్మానం చేసినట్టు తెలిపారు. జీవో 190 ద్వారా 317 జీవోలో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను జోనల్ పోస్టులుగా మార్పుచేయాలని, ఉపాధ్యాయులు సర్వీసు రూల్స్ రూపొందించి అన్ని రకాల ప్రమోషన్లు, ప్రతిసంవత్సరం వేసవి సెలవుల్లో బదలీలు నిర్వహించేలా క్యాలెండర్‌ను రూపొందించాలని సమావేశంలో తీర్మానం చేసినట్టు పిఆర్‌టియు తెలంగాణ నాయకులు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ చంద్రశేఖరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానాల రత్నాకర్ రావు, రాష్ట్ర ఉమెన్ ప్రెసిడెంట్ కృష్ణప్రియ, స్టేట్ డిస్ప్లీనరీ కమిటీ చైర్మన్ పి శ్రీని వాసరావుతోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకే కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజ్

### తప్పడు ప్రచారం చేస్తున్న గిట్టనివారు

### తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్-711

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2023లో రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్ట్ లెక్చరర్లు నిబంధనల మేరకే నియామకం కాబడ్డారని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్(టిజిఎల్ఏ)-711 స్పష్టం చేసింది. కొందరు గిట్టని వారు ఇదే అంశంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చిన్న బోయిన కనకచంద్రం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా నరసింహ తెలిపారు. గత కొంతకాలంగా కొన్ని దినపత్రికలలో కొంతమంది గిట్టని వాళ్లు తప్పుడు సమాచారం ఇచ్చి నూతనంగా రెగ్యులర్ కాబడిన లెక్చరర్స్ మీద నిరాధారమైన వార్తలను రాపిస్తున్నారని. ఆ వార్తలను తాము పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. తాము రెగ్యులర్ లెక్చరర్స్‌గా అప్పాయింట్ కాబడి రెండు సంవత్సరాలు దాటిపోయిందని, అయినప్పటికీ నేటికీ ఏదో ఒక పత్రికలో మాకు వ్యతిరేకమైన వార్తా కథనాలు వస్తున్నాయని అటువంటి పత్రికలు నిజమైన ఆధారాలు ఉంటే బయట పెట్టాలని.. అందుకు తాము కూడా సహకరిస్తామని తెలిపారు. అలా కాకుండా ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను, అధికారులను బదనాం చేయొద్దన్నారు. ఇటువంటి వార్తల మూలంగా ప్రభుత్వ కళాశాలలపై ప్రజలలో తప్పుడు అభిప్రాయం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. 700 మంది ఫేక్ సర్టిఫికెట్లను ఇచ్చినట్లు, తాము ఉద్యోగాల కోసం రూ. 5 లక్షల ఇచ్చినట్టు కూడా ప్రచారం చేస్తున్నారని.. వాటికి సంబంధించిన సాక్ష్యాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని కోరారు.
2013 సంవత్సరము కంటే ముందు యూజీసీ గుర్తిం పు ఉన్న అధర్ స్టేట్‌లో పిజి చదివిన వారి సర్టిఫికెట్లు చెల్లుతాయని తెలిపారు. కానీ ఈ ప్రభుత్వంలో 2025 టిజిపిఎస్‌సి న్యూ రిక్రూట్మెంట్‌లో 2016లో ఉత్తీర్ణులైన అధర్ స్టేట్ యూనివర్సిటీ (మదురై కామరాజ్ )వారిని సెలెక్ట్ చేయడం జరిగిందని, ఇలా 82 మంది అధర్ స్టేట్ యూనివర్సిటీ వారు ఈ రిక్రూట్‌మెంట్‌లో రావడం జరిగిందని గుర్తు చేశారు. వేరే రాష్ట్రంలో చదివిన వారు 25వేల మంది అనేక ప్రభుత్వ డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్నారని వారు తెలిపారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 12, ప్రభాతవార్త:** లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఇద్దరు మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున పంజాగుట్టలో జరిగిన రోడ్డు ప్రమా దంలో వైద్యుడు, ట్యాక్సీడ్రైవర్ అక్కడిక్కడే ప్రాణాలొదిలారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా ధర్మపురికి చెందిన డా.కస్తూరి జగదీష్ చంద్ర(35) కిమ్స్- సన్‌షైన్ ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుందన్‌బాగ్‌లోని మెథ డిస్ట్ కాలనీలో నివాసం ఉంటున్నారు. విధులు ముగించుకొని ఆది వారం ఉదయం ఇంటికి వచ్చేందుకు వైద్యుడు ర్యాపిడో బుక్ చేసుకున్నాడు. ఖమ్మం జిల్లా హవేలి రూరల్ ప్రాంతానికి చెంది జేఎన్‌టీయూ సమీపంలో నివసిస్తూ ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.నవీన్ (30) వైద్యుడిని తీసుకెళ్లేందుకు వచ్చాడు. ఇద్దరు కలిసి వెళ్తున్న క్రమంలోనే ఉదయం 5.30 గంటల ప్రాంతంలో గ్రీన్‌ల్యాండ్స్ నుంచి బేగంపేటవైపు వెళ్తున్న 16 టైర్ల ఇసుకలారీ (టీఎస్ 09 యూడీ 9279) వెనకనుంచి వీరు ప్రయాణిస్తున్న హోండా యాక్టివా (టీజీ 04 సి 7248)ను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ర్యాపిడో డ్రైవర్ నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు.



ర్యాపిడో డ్రైవర్ నవీన్(ఫైల్)



డాక్టర్ కస్తూరి జగదీష్‌చంద్ర(ఫైల్)

తీవ్రగాయాలపాలైన వైద్యుడిని స్థానికులు హుటా హుటిన సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్న వైద్యుడి పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్ పసుపుల శంకర్(38)ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొట్టపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నారు. లారీని స్వాధీనం చేసుకుని ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఎస్సీ గురుకులాల్లో 4,092 మంది ఉద్యోగుల సేవల పునరుద్ధరణ

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగుల సేవలను కొనసాగించడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంది. 4,092 మంది ఉద్యోగుల సేవలను పునరుద్ధరించినట్టు ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఇందుకుగానూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సేవలను గుర్తించి వారికీ న్యాయం చేయాలనే మానవతా దృక్పథం ప్రభుత్వానికి ఉందని మంత్రి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కాంట్రాక్ట్ పద్ధతిలో ఇదనదరు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 1,545 మంది, పార్ట్‌టైమ్ విధానంలో 2,102 మంది, హానరోరియం(గౌరవ వేతనం) పద్ధతిలో 443 మంది కలిపి మొత్తం 4,092 మంది ఉద్యోగుల సేవలు పునరుద్ధరించబడ్డాయనీ మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం.1533 ప్రకారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలో పనిచేస్తున్న 4,092 మంది ఉద్యోగుల సేవలను మరో ఏడాది పాటు కొనసాగించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఈ నిర్ణయంతో వేతనాల చెల్లింపులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది కుటుంబాలకు భారీ ఊరట కలగనుందని మంత్రి పేర్కొన్నారు.
గత కొన్నినెలలుగా కంటిన్యూషన్ ఆర్డర్లు లేకపోవడంతో వేతనాల చెల్లింపులో సాంకేతిక ఆటంకాలు తలెత్తి, అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మంత్రి గుర్తు చేశారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల సేవాభావాన్ని గుర్తించి, వారి సేవలను కొనసాగిస్తూ జి.ఓ. 1533 జారీ చేయడం ద్వారా మానవతా దృక్పథాన్ని చూపిందన్నారు. ఇకపై ప్రతి నెలా వేతనాలు సకాలంలో చెల్లింపుకు మార్గం సుగమమవుతుందని, ఉద్యోగులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ సేవలను కొనసాగిస్తారని మంత్రి స్పష్టం చేశారు. గురుకుల విద్యాసంస్థల్లో సేవలందిస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సమాజ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్నారనీ మంత్రి అడ్లూరి తెలిపారు. ప్రభు త్వం విద్యావ్యవస్థ, గురుకుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగు తోందని మంత్రి పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను, ఉజ్వల భవిష్యత్తును అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు.

## పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం అందించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త :** ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్వాసితులకు 'భూసేకరణ చట్టం-2013' ప్రకారం పరిహారం అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జాన్‌వెస్లీ ఆదివారం లేఖ రాశారు. ఆదిలాబాదు జిల్లా పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో కోల్పోతున్న రైతుల భూములను తాను సెప్టెంబర్ 27న పరిశీలించి, రైతులతో మాట్లాడానని, నిర్వాసితుల జీవనపరిస్థితులు దయనీయంగా ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు.
2018లో ఎగువన 'పిప్పల్‌కోటి రిజర్వాయర్' కరకట్ట పనులను ప్రభుత్వం ప్రారంభించిందని, భూములు కోల్పోయిన రైతులు ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందు తుందన్న ఆశతో వివిధ అవసరాలకు అప్పులు చేశారనీ, కానీ ప్రభుత్వం నేటికీ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. నష్టపరిహారం కోసం మూడేండ్ల క్రితమే రైతులు నెలరోజుల పాటు నిరసనలకు దిగారని.. అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు రైతులకు మద్దతు ప్రకటిస్తూ, తాము అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరిస్తామన్నారని లేఖలో గుర్తు చేశారు.


## రహస్యంగా రైళ్లలో గంజాయి రవాణా

### ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో గంజాయి తరలింపుఅనేది సర్వసాధారణంగా మారింది. రోడ్డు మో తన తనిఖీలు జరిగి పట్టుబడుతున్నామన్న ఉద్దేశంతోను గంజాయి సరాఫరా చేసేవారు రైళ్ళను ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం ఒడిశ్శా నుంచి హైదరాబాద్‌సహా ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతున్న గంజాయిలో అధిక భాగంం రైళ్ల ద్వారానే చేరుకుంటోందని పలు సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గత రెండు సంవత్సరాల్లో రేళ్ళలో ఏకంగా 7వేల కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే సరఫరా అవుతున్న గంజాయిలో నామమాత్రంగానే పోలీసులకు చిక్కుతోంది. అంటే నిత్యం వందల కిలోల గంజాయి రైళ్ళలోనే హైదరాబాద్‌కు చేరుతోంది. దీంతో రైల్వేశాఖను కేంద్రం అప్రమత్తం చేసింది. దీంతో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్) గంజాయిను స్వాధీనం చేసుకునేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జిఆర్‌పి)తో పాటు స్థానిక పోలీసులతో ప్రత్యేక సమన్వయ వ్యవస్థను సిద్ధం చేసుకుంటోంది. సికింద్రాబాద్, హైదరాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, లింగంపల్లి, నల్గొండ, నిజామాబాద్, వికారాబాద్ స్టేషన్‌లలో ఎక్కువశాతం గంజాయి పట్టుబడుతుండగా, కోణార్క్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం నుంచి ముంబాయి వెళ్ళే ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్, కోరమండల్ ఎక్స్‌ప్రెస్, చార్మినార్ సూపర్‌ఫాస్ట్, ఏపీ ఎక్స్‌ప్రెస్, నవజీవన్ ఎక్స్‌ప్రెస్, లక్నో, జాన్సీ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ పూర్ణ ఎక్స్‌ప్రెస్, రాయచూర్ ఏక్స్‌ప్రెస్, అమృత్ సర్ ఏక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, సంబల్‌పూర్ నాంథేడ్ ఎక్స్‌ప్రెస్‌లలో గంజాయి సరఫరా జరుగుతూనే ఉంది. గంజాయి సరఫరాను ఎన్ని విధాలుగా అడ్డుకున్నా అది మాత్రం గుట్టు చప్పుడు కాకుండా ఎక్కడకు చేరాలో అక్కడికే చేరుకుంటోంది. ముఖ్యంగా రైలు మార్గంలో గంజాయి రవణాను అరికట్టేఉందుకు ఎక్సైజ్ అధికారులు పలు మార్లు సంబంధిత ఉన్నతాధికారులతో కూడా సమావే శాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉదాహరణకు కొద్ది రోజుల క్రితం లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని కోణార్క్ ఎక్స్ ప్రెస్ చేరుకుంది. దిగేందుకు, ప్రయాణికులు సిద్ధమయ్యారు. ఇంతలో ఆర్‌పిఎఫ్‌ల పోలీసులు ఒక కోచ్‌లోకి చేరుకున్నారు. చుట్టూరా పరిశీలిస్తుండగా, ప్రయాణికులు సమీపంలో లేకుండా కొన్ని బ్యాగులు కని సించాయి. అనుమానం వచ్చి, వాటిని చెక్ చేయగా, అందులో 85 కిలోల గంజాయి పొడి ఉన్న ప్యాకెట్లు కనిపించాయి. ఇంతలో ఓ ప్రయాణికుడు ఎలాంటి లగేజీ లేకుండా మరో కోచ్లో హడావుడిగా వెళుతుండగా, గమనించి పట్టుకున్నారు. ఆరాతీస్తే.. ఒడిశా నుంచి తానే గంజాయిని తెచ్చానని, హైదరాబాద్ లోని ధూల్‌పేటకు తరలిస్తు న్నానని చెప్పాడు. మరో కేసులో సాధారణ తనిఖీలు చేస్తుండగా కాచిగూడ రైల్వేస్టేషన్ పార్శిల్ గది నుంచి ఏడు వ్యాగులు తరలిస్తున్న ఐదుగురి కదలికల్లో అనుమానం రావటంతో అవి తనిఖీ చేయగా, ఆ ఏడు బ్యాగుల్లో 120 కిలోల గంజాయి వెలుగు చూసింది. ఒడిశా నుంచి తీసుకొన్ని కాచిగూడ పార్శిల్ ఆఫీసులో ఉంచి అక్కడి నుంచి దాన్ని హైదరాబాద్‌లోని తిలక్‌నగర్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. వారంతా స్థానికులు అయినప్పటికి బ్యాగులను కాచిగూడ స్టేషన్ వరకు తరలించింది మాత్రం ఒడిశ్శాకు చెందినవారు కావడం గమనార్హం. అదే విధంగా వరంగల్ రైల్వేస్టేషన్ రెండు పర్యాయాలు 60 కిలోల చొప్పున గంజాయి దొరికింది. నవజీన్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని, కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రెండో కోచ్‌లో మగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. పెరుగుతున్న కేసులను దృష్టిలో ఉంచకుని రైల్వే పోలీసులు ప్రత్యేకంగా కొంతమంది సిబ్బందిని కేటాయిం చింది.



గంజాయి సరఫరాను కనుగొనే బాధ్యతను వారికి అవ్పగించింది. గంజాయి తరలింపే లక్ష్యంగా పని చేస్తున్న కొంత మందిని గుర్తించి వారికి సంబంధించి ఫోటోలతో కూడిన వివరాలను సిబ్బందికి అందచేసింది. అంతే కాకుండా సిసిటివి కెమెరాలద్వారా, ఆధునిక పరిజ్ఞానాన్ని కూడా వారి గుర్తిచేందుకు ఉపయోగిస్తున్నారు. కేవలం ప్రయాణికులు రైళ్ళలనే కాకుండా సరుకు రవాణా రైళ్ళలో కూడా వాటి సరఫరా జరుగుతోందని గుర్తించారు. దానిలో భాగంగా సరుకు రవాణా వ్యాగన్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు న్విర్వహిస్తున్నారు.



# 25న తిరుమలలో పెద్దశేషవాహన సేవ

**తిరుమల,అక్టోబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకమాసంలో వచ్చే నాగులచవితి పర్వదినం తరువాత నాల్గవరోజు ఏడుకొండల వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి పెద్దశేషవాహనంపై ఊరేగడం పరిపాటి. ఈనెల 25వతేదీ శనివారం పెద్దశేషవాహనసేవ జరగనుంది. సాధారణంగా వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు రాత్రి తొలివాహనంగా ఏడుతలల శేషునిపై మల యప్పస్వామి అధిరోహించి ఆలయ మాఢవీ ధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. మళ్ళీ నాగులచవితి పర్వదినాన మాత్రమే పెద్దశేషవా హనసేవ జరుగుతుంది. శ్రీనివాసుడు శేషాద్రిపై కొలువుదీరాడు. ఆయన పానుపు శేషుడు. అందుకే ఉత్సవాల్లో శేషుడికి ప్రాధా న్యమిస్తూ పెద్దశేషవాహనంపై ఊరేగుతారు. మన శరీరంగా మూలాధారం నుండి సహస్రారం వరకు సర్పాకారంలో ఉన్న కుండలీశక్తిని జాగృతం చేయమని బోధించడమే ఈ ఊరే గింపు అర్థం. దాసభక్తికి మారురూపంగా నిలిచే తన ప్రియ భక్తుడైన ఆదిశేషుడిపై 25వతేదీ రాత్రి 7గం టలకు తిరువీధుల్లో విహరిస్తారు.

# భగవంతుని ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలి

## గాయని డాక్టర్ శోభారాజ్

**తిరుమల,అక్టోబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖ గాయని డాక్టర్ శోభారాజ్ తెలిపారు. రెండవ శనివారం సాయంత్రం ఆమె తిరుమలలోని నాదనీరాజనం వేదికపై అన్నమయ్యసంకీర్తనలు ఆలపించడం ఆనవాయితీ. ఆదివారం ఉదయం ఆమె విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.



# ఆరు జిల్లాల్లో విజయవంతంగా పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** హైదరాబాద్,రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ, వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలో ఆరోగ్యశాఖ ఆదివారం పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఈ 6 జిల్లాల పరిధిలో 05 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. ఇందులో 16,35,432 మంది పిల్లలు ఆదివారం పోలియో డ్రాప్స్ వేశామని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్,డాక్టర్ సంగీత సత్యనారాయణ ప్రకటించారు. మిగిలిన పిల్లలకు కూడా పోలియో డ్రాప్స్ వేయించాలని తల్లిదండ్రులకు సంగీత విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశాఖ సిబ్బంది సోమ, మంగళవారం ఇంటింటికి తిరిగి, వ్యాక్సిన్ వేయించుకోని పిల్లలకు వ్యాక్సిన్ వేస్తారని, ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# గ్లోబల్ సెంటర్ ఆఫ్ మిల్లెట్స్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** తెలంగాణకు గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ సంస్థ ఏర్పాటుకు చురుకుగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు కేంద్రం దీనికి సంబంధించి ఇపటికే మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో 250 కోట్ల రూపాయల వ్యయంతో ఈ మిల్లెట్స్ సంస్థను అందు బాటులోకి తీసుకొస్తోంది. ఈ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ కేంద్రంలో సెంట్రల్ ఇన్‌స్టు మెంటేషన్ ల్యాబ్, ఇంటర్నేషనల్ హాస్టల్, మిల్లెట్స్ మ్యూజియం, రీసెర్చ్ ఫామ్‌లు, ట్రైనింగ్ రూములు, ఇంటర్నేషనల్ గెస్ట్‌హౌస్‌ను ఏర్పాటు చేయనుంది. అలాగే జీనోమ్ ఎడిటింగ్ గ్రీన్‌హౌజ్‌లు, స్పీడ్ బ్రీడింగ్ ల్యాబ్స్, ఫినోమిక్స్ ల్యాబ్స్ వంటి ఆధునిక పరిశోధనా వసతులు అందుబాటులోకి రానున్నట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ అధికవర్గాలు వెల్లడించాయి.

# వంగూరు రైతులకు సోలార్ పంప్‌సెట్లు

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత మండలం వంగూరులో రైతులందరికీ సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేసేందుకు సర్కార్ అనుమతినిచ్చింది. ఈ మేరకు ఇంధన శాఖ దీనికి సంబంధించి ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సోలార్ పంప్ సెట్ల ఏర్పాటుకు గాను 258 కోట్ల రూపాయల మేర ఖర్చవుతుందని అంచనా. వంగూరు మండలంలో మొత్తం 7,500 బోరుబావులకు పీఎం కుసుమ్ పథకం కింద ఈ సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను రుణం రూపంలో సేకరించుకోవాలని, వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో రుణం కట్టుకోవాలని పేర్కొంది. ప్రభుత్వంపై ఎటువంటి అదనపు భారం వేయరాదని నిర్దేశించింది.

# రసాయనాల వాసనలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** బొల్లారంలోని పలు కెమికల్ ఫ్యాక్టరి నుంచి వెలువడుతున్న రసాయాలతో మియాపూర్, బాచుపల్లి ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నేళ్లుగా సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు. కొన్ని రోజులుగా కెమికల్ ఫ్యాక్టరిలకు వ్యతిరేకంగా రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఉన్న నివాససముదాయంలో ఫ్యాక్టరిలతో అనారోగ్యపాలై అవకాశం ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చర్యలు చేపట్టని యెడల పెద్ద ఎత్తున నిరసనలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# ఆఫ్ బడ్జెట్‌పై ఖజానా.. పెరుగుతున్న రుణ భారం

## ఆదాయం, ఖర్చుల మధ్య కొరవడిన సమతుల్యత

## మార్చి 2026 నాటికి రూ.6.6 లక్షల కోట్ల అంచనా

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ఖజానా బడ్జెట్‌లో కనిపించని 'ఆఫ్ బడ్జెట్' లోన్లపై కూడా ఎక్కువగా ఆధారపడుతోంది. ప్రధానంగా రాష్ట్రం పవర్ యుటిలిటీస్, బోర్డులు, హౌసింగ్ మరియు డెవలప్‌మెంట్ సంస్థల ద్వారా రుణాలు తీసుకుంటోంది. ఇవి నేరుగా బడ్జెట్‌లో చూపించకపోయినా, వీటికి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుండటంతో వాటి బాధ్యత రాష్ట్రానిదే అవుతుంది. ఈ విధానం గురించి కాగ్, రిజర్వ్ బ్యాంక్ హెచ్చరికలు జారీ చేశాయి. కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం గ్యారంటీతో తీసుకున్న ఆఫ్ బడ్జెట్ లోన్లను కూడా పరిగణలోకి తీసుకుంటే మార్చి 2026 నాటికి మొత్తం అప్పు రూ. 6.6 రూ. 6.7 లక్షల కోట్ల వరకు చేరుతుందని ఆర్థిక శాఖ అంచనా. ఇది రాష్ట్ర జీఎస్‌డీపీలో దాదాపు 35 శాతానికి సమానం. అధికారవర్గాల సమాచారం మేరకు 2026 మార్చి వరకు రాష్ట్రం రూ.5.46 లక్షల కోట్ల రుణాలు సేకరించింది. ఇది రాష్ట్ర మొత్తం ఆర్థిక ఉత్పత్తి జీఎస్‌డీపీలో 28 కు సమానం. మరోపక్క రాష్ట్రం రుణాలపై ఎక్కువ ఆధారపడుతోంది. 2023-24లో నికర అప్పులు రూ.49,589 కోట్లు, 2024-25లో రూ.48,322 కోట్లు సేకరించింది. ప్రస్తుత 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో ఎఫ్‌ఆర్‌బిఎంకు లోబడి రూ.54,009 కోట్ల రుణాలు చేయనున్నట్లు పేర్కొంది. ఈ త్రైమాసికం అక్టోబరు నుండి డిసెంబరు వరకూ రిజర్వ్ బ్యాంక్ క్యాలెండర్ ప్రకారం రూ.9,600 కోట్లకు ఇండెంట్ పెట్టింది.

ఇప్పటికే మొదటి రెండు త్రైమాసికాల్లో రూ.49,900 కోట్లు అప్పుగా తీసుకుంది. ఇది దాని వార్షిక రుణ పరిమితి రూ.54,009 కోట్లలో 92 శాతానికి పైగా ఉంది. ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలానికి రాష్ట్రానికి రూ.4,109 కోట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. కానీ కొత్త ప్రతిపాదనతో, డిసెంబర్ చివరి నాటికి మార్కెట్ రుణాల మొత్తం ఎఫ్‌ఆర్‌బిఎం పరిధి దాటి రూ.59,500 కోట్లకు చేరుకుంటాయని ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

దీనికి తగినట్లుగా ప్రతి సంవత్సరం, రాష్ట్రానికి సుమారు రూ.49 వేలు నుండి రూ.50 వేల కోట్ల ఆర్థిక లోటు ఉంటే ఆదాయం, ఖర్చుల మధ్య అసమతుల్యత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ 2025-26 లో తొలి ఐదు నెలల కాలానికి సర్కార్‌కు రూ.96,654.25 కోట్ల ఆదాయం లభించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే పన్నుల ద్వారా రాబడుల్లో తగ్గుదల చోటు చేసుకుంది. రాష్ట్ర రెవెన్యూ ఆదాయం రూ.63 వేల కోట్లు దాటింది. కానీ పన్నుల ద్వారా గత ఏడాది ఇదే కాలానికి వచ్చిన మొత్తం కంటే ఈ సారి 1 శాతం తగ్గి రూ.33 వేల కోట్లకు చేరాయి. జీఎస్టీ కింద రూ.21,144 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.6,218 కోట్లు, ఎక్సైజ్ నుండి రూ.7,758 కోట్లు, అమ్మకం పన్ను రూ.14,079 కోట్లు లభించాయి. ఇతర పన్నులు, డ్యూటీల ద్వారా రూ.3,352 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా రూ.7,413 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.1,578 కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూ.1,673 కోట్లు వచ్చాయి. ఇక భారీ సంక్షేమ ఖర్చులు, వేతనాలు, పెన్షన్లు, వడ్డీలు వంటి కమిటెడ్ ఖర్చులు పెరుగుతున్నాయి. బ్యాంకులకు చెల్లించే వడ్డీ మొత్తం 2023-24లో రూ.23,337 కోట్లు ఉండగా, 2024-25లో ఇది రూ.26,688 కోట్లకు పెరిగింది. ఈ 2025-26లో కేవలం ఐదు నెలల్లోనే రూ.11,447 కోట్లు వడ్డీగా చెల్లించింది. పెన్షన్ ఖర్చులు కూడా తగ్గడం లేదు 2023-24లో రూ.16,841 కోట్లు కాగా, 2024-25లో రూ.16,950 కోట్లకు చేరాయి. 2025-26 ఆగస్టు వరకు ఇప్పటికే రూ.7,702 కోట్లు పెన్షన్లకే వెళ్ళిపోయాయి.

ఇక వేతనాల కొస్తే, 2024-25లో మొత్తం రూ.42 వేల కోట్లకు పైగా కాగా, ఈ ఆర్థికంలో ఆగస్టు వరకు రూ.20,141 కోట్లు ఖర్చయిపోయాయి. సబ్సిడీల ఖర్చు కూడా గణనీయంగా ఉంది. 2024-25లో రూ.11,509 కోట్లు సబ్సిడీలకే వెచ్చించగా, 2025-26లో ఐదు నెలలో రూ.7,492 కోట్లు ఖర్చయ్యాయి. ఈ మొత్తం ఖర్చులు కలిపి రాష్ట్ర ఆదాయంలో 55 శాతానికి పైగా అవుతున్నాయి. ఫలితంగా, దీర్ఘకాల అభివృద్ధికి ఉపయోగపడే మూలధన వ్యయాలకు పెద్దగా స్థలం మిగలడం లేదు. దీంతో ప్రభుత్వం రుణాలపైనే ఆధారపడింది.

# 200 మంది తాలిబన్లను హతమార్చాం.. పాక్

## 58 మంది పాక్ సైనికులను మట్టుబెట్టాం..అఫ్ఘాన్ మంత్రి



**ఇస్లామాబాద్, అక్టోబరు 12:** ఆఫ్ఘన్ రాజధాని కాబూల్‌లో జరిపిన పాకిస్థాన్‌సైన్యం ఆపరేషన్‌తో రెండుదేశాల సరిహద్దుల్లో భారీ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకూ జరిగిన దాడులు ప్రతిదాడుల్లో 23 మంది పాకిస్తాన సైనికులు చనిపోగా సుమారు 200 మందికిపైగా తాలిబన్ అనుబంధ సంఘాల ఉగ్రవాదులు చనిపోయినట్లు పాకిస్తాన్ ఆర్మీ ప్రకటించింది. పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల న్నింటిపైనా దాడులుచేసామని ఆఫ్ఘన్ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తాకీ ప్రకటించిన సంగతి తెలిఇందే. పాకిస్తాన్ ఆర్మీ మాత్రం 19 ఆఫ్ఘన్ మిలిటరీ పోస్టులు, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసంచేసామని ప్రకటించుకుంది. ఆఫ్ఘన్ దళాలు సరిహద్దుల్లో అప్రకటిత దాడులు రిపాయని పాక్ చెపుతుంటే ఆఫ్ఘనిస్తాన్ మాత్రం తాము 58 మంది పాకిస్తానీ సైనికులను హతమార్చామని, మరో 30 మందికి తీవ్ర గాయాలు కూడా అయినట్లు ప్రకటించింది. పాక్ ఆర్మీ తన ప్రకటనలో ఈనెల 11,12 తేదీల రాత్రివేళలో ఆఫ్ఘన్ తాలిబన్, తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్తాన్ రెండూ సంయుక్తంగా పాకిస్తాన్‌పై అప్రకటిత దాడులు చేసినట్లు వెల్లడించారు. పిరికి పందల కార్యాచరణగా ఈ దాడులుచేసాయని, సరిహద్దుల్లో కాల్పులకు తెగబడిందని, భౌతికదాడులకు దిగిందని, ఫ్రాంటియర్ ప్రాంతాల్లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ జుగుప్సాకరంగా వ్యవహరిస్తోందని ఇరువురూ ఒకరిపై ఒకరు ఆరోపణలకు దిగారు. తాలిబన్ శక్తులకు, ఖ్వార్జీ టిటిపి ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పామన్నారు. 23 మంది పాకిస్తానీ సైనికుల ఉచనిపోయారని, 29 మంది తీవ్ర గాయాలపాలయ్యారని వెల్లడించింది. అంతే కాకుండా 200 మంది తాలిబన్ అనుబంధ ఉగ్రవా దులను మట్టుబెట్టామని మరో 21 మందిని తమ అధీనంలోకి తీసుకున్నట్లు ప్రకటించింది. పాక్ దాడుల్లో ఆఫ్ఘన్‌వైపు ఉన్న ఉగ్రస్థావరాలన్నింటినీ నిర్వీర్యం చేసామని పాక్‌ప్రకటించుకుంది. సామాన్య పౌరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాక్ అన్ని చర్యలు తీసుకుందన్నారు. దౌత్యపరంగాను, చర్చలపరంగా నిర్మాణాత్మక బంధానికే తాము ప్రాధాన్యత ఇస్తామని, ఆఫ్ఘన్ గడ్డపైనుంచి పాక్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఉగ్రచర్యలను, విద్రోహచర్యలను తాము ఉపేక్షించేదిలేదని పాక్ ఆర్మీ ప్రకటించింది. పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ ఆలి జర్దారీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లు కూడా ఈ దాడులపై స్పందించారు. పాకిస్తాన్ సార్వభౌమత్వంపై దాడిని ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించమని ఆర్మీ సరైన రీతిలో స్పందించిందని ప్రశంసలు కురిపించారు. సరిహద్దుల్లో ఉన్న అనేక ఆఫ్ఘన్ పోస్టులను రాత్రికిరాత్రే ధ్వంసంచేసిందన్నారు. పాక్ వ్యతిరేక శక్తులపై చర్యలు తీసుకోవాలని, విదేశీ గడ్డపైనుంచి పాక్‌పై దాడులుచేస్తామంటే ఉపేక్షించేదిలేదని జర్దారి తాలిబన్‌ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

# డోన్- గుంటూరు రైలును గుంతకల్లు-విజయవాడ మధ్య నడపాలి

## రైల్వేశాఖకు సీమాంధ్రుల వినతి

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 12, ప్రభాతవార్త:** దక్షి ణ మధ్య రైల్వే గుంతకల్లు, గుంటూరు డివిజన్ లలో తిరుగుతున్న ఎక్స్ ప్రెస్ రైలు సర్వీ సులను రాయలసీమ ప్రజల/ప్రయాణీకుల సౌక ర్యార్థం గుంతకల్లు గుంటూరు/విజయవాడ మధ్య నడపాలని రైల్వే వినియోగదారులు కోరుతు న్నారు. ప్రస్తుతం గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని డోన్ నుంచి గుంటూరు వెళ్ళే నెంబర్ 17227 ఎక్స్ ప్రెస్ రైలు ప్రతిరోజు ఉదయం 0630 గంటలకు డోన్ నుండి బయలు దేరి మధ్యాహ్నం 02 00 గంటలకు గుంటూరు చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో మరుసటి రోజు గుంటూరు నుంచి డోన్ కు బయలుదేరే నెంబర్ 17228 ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసు ప్రతి రోజు మధ్యాహ్నం 0100 గంటలకు గుంటూరు నుంచి బయలుదేరి రాత్రి 08 45 గంటలకు డోన్ చేరుకుంటుంది. ఈరైలు ఫార్మేషన్ రేక్ రాత్రి 08 45 నుంచి తరువాతి రోజు ఉదయం 0630 గంటల వరకు దాదాపు పదిగంటల పాటు డోన్ లో వృధాగా ఉంచడం కంటే, డోన్ నుండి కేవలం 68 కిలోమీటర్ల దూరంలోని గుంతకల్లు వరకు పొడిగిస్తే ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లావాసులు తమ తమ అవసరాల నిమిత్తం రాష్ట్ర రాజధాని అమరావతికి వెళ్ళి వచ్చేందుకు సౌకర్యంగా, అనుకూలంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

గుంతకల్లుగుంటూరు/విజయవాడ మధ్య కొత్తగా రైలు ప్రవేశ పెట్టాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఈనేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం 17228/27 రైలు సర్వీసులను గుంతకల్లు గుంటూరువిజయవాడ లేదా గుంతకల్లుగుంటూరు మధ్య నడిపితే రైల్వేకు రెవెన్యూ రాబడి పెరుగడంతోపాటు ప్రయాణీకులకు ఉపయోగకరంగాను ఉంటుందని రైల్వే వినియోగదారులు తెలిపారు.

# హైకోర్టులో వాదనలు వినిపించడంలో ప్రభుత్వం విఫలం

## సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న సర్కారు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

## మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 12:** బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు వినిపించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కేంద్ర మంత్రిగా ఉన్నంత మాత్రాన రిజర్వేషన్లపై ఏమి చేయగలనని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా రాష్ట్రపతి కూడా ఏమీ చేయలేరని ఆయన ఆదివారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అన్నారు. మహారాష్ట్రలో తమ ప్రభుత్వమే ఉన్నా రిజర్వేషన్లపై ఏమీ చేయలేకపోయామని ఆయన చెప్పారు. గతంలో మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు వచ్చిందని ఆయన ఉదహరించారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా అక్కడ... బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. రిజర్వేషన్లు యాభై శాతానికి మించి ఉండరాదని లోగడ సుప్రీం కోర్టు క్యాప్ విధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రిజర్వేషన్లకు 50శాతం క్యాప్ పెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనేనని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 50శాతంకు వ్యతి రేకంగా వాదనలు వినిపించడంలో విఫలమైంది, ఇప్పుడు హైకోర్టులో వాదనలు వినిపించడంలో విఫలమైందని, అయితే ఈ విషయంలో తాను కేంద్ర మంత్రిగా ఉన్నంత మాత్రాన ఏమి చేయగలనని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో, సుప్రీం కోర్టులో వాదనలు వినిపించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని బిజెపి ఎప్పుడూ వ్యతిరేకించలేదని ఆయన చెప్పారు. అయితే బిసి రిజర్వేషన్ల పేరిట ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రయత్నానికే తాము అభ్యంతరం వ్యక్తం చేశామని ఆయన వివరించారు. బీసీ రిజరేషన్ల కోసం బిజెపి పూర్తి మద్దతు ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక విషయంలో జరుగుతున్న జాప్యం గురించి ప్రశ్నించగా, ముగ్గురు ఆశావాహుల పేర్లతో జాబితాను తమ పార్టీ కేంద్ర పార్లమెంటరీ బోర్డు పరిశీలనలో ఉందన్నారు. దీనిపై పార్టీ జాతీయ నాయకత్వం నిర్ణయాన్ని వెల్లడించనున్నదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

# మా కంట్రోల్‌లోనే అఫ్ఘాన్ ఎంబసీ

## భారత్‌తో సుస్థిర బంధాన్నే కోరుతున్నాం

## మా గడ్డపై టిటిపి స్థావరాలు లేవు

## దాడికి కుట్రలు చేస్తే గుణపాఠం చెబుతాం

## అఫ్ఘాన్ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తాఖీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** భారత్‌లో పర్యటిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ మీడియా మీట్‌లో న్యూఢిల్లీలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయం పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తన ముందు, వెనుక ఇస్లామిక్ ఎమిరేట్ (తాలిబన్) జెండాను ప్రదర్శించి మాట్లాడారు. భారత్ ఇంకా అధికారికంగా తాలిబన్ ప్రభుత్వాన్ని



గుర్తించనప్పటికీ, ఎంబసీలో పాత జెండానే కొనసాగుతున్నప్పటికీ ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఇది మా జెండా. దీని నీడలోనే మేం జిహాద్ చేశాం. ఈ ఎంబసీ నూటికి నూరు శాతం మాదే. ఇక్కడ పనిచేస్తున్న వారంతా మాతోనే ఉన్నారని ముత్తాఖీ తేల్చి చెప్పారు. గతంలో మహిళా జర్నలిస్టులను అనుమతించలేదని విమర్శలు రావడంతో, ఈసారి ఆదివారం నాటి సమావేశానికి మహిళా జర్నలిస్టులతో సహా పెద్ద సంఖ్యలో మీడియా ప్రతినిధులను అనుమతించారు. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో జరిపిన చర్చలు ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా సాగాయని ముత్తాఖీ తెలిపారు. వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యం, విమాన సర్వీసులు, అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించాం. వాణిజ్య వీసాలు, విద్యార్థుల మార్పిడి, ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు భారత్ సంసిద్ధత వ్యక్తం చేసిందని ఆయన వివరించారు. కాబూల్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా భారత్ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. ఢిల్లీకాబూల్, ముంబై-కందహార్, అమృత్‌సర్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య కొత్త విమాన సర్వీసులను ప్రారంభించే ప్రణాళికలను ముత్తాఖీ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి వాణిజ్య కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు, ఖనిజాలు, వ్యవసాయం, క్రీడల రంగాల్లో సహకారంపై కూడా చర్చలు జరిపినట్లు తెలిపారు. ఆఫ్ఘన్ సరుకుల కోసం అటారీవాఘా సరిహద్దును తెరవాలని భారత్‌ను కోరినట్లు ఆయన ధృవీకరించారు. మహిళల హక్కులపై అడిగిన ప్రశ్నకు, ఇస్లాంలో స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరి హక్కులకు రక్షణ ఉంది. మేం విద్యకు వ్యతిరేకం కాదు. విద్య హరామ్ కాదని ముత్తాఖీ అన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో బాలికలతో సహా కోటి మందికి పైగా విద్యార్థులు పాఠశాలలకు వెళుతున్నారని, కేవలం కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లోనే ఆంక్షలున్నాయని పేర్కొన్నారు. పాకిస్థాన్ విషయంలో ముత్తాఖీ కఠిన స్వరంతో మాట్లాడారు. "మేం శాంతియుత సంబంధాలనే కోరుకుంటాం. కానీ సంబంధాలు దెబ్బతింటే, భద్రతను ఎలా కాపాడుకోవాలో మాకు కూడా తెలుసని హెచ్చరించారు. ఆఫ్ఘనిస్థాన్‌ను నిందించే బదులు పాకిస్థాన్ తమ చెక్‌పోస్టులను అదుపులో పెట్టుకోవాలని సూచించారు. తెహ్రీక్‌ఏతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు తమ గడ్డపై లేరని ఆయన స్పష్టం చేశారు.

# తిరుమలేశుని సేవలో న్యాయమూర్తులు



**తిరుమల,అక్టోబరు 12ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల వేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో పలువురు న్యాయమూర్తులు కుటుంబంతో కలసి దర్శనం చేసుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ శ్యామ్‌సుందర్, ముం బై హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ అద్వాయ్ ఎం. ఛేతన, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరద కుమార్‌గుప్త, తమిళనాడు గవర్నర్ సతీమణి లక్ష్మీ రవి కుటుంబసభ్యులతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికా రులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. రంగనాయకులు మండపంలో వేదాశీర్వ చనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

# దేశవ్యాప్తంగా హైడ్రోజన్ బస్సులు

## ఎనర్జీ సర్వీసెస్ సంస్థ సిఇఒ అఖిలేష్ లేఖ

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ సంస్థ హైడ్రోజన్ బస్సుల సమీకరించడంపై దృష్టి సారించింది. క్లీన్ మొబిలిటీ విప్లవాన్ని నడిపిం చడంలో కీలక పాత్ర వహిస్తున్న ఈ సంస్థ హైడ్రోజన్ మొబిలిటీని ప్రోత్సహించడానికి ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ఆవిష్కరించినట్లు వాటాదారులను ఉద్దేశించి సంస్థ సిఇఒ అఖిలేష్ కుమార్ దీక్షిత్ లేఖ రాసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ ప్రయోజనం కోసం హైడ్రోజన్ బస్సుల డిమాండ్, అవసరాలను ఆయన తన లేఖలో వివరించారు. ఇది స్థిరమైన ఆర్థిక అభివృద్ధి, వాతావరణ సమ తుల్యతను కాపాడుతుం దన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా కేంద్రం తీసుకుంటున్న చర్యలకు ఇది మరింతగా తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. తక్కువ హైడ్రోజన్‌తో నడిచే బస్సులకు డిమాండ్ కారణంగా ఎక్విప్‌మెంట్ తయారీదారులను లక్ష్యంగా పెట్టుకుని ప్రణా ళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

ప్రధానంగా హైడ్రోజన్ బస్సులకు జాతీయ స్థాయిలో డిమాండ్‌ను కల్పించి వాటి వినియోగాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా పెట్టు కున్నట్లు వివరించారు.

క్లీన్ ఎనర్జీ సొల్యూ షన్‌లను వేగవంతం చేయడానికి దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్, హైడ్రోజన్ మొబిలిటీ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ సంస్థ స్థూల వ్యయ ఒప్పందం రేట్లు దేశంలోని పలు నగరాల్లో ఈ బస్ కార్యకలాపాల కోసం అత్యల్ప బిడ్ రేట్ల కంటే తక్కువగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఉత్తర రాష్ట్రాలలోని అనేక మెట్రో పాలిటన్ నగరాలతో పాటు, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, బెంగళూరు, మైసూర్, చెన్నై, కోయంబత్తూర్, తిరువనంతపురం వంటి దక్షి ణాది రాష్ట్రా లపై సీ ఈ ఎస్ ఎల్ దృష్టి సారిస్తుందని తెలిపారు. హైడ్రోజన్ బస్సుల విస్తరణ, ఎలక్ట్రిక్ బస్సు ల రంగంలో ఇప్పటికే నిరూపితమైన విజయాలను ఆధారంగా చేసుకుని, పరిశుభ్రమైన, స్థిరమైన మరియు సాంకేతికంగా అభివృద్ధి చెందిన మొబిలిటీ భవిష్యత్తుకు దేశ నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు.

# తెర

## బాలీవుడ్‌లో బంపరాఫర్ కొట్టేసిన మీనాక్షి చౌదరి



బాలీవుడ్‌లో బంపరాఫర్ కొట్టేసిన మీనాక్షి చౌదరి 'లక్కీ భాస్కర్', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలతో వరుస విజయాలు అందుకున్న మీనాక్షి చౌదరికి బాలీవుడ్ నుండి భారీ ఆఫర్ వచ్చింది. హిట్ ఫ్రాంచైజీ 'ఫోర్స్' మూడో భాగంలో హీరో జాన్ అబ్రహం సరసన కథానాయికగా ఆమెను ఎంపిక చేశారు. ఇప్పటికే కథ విన్న మీనాక్షి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. విపుల్ అమృత్‌లాల్‌షా, జాన్ అబ్రహం నిర్మాణంలో, దర్శకుడు నిషికాంత్ కామత్ తెరకెక్కించే ఈ చిత్రం ద్వారా మీనాక్షి హిందీ చిత్రసీమలో అడుగు పెడుతున్నారు. వరుసగా టాలీవుడ్ విజయాల తరువాత, ప్రస్టేజియస్ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లో హీరోయిన్‌గా లాంచ్ అవుతుండటంతో మీనాక్షి ఆనందానికి అవధుల్లేవు.

## అక్కినేని కుటుంబరావు
# అందరిలోనూ ఆలోచనను రేకెత్తించేలా తెరకెక్కించా

రోహిణి హట్టంగడి, రోహిణి ముల్లేటి, సముద్రఖని, హిమాంశు పోపూరి, సౌమ్య, అనన్య నన్నపనేని ప్రధాన పాత్రలో రానున్న చిత్రం 'ఒక మంచిప్రేమ కథ'. ఈ చిత్రాన్ని హిమాంశు పోపూరి నిర్మిస్తుండగా.. అక్కినేని కుటుంబరావు తెరకెక్కించారు. ఈ మూవీకి కథ, మాటలు, పాటల్నిఓల్గా అందించారు. ఈ సినిమాకు లక్ష్మీ సౌజన్య ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో,.నటి రోహిణి ముల్లేటి మాట్లాడుతూ, కోర్ట్' సినిమాతో ఆడియెన్స్ ముందుకు వచ్చాను. ఎప్పుడూ మంచి కథలతో ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉంది. ఇప్పుడు 'ఒక మంచి ప్రేమ కథ'తో రాబోతోన్నాను. ఓల్గా రాసిన కథ నాకు చాలా నచ్చింది. నేను, రోహిణి చాలా ఏళ్ల క్రితం కలిసి నటించాం.. ఈ చిత్రంలో అందరూ అద్భుతంగా నటించారు. మేం అడిగిన వెంటనే సపోర్ట్ చేసిన సముద్రఖనికి థాంక్స్. మా సినిమాను ముందుకు తీసుకు వెళ్తున్న ఈటీవీ విన్ టీంకు థాంక్స్అని అన్నారు.

సీనియర్ నటి రోహిణి హట్టంగడి మాట్లాడుతూ,ఇరవై ఏళ్ల క్రితం కుటుంబరావు, ఓల్గా ఓ సినిమా కోసం అప్రోచ్ అయ్యారు. ఈ కథనాకెంతో నచ్చింది. ఈసినిమా నా మనసుకి హత్తుకుంది. ఇంత మంచి చిత్రంలోనన్నుపార్ట్ చేసిన కుటుంబ రావుకి,ఓల్గాకి థాంక్స్. మాసినిమాను రిలీజ్ చేస్తున్న ఈటీవీ విన్‌కు థాంక్స్ .ఒక మంచి ప్రేమకథ లాంటి మంచి చిత్రానికి మంచి ఓటీటీ ప్లాట్‌ఫాం లభించింది అనిఅన్నారు . ఇక హిమాంశు వచ్చిన ఈ కథను సినిమాగా తీయాలని పట్టుబట్టారు. రోహిణి ముల్లేటిముందు నుంచీ ఈ కథతో ప్రయాణం చేశారు. మా ప్రాజెక్ట్‌లోకి రోహిణి హట్టంగడి రావడంతో ఆనందమేసింది. సముద్రఖని ఎంత బిజీగా ఉన్నా కూడా మాకు డేట్లు ఇచ్చారు. మంచి సినిమా రావాలని కోరుకునే ఆర్టిస్టులు మాకు దొరకడం మా అదృష్టం. ఈటీవీ విన్ మా సినిమాను తీసుకోవడం మరో అదృష్టం. 1985 నుంచి 2017 వరకు నేను రాసిన ప్రతీ నవల చతురలో వచ్చింది. నేను ఉషా కిరణ్ మూవీస్ బ్యానర్‌లోనూ చాలా కాలం పని చేశాను. మళ్లీ ఇప్పుడు నా సినిమా ఈటీవీ విన్‌లో రావడం ఆనందంగా ఉంది. పెద్దవాళ్లందరూ కలిసి నటించిన చిత్రమే అయినా ఇది యువతరానికి సంబంధించిన కథఅని అన్నారు. దర్శకుడు అక్కినేని కుటుంబరావు మాట్లాడుతూ ,సినిమాకి స్క్రిప్ట్ ఎంత ముఖ్యమో.. ఆర్టిస్టులు అంత ముఖ్యం ఆ తరువాత టెక్నీషియన్లు మరింత ముఖ్యం. గుమ్మడి గారికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో 'తోడు' సినిమాలో రోహిణి హట్టంగడిని తీసుకు లేకపోయాను. అయినా సరే ఆమెకు 37 ఏళ్ల తరువాత ఈ కథ




చెప్పడానికి వెళ్లాను. రోహిణి ముల్లేటిలేకపోతే ఈ చిత్రం ముందుకు వచ్చేది కాదు. సముద్రఖని ఎంత బిజీగా ఉన్నా కూడా మాకు సపోర్ట్ చేశారు. మధు అంబట్, రాధాకృష్ణన్, లెనిన్ లేకపోతే ఈ చిత్రం లేదు. ఓల్గా మంచి కథను, మాటల్ని, పాటల్ని ఇచ్చారు. కోట్లు సంపాదించేందుకు పరుగులు పెడుతున్నారు.. కానీ తల్లిదండ్రుల్ని పట్టించుకోవడం లేదు. అందరిలోనూ ఆలోచనను రేకెత్తించేలా ఈ సినిమాను తెరకెక్కించాను. ఎక్కడా బోర్ కొట్టించకుండా నవ్విస్తూ, ఏడ్పించేలా ఈ మూవీని తీశాను. ఈటీవీ విన్‌లో మా సినిమా వస్తుండటం ఆనందంగా ఉంది. మా కోసం వచ్చిన ప్రభు కి థాంక్స్ అని అన్నారు.

# ఆడియన్స్ ఇచ్చిన రెస్పాన్స్ మరిచిపోలేను




రిషబ్ శెట్టి బిగ్గెస్ట్ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ కాంతార: చాప్టర్ 1. ప్రఖ్యాత పాన్ ఇండియా నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 2న విడుదలైన అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకొని ఘన విజయాన్ని అందుకుంది. తొలి వారంలో ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 509 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసి కొత్త బెంచ్ మార్క్ ని క్రియేట్ చేసింది. కాంతార: చాప్టర్ 1 విజువల్ వండర్ గా ప్రేక్షకులని మెస్మరైజ్ చేస్తోంది. ప్రేక్షకులు విమర్శకుల నుంచి అద్భుతమైన ప్రశంసలు అందుకుంది. పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ కాంతరకి ప్రీక్వెల్‌గా వచ్చిన కాంతార: చాప్టర్ 1 ప్రస్తుతం బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టిస్తూ సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. కాంతార: చాప్టర్ 1తో చాలా పెద్ద విజయాన్ని అందుకున్నారు.. కంగ్రాజులేషన్స్. థాంక్యూ అండి. తెలుగు ప్రేక్షకులకి హృదయపూర్వక కృతజ్ఞతలు. చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. కాంతారకి ఎంత మంచి రెస్పాన్స్ వచ్చిందో ఈ సినిమా కూడా అంత గొప్ప రెస్పాన్స్ ఇచ్చారు. నా జర్నీలో సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను

**ప్రీక్వెల్ ఆలోచన ముందు నుంచే ఉందా?**

కాంతార చేసినప్పుడే ఈ ఆలోచన కూడా ఉంది. కాంతారాకి వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్ చూసి ప్రీక్వెల్ స్క్రిప్ట్ రాయడం మొదలుపెట్టాం.

**కాంతారతో జానపద కథలకు మళ్లీ పునర్వైభవం తీసుకొచ్చారని ప్రశంసలు రావడం ఎలా అనిపించింది?**

చాలా ఆనందంగా వుంది. కథని చాలా నిజాయితీగా చెప్పాలనుకున్నాం. అది ప్రేక్షకులకు నచ్చింది. ఇండియా జానపద కథలకు నిలయం. ఈ సినిమా విజయం మరిన్ని జానపద కథలు రావడానికి అవకాశం కల్పించడం చాలా ఆనందంగా ఉంది.

నాకు జానపద కథలు చేయడం ఇష్టం. కాంతార మా ప్రాంతంలో జరిగిన కథ. అందుకే లొకేషన్ కూడా మా ప్రాంతంలోనే తీసుకోవడం జరిగింది. నా వైఫ్ ఈ సినిమాకి ఇచ్చిన సపోర్టు మర్చిపోలేను. కాస్ట్యూమ్ డిజైనర్ గా తన కాంట్రిబ్యూషన్ మాకు ఎంతగానో హెల్ప్ అయింది.

**రుక్మిణి వసంత్ పాత్ర గురించి?**

రుక్మిణి ప్రీవియస్ సినిమాలు చూసి సెలెక్ట్ చేశాను. అలాగే గుల్షన్ దేవయ్య ,జయరాం గారి పాత్రలు కూడా అద్భుతమైన ఆదరణ పొందాయి. ప్రతి ఒక్కరూ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు। కానీ ఫస్ట్ ప్రిఫరెన్స్ అంటే దర్శకత్వానికి ఇస్తాను.

**అజినిష్ మ్యూజిక్ గురించి?**

అజినిష్ సినిమాకి చాలా డిఫరెంట్ గా కంపొజిషన్ చేశారు.

# గమ్మత్తుగా 'లవ్ ఓటిపి' ట్రైలర్



సూపర్ ఇంట్రెస్టింగ్ పేస్‌తో 2 నిమిషాల 27 సెకన్ల ట్రైలర్‌ను విడుదల చేసిన లవ్ ఓటిపి టీమ్. ఒకరికి తెలియకుండా మరొకరిని ఇలా ఇద్దరమ్మాయిలను ఒకేసారి ప్రేమించి ఇబ్బందిపడే అబ్బాయిల కథలా ఉంది 'లవ్ ఓటిపి' ట్రైలర్. ప్రేమంటే అస్సలు పడని నాన్న పాత్రలో బెంగుళూరులో ఉండే పోలీసాఫీసర్‌గా రాజీవ్ కనకాల నటించారు. భవప్రీతా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ యం రెడ్డి నిర్మాతగా అనీష్, జాన్విక, స్వరూపిణిలు హీరో హీరోయిన్లుగా నటించిన 'లవ్ ఓటిపి' చిత్రం అతి త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ సందర్భంగా నిర్మాత విజయ్ యం రెడ్డి మాట్లాడుతూ, ఫ్రెష్ కంటెంట్‌తో వచ్చిన ఏ సినిమాకైనా ఫుల్ డిమాండ్ ఉంటుంది అని అందరికి తెలుసు.


# మాస్ అవతార్ 'కాటలన్' ఫస్ట్‌లుక్



యాక్షన్ థ్రిల్లర్"కాటాలన్" ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరోగా అంటోని వర్గీస్ పెపే మాస్ అవాతర్ లో కనిపిస్తున్నారు. మంటల చుట్టూ, సిగరెట్‌తో, కళ్లలో జ్వాలలతో కనిపిస్తున్న అతని లుక్ అదిరిపోయింది. రక్తంతో తడిసిన ముఖం, చేతులు యాక్షన్ ఇన్‌టెన్సిటీని సూచిస్తున్నాయి. పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ .మార్కో" తర్వాత, కాటాలన్ క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, షరీఫ్ మహమ్మద్ నుంచి మరో భారీ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. డెబ్యుటెంట్ డైరెక్టర్ పాల్ జార్జ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాగ్రాండ్ పూజా కార్యక్రమాలలో ప్రారంభమైంది. పాన్ఇండియా కాన్సెప్ట్‌గా భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. థాయ్‌లాండ్ యాక్షన్ సన్నివేశాలను ప్రపంచ ప్రఖ్యాత ఒంగ్‌బాక్ సిరీస్ యాక్షన్ డైరెక్టర్ కెచా ఖాంఫక్డీ తన టీమ్‌తో కలిసి రూపొందించారు. అదే సిరీస్‌లో నటించిన పాంగ్ కూడా ఈ సినిమాలో కనిపించనుంది. సినిమాకు అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు.

కాటాలన్ లో తెలుగు నటుడు సునీల్ (పుష్ప, జైలర్ 2 ఫేమ్), కబీర్ దుహాన్ సింగ్ (మార్కో), రాపర్ బేబీ జీన్, రాజ్ తిరందాసు (పుష్ప ఫేమ్), బాలీవుడ్ నటుడు పార్థ్ తివారి (కిల్ ఫేమ్), అలాగే మలయాళ సినీ నటులు జగదీష్, సిద్ధిక్, వ్లాగర్‌సింగర్ హనాన్ షా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను జోబీ వర్గీస్, పాల్ జార్జ్, జెరో జేకబ్ సంయుక్తంగా రాశారు. డైలాగ్స్‌ను ఉన్నీ ఆర్. రాశారు.కట్టలన్ సినిమా మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది. సిబ్బంది:ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ జుమాన్ షెరీఫ్ సినిమాటోగ్రఫీ రెనదివ్ సంగీతం బి. అజనీష్ లోక్‌నాథ్ ఎడిటింగ్ షమీర్ మహమ్మద్‌స్టంట్స్ కేచా ఖంఫక్డీ, యాక్షన్ సంతోష్ ప్రొడక్షన్ డిజైన్ సునీల్ దాస్‌క్రియేటివ్.

# 'తెలుసుకదా' కు యూఏ సర్టిఫికెట్



స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ యూనిక్ లవ్ స్టోరీ తెలుసు కదా" ఈ దీపావళికి ప్రేక్షకులను అలరించే ందుకు సిద్ధమవుతోంది. అక్టోబర్ 17న విడుదల కాబోతున్న ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకొని"గ/తి సర్టిఫికేట్ పొందింది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సెన్సార్ టాక్ ప్రకారం, చిత్రానికి ఫుల్ పాజిటివ్ రిపోర్ట్స్ రావడతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. సినిమా రన్‌టైమ్ 2 గంటల16 నిమిషాలు, ఎలాంటి లాగింగ్ లేకుండా రేసీగా, ఎంటర్‌టైనింగ్‌గా వుంటుంది, సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా పాత్రలు యువతరానికి కనెక్ట్ అయ్యేలా ఈ ప్రేమకథ సాగనుంది. కథలో ఊహించని మలుపులు, భావోద్వేగాలు ప్రేక్షకులు సరికొత్త అనుభూతిని పంచనున్నాయి సిద్ధు తన స్వాగ్ చార్మ్ ఎనర్జీతో ఆకట్టుకోనున్నాడు. శ్రీనిధి, రాశీ గ్లామర్‌తో అలరించబోతున్నారు. వైవా హర్ష తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను నవ్వించనున్నారు.

# లాపత్తా లేడీస్‌కు 13అవార్డులు..!
### ఉత్తమనటుడు అభిషేక్ బచ్చన్
### ఉత్తమ నటి ఆలియాభట్
### అట్టహాసంగా 70వ ఫిలింఫేర్ అవార్డుల ప్రధానోత్సవం

70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ వేడుకలు అహ్మదాబాద్‌లో అట్టహాసంగా జరిగాయి. షారుక్ ఖాన్, కరణ్ జోహార్, మనీష్ పాల్ హోస్ట్‌లుగా వ్యహరించారు. 2024 సంవత్సరంలో విడుదలైన సినిమాలను ఎంపిక చేసి, వివిధ విభాగాలలో అవార్డులు అందజేశారు. ఇందులో 'లాపతా లేడీస్' సినిమా ఏకంగా 13 క్యాటగిరీలలో అవార్డులు సొంతం చేసుకుంది. కిల్ మూవీ 6 అవార్డులతో మెరిసింది. ఉత్తమ నటుడి పురస్కారాన్ని అభిషేక్ బచ్చన్ (ఐ వాంట్ టు టాక్), కార్తీక్ ఆర్యన్ (చందు ఛాంపియన్) స్వీకరించారు.

'జిగ్రా' సినిమాకిగానూ ఉత్తమ నటి అవార్డును అలియా భట్ అందుకున్నారు. జీవితకాల సాఫల్య పురస్కారం జీనత్ అమన్, శ్యామ్ బెనెగల్ (మరణానంతరం)ఆర్‌డి బర్మన్ అవార్డు అచింత్ ఠక్కర్ (జిగ్రా, మిస్టర్ లండ్ మిసెస్ మహి)

బెస్ట్ యాక్టర్ మేల్ రాజ్‌కుమార్ రావ్ (శ్రీకాంత్ మూవీ)బెస్ట్ యాక్టర్ ఫిమేల్ (క్రిటిక్స్ ఛాయిస్)

ప్రతిభ (లాపతా లేడీస్)బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ మేల్ రవి కిషన్ లాపతా లేడీస్, బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ ఫిమేల్ ఛాయా కదమ్ లాపతా లేడీస్, బెస్ట్ ఫిల్మ్ (క్రిటిక్స్) ఐ వాంట్ టు టాక్ (సూజిత్




సర్కార్)బెస్ట్ డెబ్యూ యాక్టర్ ఫిమేల్ నితాన్షీ గోయెల్ (లాపతా లేడీస్)బెస్ట్ డెబ్యూ యాక్టర్ మేల్ లక్ష్య (కిల్)బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ కునాల్ కెమ్ము (మడ్గావ్ ఎక్స్‌ప్రెస్),

ఆదిత్య సుహాస్ జంభలే (ఆర్టికల్ 370)బెస్ట్ యాక్షన్ సీయాంగ్ ఓహ్,పర్వేజ్ షేక్ (కిల్) బెస్ట్ స్క్రీన్ ప్లే స్నేహ దేశాయ్ (లాపతా లేడీస్)బెస్ట్ స్టోరీ

ఆదిత్య ధర్ మోనాల్ ఠక్కర్ (ఆర్టికల్ 370)బెస్ట్ డైలాగ్స్ స్నేహ దేశాయ్ (లాపతా లేడీస్)బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్ రామ్ సంపత్ (లాపతా లేడీస్)బెస్ట్ లిరిక్స్ ప్రశాంత్ పాండే (లాపతా లేడీస్)బెస్ట్ ప్లేబ్యాక్ సింగర్ మేల్ అర్జిత్ సింగ్‌లు గెలుచుకున్నారు.


# కళాకారులకు కలైమామణి పురస్కారాల ప్రదానం



కళాకారులకు కలైమామణి పురస్కారాలప్రధానంవివిధ విభాగాల్లో 90 మంది కళా కారులకు పురస్కా రాలు పుర స్కారాలు అందుకున్న వారిలో సూర్య, విక్రమ్ ప్రభు తదితరులు కళారంగంలో విశేష కృషి చేసిన ప్రతిభా వంతులను తమిళనాడు ప్రభుత్వ ంసత్క రించింది. చెన్నైలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ 2021, 2022, 2023 సంవత్సరాలకు గాను కలైమామణి' పురస్కారాలను ప్రదానం చేశారు. మొత్తం 90 మంది కళాకారులు వివిధ విభాగాలలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.2021 సంవత్సరానికి గాను నటనా విభాగంలో ప్రముఖ నటి సాయిపల్లవి ఈ పురస్కారానికి ఎంపిక కాగా, ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా ఆమెకు అవార్డును అందజేశారు.అలాగే, నటులు ఎస్.జే. సూర్య, విక్రమ్ ప్రభు తదితరులు కూడా పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు.

సంగీతం, నృత్యం, నాటకం, సినిమా వంటి విభాగాల్లో విశేష కృషి చేసిన కళాకారులను ప్రభుత్వం గుర్తించి సత్కరించింది.

# 'మటన్ సూప్ కు వస్తోన్న స్పందన చూస్తే ఆనందంగా ఉంది
## నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్)



అలుకా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ బ్యానర్లపై రామచంద్ర వట్టికూటి దర్శకత్వంలో మల్లిఖార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించిన చిత్రం మటన్ సూప్. రమణ్, వర్ష విశ్వనాథ్, జెమినీ సురేష్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన ఈ మూవీ అక్టోబర్ 10న విడుదలై మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ క్రమంలో నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మీడియాతో ముచ్చటించారు. ఆయన ఏం చెప్పారంటే..

**మటన్ సూప్..జర్నీ ఎలా ప్రారంభమైంది?..** నా దర్శకత్వంలో ఓ హారర్ మూవీని నేను ప్రారంభించాను. ఆ ప్రాజెక్ట్ చిత్రీకరణ సమయంలోనే నాకు రామచంద్ర పరిచయం అయ్యారు. ఆయన ఆ కష్టపడే తత్వం నాకు చాలా నచ్చింది.

**మటన్ సూప్ చిత్రంలో మీరు ఇచ్చిన సలహాలు, సూచనలు ఏంటి?**

మటన్ సూప్ మూవీకి ముందుగా నేను కో డైరెక్టర్‌గా వచ్చాను. ఆ తరువాత రామచంద్ర ప్యాషన్ చూసి నిర్మించేందుకు ముందుకు వచ్చాను.

**.నిజ జీవితంలో జరిగి ఘటనల్ని తీసుకుని తెరకెక్కించారు కదా.. ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి?..**

**రియల్‌గా జరిగిన సంఘటనలు కాబట్టి అసలు కథ ఏంటి?**

అన్నది అందరికీ తెలిసిపోయింది. కానీ ఆతెలిసిన కథను మేం కొత్తగా చెప్పాం. స్క్రీన్ ప్లేతో అందరినీ మ్యాజిక్ చేశాం. కథగా ఒకలా ఉంటే.. షూటింగ్ చేసినతరువాత సినిమా మొత్తాన్ని ఎడిటింగ్ టేబుల్ వద్ద మార్చేశాం. మా చిత్రం పేపర్ మీద కాకుండా ఎడిటింగ్ టేబుల్ వద్ద రెడీ అయిందని నేను గర్వంగా చెప్పుకోగలను.

**మటన్ సూప్ ఆర్టిస్టుల గురించి చెప్పండి?**

మా హీరో రమణ్ మాకు ఎంతో సహకరించారు. వర్ష విశ్వనాథ్ ఎప్పుడూ కూడా మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు. జెమినీ సురేష్ ఇచ్చిన సపోర్ట్ ఎప్పటికీ మర్చిపోలేం. గోవింద్ శ్రీనివాస్, శివరాజ్, ఎస్ఆర్‌కే, చరణ్, కిరణ్, గోపాల్ మహర్షి, సునీత మనోహర్, మాస్టర్ విహార్, కిరణ్ మేడసాని ఇలా అందరూ మాకు సహకరించారు.

**మటన్ సూప్ సాంకేతిక బృందం గురించి చెప్పండి?**

మటన్ సూప్‌టెక్నికల్ టీం స్ట్రాంగ్ పిల్లర్‌లా నిలబడింది. వెంకీ వీణ పాటలు, ఆర్ఆర్ సినిమాకు ప్రధాన బలమైంది. భరద్వాజ్, ఫణింద్ర విజువల్స్‌కు మంచి పేరు వచ్చింది. టీం అంతా కలిసి చేసిన ఈ మూవీకి మంచి ప్రశంసలు దక్కుతుండటం ఆనందంగా ఉంది. మా సినిమాను ఇంతలా ఆదరిస్తున్న ఆడియెన్స్‌కు థాంక్స్.మటన్ సూప్ కు ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది?..మటన్ సూప్ సినిమాకు మంచి స్పందన వస్తోంది. మేం ఊహించినట్టుగానే ఉంది.

**.భవిష్యత్తులో చేయబోతోన్న ప్రాజెక్ట్‌ల గురించి చెప్పండి?**

మా రామచంద్రతోనూ మరో ప్రాజెక్ట్ చేయాలని అనుకుంటున్నాను. త్వరలోనే వాటికి సంబంధించిన వివరాల్ని ప్రకటిస్తాం.

# 'మోగ్లీ 2025' డిసెంబరు12న విడుదల

'బబుల్ గమ్' తో సక్సెస్ ని అందుకున్న హీరో రోషన్ కనకాల'మోగ్లీ 2025'తో ప్రేక్షకులను అలరించ బోతున్నాడు. జాతీయ అవార్డు గ్రహీత, దర్శకుడు సందీప్ రాజ్



(కలర్ ఫోటో)

దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫారెస్ట్ నేపథ్యంలో సాగే యూనిక్ రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన 'మోగ్లీ 2025' ప్రొడక్షన్ చివరి దశలో ఉంది.ఈరోజు, నిర్మాతలు సినిమా విడుదల తేదీని అనౌన్స్ చేశారు. 'మోగ్లీ 2025' డిసెంబర్ 12న థియేటర్లలోకి వస్తుంది. డిసెంబర్ రెండవ వారంలో ఎలాంటి పెద్ద సినిమాలు లేకపోవడం"మోగ్లీ 2025"కు పెద్ద ప్లస్ పాయింట్‌గా కానుంది .నాని వాయిస్ ఓవర్ ఇచ్చిన ఫస్ట్ గ్లింప్స్‌తో ఈ చిత్రం స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేసింది. ఈ వీడియో ప్రేక్షకులను ది వరల్డ్ ఆఫ్ మోగ్లీకి పరిచయం చేసింది. ఎమోషనల్ నెరేటివ్ లో రోషన్ కనకాల పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నాడు. సాక్షి సాగర్ మడోల్కర్ హీరోయిన్. వారి అద్భుతమైన కెమిస్ట్రీ ఈ చిత్రంలో హైలెట్ గా ఉండబోతోంది. బండి సరోజ్ కుమార్ ఒక బలమైన విలన్ పాత్రను పోషిస్తుండగా, హర్ష చెముడు కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు.

# మైత్రి మూవీ మేకర్స్ 'ఆంధ్ర కింగ్ తాలూకా' హోల్సమ్ టీజర్ రిలీజ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్ ఎంటర్‌టైనర్ ఆంధ్ర కింగ్ తాలూకా మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించింది. ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించగా, ఉపేంద్ర ఆన్‌స్క్రీన్ సూపర్ హీరోగా కనిపించనున్నారు. వివేక్ మెర్విన్ సంగీతం అందించారు. ఇప్పటివరకు విడుదలైన రెండు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. ఈరోజు, మేకర్స్ టీజర్‌ను రిలీజ్ చేశారు. రామ్ క్యారెక్టర్, సినిమా కథాంశం గురించి ఒక గ్లింప్స్ ఇచ్చారు. రామ్ సినిమాలను ఆరాధిస్తూ, ఆంధ్ర కింగ్ ని ఆరాధిస్తూ పెరుగుతాడు. అంకితభావంతో ఉన్న అభిమానిగా, అతను తన అభిమాన స్టార్ విజయాలను సెలబ్రేట్ చేసుకుంటాడు. అతనిని సమర్థిస్తూ గొడవల్లో కూడా పాల్గొంటాడు. అతను తన హీరోని ఎంతగా ప్రేమిస్తాడో, అంతే తీవ్రంగా అతన్ని ప్రేమించే ఒక అమ్మాయి ఉంది. మురళి శర్మ చెప్పిన హార్డ్ హిట్టింగ్ డైలాగ్ తో టీజర్ ముగుస్తుంది. రామ్ పోతినేని ఈ చిత్రంలో ఒక సినిమా అభిమాని పాత్రలో ఒదిగిపోయారు. ప్రతి హీరో అభిమానికి ఈ పాత్రలో తామే ఉన్నట్టు అనిపించేలా నటించారు. తన ఎనర్జీ తో రామ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. భాగ్యశ్రీ బోర్స్ రామ్ లవ్ క్యారెక్టర్ లో గ్రేస్‌ఫుల్, ఎమోషనల్ గా కనిపించింది. రామ్ తల్లిదండ్రులుగా రావు రమేష్, తులసి బాగా నటించారు. రామ్ స్నేహితుడిగా సత్య హ్యూమర్ అందించగా, ఒక సీన్‌లో మురళీ శర్మ ఆకట్టుకున్నారు.తన తొలి చిత్రంతోనే మంచి హిట్ ఇచ్చిన దర్శకుడు మహేశ్ బాబు పి, ఈసారి మరో యూనిక్ కథను అందిస్తున్నారు. ఆయన డైలాగులు బలంగా, ప్రేక్షకుడికి కనెక్ట్ అవుతున్నాయి. టీజర్‌ను అద్భుతంగా కట్ చేశారు.

సిద్ధార్థ్ నూని సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది. వివేక్-మర్విన్ సంగీతం టీజర్ టోన్‌కి తగినట్టుగా మారుతూ, కథను మరింత ఎట్రాక్టివ్ గాన వుంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు అత్యున్నతంగా ఉన్నాయి. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా అద్భుతమైన వర్క్ అందించారు.

ఇది సినిమాను వేడుకలా జరుపుకునే చిత్రం. ఫుల్



ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చే ఈ టీజర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. భారీ అంచనాలతో ఆంధ్ర కింగ్ నవంబర్ 28న థియేటర్లలో విడుదల కానుంది.

# సైనిక దళాల్లో మహిళా ప్రాతినిధ్యం



చిన్నప్పుడు ఇంటి సమీపంలో జాగ్వార్, హాక్ యుద్ధ విమానాలు ఎగరడం చూశారామె. తానూ ఏదో ఒకరోజు వాటిని నడపాలను కున్నారు. ఆపై లక్ష్యాన్ని చేరుకోవడమే కాదు, వైమానిక దళానికి గెలుపుగుర్రంలా నిలిచిన మిగ్-21 యుద్ధ విమానాలకు వీడ్కోలు పలికే బృందంలో ఒకరిగా నిలిచారు స్క్వాడ్రన్ లీడర్ ప్రియాశర్మ.

హైదరాబాద్, దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 2017లో చేరారు ప్రియ. బ్యాచ్‌లో ఏకైక మహిళా ఫైటర్ పైలట్. భారత వైమానిక దళంలో ఏడో మహిళా ఫైటర్ పైలట్, ఐఐటీ కో నుంచి ఇంజినీరింగ్ పూర్తిచేశాక తండ్రి అడుగుజాడల్లో నడిచి ఎయిర్‌ఫోర్స్‌లో చేరారు ప్రియ. అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ నుంచి 2018లో గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ఐఎస్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా చేరారు. మొదట హైదరాబాద్, హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ చేరారు. కర్ణాటకలోని బీదర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు మారి అడ్వాన్స్‌డ్(స్టేజ్ 3) పూర్తిచేశారు. రాజస్థాన్‌లోని ఝుంజంతును జిల్లా, పిలానికి చెందిన కుటుంబం వీరిది. ఈమె తం బీదర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నప్పుడు రోజూ యుద్ధ విమానాలను చూసేవారు. అప్పుడే పైలట్ కావాలన్న ఆమె లక్ష్యానికి బీజం పడింది. 'దేశ సేవ కోసం ఎయిర్‌ఫోర్స్‌లో చేరడం, అందులోనూ ఫైటర్ పైలట్ కావడం ఉత్తమ మార్గం. శిక్షణలో చిన్న ప్రమాదాలు జరుగుతాయి. వాటిని చూసి బెదరలేదు. అలాంటివి మరింత దృఢపరచాయి. శిక్షణ తర్వాత కాక్‌పిట్‌లో ఎంతో ధైర్యంగా కూర్చోగలిగా. కాక్‌పిట్ ఇప్పుడు నాకు రెండో ఇల్లు లాంటిది అని చెబుతారు ప్రియ.

ఈ ఆగస్టులో రాజస్థాన్, బికనేర్‌లోని నాల్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌తో కలిసి మిగ్ను నడిపి వార్తల్లో నిలిచారు ప్రియ. ఆఖరిసారిగా చండీగఢ్ ఆరు మిగులు ఆకాశంలోకి ఎగరనున్నాయి. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్స్ చీఫ్‌తోపాటు పాల్గొననున్న పైలట్లలో ప్రియుడు ఒకరు. ఈమెకు సంబంధించిన రిహార్సల్స్‌లో భాగమయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మహిళా శక్తిని చాటేలా సైనికాధికారులు కల్నల్ సోఫియా సింగ్, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ బ్రీఫింగ్‌లో ఉన్నారు. ఇప్పుడు మరో కీలకఘట్టంలోనూ ప్రియాశర్మ రూపంలో నారీశక్తి భాగం. సైనిక దళాల్లో మహిళా ప్రాతినిధ్యానికీ, సారథ్యానికీ నిదర్శనంగా నిలుస్తున్నారు ప్రియ.

# ఆమె చిత్రం రమణీయం..

ప్రకృతిలోని అందాలను ఒడిసిపట్టి కాన్వాస్‌పై చిత్రించే కళాకారులు... దీనికి భిన్నంగా రైతన్నల కష్టాలు, మత్స్యకారుల జీవితాలు, ఆడపిల్లలపై వేధింపులు... సామాజిక వస్తువులను ప్రదర్శించేందుకు దీన్ని ఎంపిక చేశారు. హైదరాబాద్‌కు చెందిన రమణి మైలవరపు. తాజాగా ఢిల్లీలోని బికనేర్ హౌస్‌లో 'రూట్స్ టు రివర్స్' ఎగ్జిబిషన్ నిర్వహిస్తుంచిన ఆమె గూర్చి తెలుసుకుందాం.

కళకు పరిధి లేనట్లే... నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని నేను నమ్ముతాను. అందుకే, నాలుగు పదాలు దాటాక కూడా నచ్చింది చేయడానికి వెనకాడలేదు. నాకు చిన్నప్పటి నుంచీ బొమ్మలు గీయడమంటే ఆసక్తి, కాగితాలు, గోడలు, పెళ్లికార్డులు... ఇలా ఏవి ఖాళీగా కనిపించినా నచ్చిన చిత్రం వేసేదాన్ని.




తర్వాత చదువుల్లో పడి వదిలేశా. మా స్వస్థలం కాకినాడ. అక్కడే ఎంఎస్సీ వరకు చదువుకున్నా. పెళ్లయ్యాక హైదరాబాద్‌కు వచ్చేశా. మావారు ఐఆర్ఎస్ అధికారి అయిన ఆయన ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలు తిరగాల్సి వచ్చేది. అలా మేం కొన్నాళ్లు బెంగళూరులో ఉన్నాం. ఆ సమయంలో ఖాళీగా ఉండటం ఇష్టంలేక బొటిక్ నిర్వహించండి. కానీ, పాప చిన్నది కావడంతో కుదరక ఆ వ్యాపారాన్ని వదిలేశా. తను బడికెళ్లడం మొదలు పెట్టాక నాకు కొంత ఖాళీ దొరకడంతో తిరిగి నా అభిరుచులపై దృష్టిపెట్టా. దొడ్డమణి అనే గురువు దగ్గర ఏడాదిపాటు పెయింటింగ్‌లో మెలకువలు నేర్చుకున్నా. మళ్లీ మావారికి హైదరాబాద్ బదిలీ అయ్యింది. ఇక్కడికి వచ్చాక ల్యాండ్‌స్కేప్ పెయింటింగ్స్‌లోనూ ప్రావీణ్యం సాధించా. ఓసారి పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కి వెళ్తే జేఎన్టీయూ ఫైన్‌ఆర్ట్స్ గురించి తెలిసింది. అప్పటికే నలభై ఏళ్లు వచ్చాయి. ఆ వయసులో తిరిగి కాలేజీలో చదివితే ఎవరేమనుకుంటారో అని నేను ఆలోచించలేదు. ప్రవేశ పరీక్ష రాసి ఏడో ర్యాంకు సాధించా.



**సామాజికాంశాలపై సమరం...** చదువయ్యాక... కాంటెంపరరీ ఆర్ట్‌లో టెక్నిక్స్ నేర్చుకోవడానికి లండన్ వెళ్లా. అక్కడ వ్యర్థాల నుంచి కూడా అద్భుతమైన చిత్రాలను సృష్టించొచ్చని తెలుసుకున్నా. అప్పటి నుంచే క్షేత్రస్థాయి దృష్టి సారించడం మొదలుపెట్టా. ముఖ్యంగా గ్రామీణుల జీవితాలను నా కళ్లలో ప్రతిబింబించేలా చేయాలనుకున్నా. అలా స్త్రీలపై దాడులు, అన్నదాతల కష్టాలు, నిర్భయ సంఘటన, కొవిడ్‌పై అవగాహన, స్వచ్ఛభారత్ వంటి ఎన్నో అంశాల ఫొటో ఫెర్ఫార్మెన్స్ ఆర్‌లుగా మార్చారు. అంటే తీయాలనుకున్న ఫొటోలో నేనూ భాగమై... తర్వాత దాన్ని కాన్వాస్పై ప్రింట్ చేస్తా. ఆపై దాన్ని ఆక్రిలిక్ పెయింటింగ్‌తో తీర్చిదిద్దుతా. నిజానికి ఈ స్టైల్ పాశ్చాత్య దేశాల్లో ఎంతో పాపులర్. ఈ విషయంలో ఆర్టిస్టులు సిండి షెర్మాన్, పుష్పమాల నాకు ఆదర్శం. ఇప్పటి వరకూ హైదరాబాద్, ముంబయి, దుబాయ్, లండన్‌లలో జరిగిన గ్రూప్ ఎగ్జిబిషన్లలో నా ఆర్ట్ వర్క్స్ పెట్టా. 9 షోలో ప్రదర్శనలూ చేశా. తాజాగా ఢిల్లీలోని బికనేర్ హౌస్ లోని 'రూట్స్ టు రివర్స్' పేరుతో ప్రదర్శించారు. ఆఫ్ వాయిస్ వేవ్స్ (ఉప్పాడ మత్స్యకారులు), ఇన్విజిబుల్ రూట్స్ (అరకు గిరిజనులు), మోనాలిసా విత్ మాస్క్‌లతో పాటు బోడో గిరిజనుల జీవితాలు, సంస్కృతులు... దాదాపు 80 ఆర్ట్లను ఈ ఎగ్జిబిషన్‌లో చూపించారు. ఈ ప్రయత్నం ఆర్ట్ మీద అవగాహన పెంచడమే కాదు... సామాజిక సమస్యలపై పోరాటానికి ఉపయోగపడుతుంది.

# సముద్ర జలాలతో థెరపీ!



గ్రీకు భాషలో థలసా అంటే సముద్రం. సముద్రం నుంచి సేకరించిన నీరు, మట్టి, ఆల్గే వంటి వాటిని ఉపయోగించి థెరపీని థలసో థెరపీగా పిలుస్తారు. దీనికి ఇటీవల మనదగ్గర ప్రసిద్ధి చెందింది.

- సముద్ర జలాల్లో మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం వంటి ఖనిజ లవణాలు అధికంగా ఉండటం వల్ల ఒత్తిడి, అలసట, చర్మ సంబంధ సమస్యలకు ఉపశమనం లభిస్తుంది.
- సముద్ర జలాలను ఒక టబ్‌లోకి తీసుకుని వేడి చేసి ఆ నీటిలో దిగడం, అల్గే వంటి సీవీడిని చుట్టడం, సముద్ర జలాలతో షవర్ చేయడం... వంటి మార్గాలున్నాయి.
- క్లియోపాత్ర కూడా సముద్ర జలాలకు పాలు, గులాబీ రేకల్ని జోడించి స్నానమాచరించేదట.
- డెర్మటాలజిస్టులు... ఈమధ్య సముద్రతీర మట్టి, ఆల్గే, సముద్ర ఖనిజ లవణాలు జోడించిన ఫేషియల్స్‌ను సూచిస్తున్నారు. ఇవి రక్తప్రసరణను పెంచుతాయి. శరీరంలోని మలినాలను బయటకు పంపుతుంది.
- మెగ్నీషియం, పొటాషియం, అయోడిన్ వంటి ఖనిజాలు కీళ్ల నొప్పులను తగ్గించి, కండరాల పునరుద్ధరణకు సాయపడతాయి. అందుకే క్రీడాకారులూ సముద్ర జలాల స్నానాన్ని గుర్తించారు.
- ప్రకృతికి దగ్గరగా ఉండటంవల్ల కలిగే లాభాలు సముద్ర జలాల్లో స్నానమాచరించడంవల్ల ఉంటాయి. ప్రశాంతతనూ, నిద్రనూ కారణంగా రోగ్యాన్ని పెంచుతాయి.
- మన దగ్గర ఆయుర్వేదం, స్పా మసాజ్‌లకు వచ్చినంతంగా ఇంకా థలసోథెరపీకి ఆదరణ, సదుపాయాలు రాలేదు. కానీ మీరైతే బీచ్‌కు వెళ్తే స్నానం చేయడం మర్చిపోవద్దు, పరిశుభ్రతా చూసుకోండి.

# ప్యాకేజింగ్ ఆహారం వద్దు..

పసి పిల్లలకోసం కొనే ప్రతి వస్తువు నాణ్యమైనదై ఉండాలనుకుంటాం. ఇక ఆహారైతే ప్యాకెట్ లేబుల్ని పరిశీలించుకుని మరీ కొంటాం. ఈ విధంగానే రకరకాల పండ్లు, కూరగాయలతో చేసిన ఆహారం... ప్యాకెట్ మీద వాటి చిత్రాలను వేస్తారు. తయారీదారులు. అయితే, ఇవి చాలావరకు మనల్ని తప్పు దారి పట్టించేలా ఉంటున్నాయని యూనివర్సిటీ ఆఫ్ ఆక్లాండ్ తాజా పరిశోధనలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా పసిపిల్లలకు తినిపించే ఆహారపదార్థాల ప్యాకేజింగ్‌ను పరిశీలించారు శాస్త్రవేత్తలు. ప్యాకెట్ మీద పండ్ల చిత్రాలు, తయారీలో మాత్రం 5 శాతం కంటే తక్కువగా ఉపయోగించినట్లు పేర్కొన్నారు.



ఎలాంటి ఎడిటివ్స్, కృత్రిమ రంగులు కలపలేదన్న ప్యాకెట్ మీద లేబుల్ చూసి మంచివే అని ఏంచుకుంటాం. కానీ, అందులో అధిక చక్కెరలు, ప్రాసెస్ చేసిన పదార్థాలు. వీటిని గమనించకుండా మన దృష్టి మళ్లిస్తుంటాయి ఆ లేబుళ్లు. పిల్లల ఎదుగుదలకు మొదటి వెయ్యి రోజులూ కీలకం. ఈ సమయంలో వారికి పోషకాహారం మాత్రమే అందించాలి. కాబట్టి, పిల్లలకు ప్యాకేజింగ్ ఆహారాన్నివ్వటం తగ్గించాలని సూచిస్తున్నారు పరిశోధకులు.

## తెలుసు కుందాం..

కల్పనా సరోజ్ 1960-70ల్లో చిన్న ఫర్నిచర్ దుకాణంతో మొదలైంది ఆమె ప్రయాణం. అక్కడ్నుంచి చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ, 2001 నష్టాల్లో నడుస్తోన్న 'కమానీ ట్యూబ్స్ లిమిటెడ్' కంపెనీ పగ్గాలు తీసుకుని, లాభాలబాట పట్టించారు. మన దేశ మొట్టమొదటి మహిళా పారిశ్రామికవేత్తగా పేరు తెచ్చుకున్నారు. 2013లో ఈమెకు పద్మశ్రీ కూడా ఇచ్చారు.

# పింగాణీ 'ఘుమఘుమలు'











వంటగది అంటే కేవలం ఆహారం తయారుచేసుకునే ఓ గది... అన్న భావన ఎప్పుడో పోయింది. దాన్ని కూడా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు ఈ తరం ఆడవాళ్లు. అందుకే దాన్లో వాడే ప్రతి వస్తువునూ ఏరికోరి ఎంచుకుంటున్నారు. అందులో భాగంగా వచ్చినవే ఈ పింగాణీ వంట పరికరాలు. స్టీలు, గాజు పాత్రలు ఉన్నా సరే... ఆడవాళ్లకు పింగాణీ వస్తువులపై ఉండే ప్రేమే వేరు. అందుకే కుక్వేర్, డిన్నర్వేర్ రూపంలో వాటిని ఎప్పుడో వంటింట్లో భాగం చేశారు. ఈ ఇష్టాన్ని చూసేనేమో తయారీదారులు కిచెన్లో వాడే పరికరాలనూ పింగాణీతో చేయటం కోసం. అందులోనూ సాదాసీదాగా కాదు... సృజనాత్మకత ఉట్టిపడేలా రకరకాల డిజైన్లు, రంగుల్లో తీసుకొచ్చారు. ఎగ్ ట్రే అల్లం, వెల్లుల్లి గ్రేటర్, సాల్ట్, పెప్పర్ డబ్బా, స్పూన్, స్పాంజ్ హోల్డర్, ఎగ్ ఎల్లో సెపరేటర్... ఇలా ఎన్నో రకాలుగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రయోజనంతోపాటు, కిచెన్కి ఓ డెకరేటివ్ టచ్నీ ఇస్తాయివి. పైగా శుభ్రపరచుకోవటమూ తేలిక. కాస్త జాగ్రత్తగా వాడుకుంటే చాలు. అందం, అలంకరణ, ఉపయోగం అన్నీ ఉన్న ఈ టూల్స్ కిచెన్‌కి కొత్త అందాన్నిస్తాయనటంలో సందేహం లేదు! ఏమంటారు?















# శివపూజ

మృకండ మహర్షికి హరిహరులు వరం ప్రసాదించగా మార్కండేయుడు జన్మించాడు. కొడుకు వరప్రసాది అయినా పదహారేళ్లే జీవిస్తాడని తెలిసి ముని దంపతులు మథనపడుతున్నారు. ఒకరోజు ఆశ్రమానికి వచ్చిన నారదుడు మహర్షీ కొడుకు అల్పాయుష్కుడని బాధపడకు, కైలాసవాసుడు తలరాతను కూడా మార్చగలడు. మార్కండేయుడు మహేశ్వరుణ్ణి మెప్పించి పూర్ణాయుష్షును పొందుతాడు అని ఆశీర్వదించాడు. నారదముని ఆశీస్సులతో బాల మార్కండేయుడు శివభక్తుడయ్యాడు. తల్లిదండ్రులు కూడా కొడుకు కోసం నిత్యం శివార్చన చేసేవారు. వారి అనుమతితో బాలకుడిగా ఉన్నప్పుడే మార్కండేయుడు అడవులకు వెళ్లి ఆ పరమేశ్వరుని కోసం తపస్సు చేయసాగాడు. శివపూజలో ఏళ్లు గడిచాయి. మార్కండేయుని ఆయుర్దాయం తీరిపోగా, అతడి ప్రాణాల్ని తీసుకువెళ్లేందుకు యమధర్మరాజు వచ్చాడు. 'బాలకా! నీ ఆయువు ముగిసింది, బయల్దేరు' అని తొందర పెట్టాడు. 'శివపూజలో ఉన్నాను! ఇప్పుడు రాలేను!' అన్నాడు ఆ బాలకుడు అన్నాడు. అయినా యముడు పట్టువదలక తన యమపాశాన్ని విసిరాడు. అప్పుడు మార్కండేయుడు ఆర్తిగా శివలింగాన్ని ఆలింగనం చేసుకున్నాడు. యముడు విసిరిన కాలపాశం బాలభక్తుడితో పాటు భక్తవశంకరుణ్ణి కూడా చుట్టుకుంది. తన భక్తుని హింసిస్తున్నందుకు త్రినేత్రుడు ఆగ్రహోదగ్రుడై యమధర్మరాజునే నేలకూల్చాడు. తర్వాత దేవతలు ప్రార్థించగా యముడికి ప్రాణభిక్ష పెట్టాడు. తన భక్తుల జోలికి వెళ్లకూడదంటూ ఆజ్ఞాపించాడు. మార్కండేయుని ప్రేమగా దగ్గరకు తీసుకుంటూ నాయనా మార్కండేయా! నువ్వు చిరంజీవివై చిరకీర్తిని పొందుతావు అని ఆశీర్వదించాడు. కాలగమనంలో జ్ఞానసంపదను ఆర్జించి, ఆధ్యాత్మిక సాధనలు చేసి బాల మార్కండేయుడు, మార్కండేయ మహర్షిగా కీర్తిపొందాడు. మహాభారతం ఈ మహర్షి ప్రస్తావన తెచ్చాడు.



ఆధ్యాత్మికం

# పఠనాసక్తి పెంచుకోవాలి!

సమయం దొరికినా వాటితోనే కాలక్షేపం. చదవడమే కాదు, వాటిపై చర్చలు కూడా పెట్టేవారు. వాళ్లు తెలుసుకున్నది నలుగురితో పంచుకునేవారు. కానీ ఇప్పుడో అంతా సామాజిక మాధ్యమాల మాయాజాలమే. స్క్రోలింగ్ నుంచి చూపు మరలితేనా... ఇంకేదైనా ఆలోచించడానికి. దీనివల్ల ఎన్నో సమస్యలు కొనితెచ్చుకుంటు న్నారు. అందుకే జెన్ జి, మిలీనియల్ అమ్మాయిలు పుస్తకపఠనంపై ఆసక్తి కనబరుస్తున్నారు. వారు చదివిందే కాక, రివ్యూలు చెబుతూ పక్కవారిలోనూ చదవాలనే ఆసక్తిని కలిగిస్తున్నారు. అయితే కొత్తగా పుస్తకపఠనం మొదలుపెట్టే వారికి కొన్ని సూచనలివి...



★. సబ్జెక్ట్ పుస్తకాలు తప్ప... వేరేవి కాస్త మేమెప్పుడూ చదవలేదు అనేవారు ఆరంభశూరత్వం ఉండకూడదంటే... మొదట చిన్నచిన్న కథలు ఉంటే బుక్స్ ఎంపిక చేసుకోండి. 10 నుంచి 15 నిమిషాల్లో పుస్తకం పూర్తయిపోయేలా ఉండేవైతే మేలు. అప్పుడే విసుగు అనిపించింది. ఇంకా చదవాలంటే ఆసక్తి కలుగుతుంది.

★ ఒక్క సారిగా జీవిత చరిత్రలవైపు మళ్లకుండా... హాస్యం, థ్రిల్లర్, ఫిక్షన్ ఎంపిక చేసుకోండి. ఈ జానర్ పుస్తకాలు ఆసక్తిగా చదవండి.

★ చదివినప్పుడు నచ్చిన లైన్లను నోట్ చేసుకోండి. నిద్రపోయేముందు వాటిని మళ్లీ ఓసారి చూసుకోండి. అవే ఇంకా ఆ పుస్తకంలో ఇలాంటి విషయాలు ఏమేమి ఉన్నాయో చూడాలన్న ఆసక్తిని కలిగిస్తాయి.

★ ప్రాథమిక దశ దాటాక రోజుకి ఐదు, పది పేజీలంటూ లక్ష్యాన్ని పెట్టుకోండి. మీరు ఎంపిక చేసుకున్న పుస్తకం మీకు తెలియకుండానే ఇట్టే పూర్తయిపోతుంది.

★రెండు పేజీలు అయినా చదవందే నిద్ర పట్టదు' అని అమ్మల దగ్గర వినే ఉంటారు. మనకేమో ఫోన్‌లో స్క్రోల్ చేయందే కునుకు రాదు. ఈ అలవాటును దారి మళ్లించాలన్నా కళ్లకు, మనసుకు విశ్రాంతి ఇవ్వాలన్నా..పుస్తకం పట్టాల్సిందే. అందుకే రోజూ నిద్రపోయేముందు కనీసం 20 నుంచి 30 నిమిషాలు దీనికి కేటాయించండి.

# పప్పుతో పచ్చడి

కందిపప్పుతో ఎప్పుడూ పప్పు, సాంబార్ రొటీన్ కదా! ఈసారి ఇలా పచ్చడి చేద్దామా..

**కావాల్సినవి:** కందిపప్పు కప్పు, ఎండుమిర్చి 9, కరివేపాకు రెబ్బలు 4, ఆవాలు, మినుములు, జీలకర్ర 2 చెంచాలు, రాళ్ల ఉప్పు సరిపడ, చింతపండు నిమ్మకాయంత, వెల్లుల్లి రెబ్బలు 8, పసుపు చిటికెడు.

**తయారీ:** ఒక కడాయిలో కందిపప్పు వేసి సన్నని సెగపై వేయించుకోవాలి. తర్వాత ఎండుమిర్చి, జీలకర్ర వేసి రెండు నిమిషాలు వేగనివ్వాలి. తర్వాత ఒక ప్లేట్‌లోకి తీసుకుని చల్లారాక మిక్సీలో కొద్దిగా రాళ్ల ఉప్పు జతచేసి నీళ్ల పోయకుండా ఒకసారి మిక్సీ పట్టుకోవాలి. తర్వాత కొద్దిగా నీళ్ల పోసి జారుగా కాకుండా గట్టిగా రుబ్బాలి.



తర్వాత ఒక పాన్‌లో నూనె పోసి వేడయ్యాక ఆవాలు... జీలకర్ర, మినపప్పు, కరివేపాకు, ఎండుమిర్చి, దంచిన వెల్లులి రెబ్బలు, ఉప్పు, పసుపు వేసి కలపాలి తర్వాత చింతపండు రసం పోయాలి. కాసేపయ్యాక కంది మిశ్రమం వేస్తే పచ్చడి సిద్ధం. వేడి వేడి అన్నంలో ఈ పచ్చడిలో కొద్దిగా నెయ్యి వేసుకునే తింటే భలే కమ్మగా ఉంటుంది.!

## అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో
# చైనాకు డబుల్ స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్ చివరి రోజున చైనా డబుల్ స్వర్ణ పతకాన్ని పూర్తి చేసింది. టోర్నమెంట్ చివరి రోజున పురుషుల, మహిళల వాటర్ పోలో ఈవెంట్లలో చైనా బంగారు పతకాలు సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మిర్తా పూల్స్ కొత్తగా నిర్మించిన ఈ ఫెసిలిటీలో జాంగ్ కిషువో ఏడు గోల్స్ చేయడంతో, చైనా మహిళల జట్టు అత్యధిక స్కోరింగ్‌తో కూడిన ఫైనల్‌లో జపాన్‌ను



22–17తో ఓడించింది. మ్యాచ్ అంతటా చైనా నియంత్రణను కొనసాగించడంతో వాంగ్ జువాన్, లి లినున్ కీలకమైన స్ట్రైక్‌లను జోడించారు. పురుషుల ఫైనల్లో, నిర్ణీత సమయం ముగిసిన తర్వాత ఉత్కంఠభరితమైన పెనాల్టీ షూటౌట్‌లో (5–4) చైనా 16–15తో ఇరాన్‌ను ఓడించింది. చైనా తరపున కెప్టెన్ చెన్ యిమిన్, చు చెంఘావో రెండుసార్లు గోల్స్ చేయగా, ఇరాన్‌కు చెందిన షామ్స్ అర్మాన్ ఐదు గోల్స్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. కజకిస్తాన్ రెండు కాంస్యాలను గెలుచుకుంది. మహిళల జట్టు థాయిలాండ్‌ను 9–8తో ఉత్కంఠభరితమైన షూటౌట్‌లో (3–2) ఓడించింది, పురుషుల జట్టు జపాన్‌ను 16–14తో ఓడించింది, హాంకాంగ్‌తో 11–18 తేడాతో ఓడిపోయిన తర్వాత భారత్ ఎనిమిదో స్థానంలో నిలిచి, 2026 ఆసియా క్రీడలకు అర్హతను నిర్ధారించింది.

## సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్..
# అజేయంగా భారత్

**న్యూఢిల్లీ:** సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్–2025లో న్యూజిలాండ్‌పై భారత్ సునాయాసంగా విజయం సాధించింది. మలేషియాలో ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన రెండవ మ్యాచ్‌లో 4–2 తేడాతో గెలుపొంది ఇండియా కోల్ట్స్ అజేయంగా నిలిచింది. విజేత జట్టు తరపున అర్షదీప్ సింగ్ (2వ నిముషం), పిబి సునీల్ (15), అరైజీత్ సింగ్ హుందాల్ (26), రోమన్ కుమర్ (47) గోల్స్ చేయగా, న్యూజిలాండ్ తరపున గుస్ నెల్సన్ (41), ఐడాన్ మార్క్స్ (52) గోల్స్ చేశారు. భారత్ జట్టుకు తొలి గోల్ మొదటి క్వార్టర్ ప్రారంభమైన రెండో నిమిషంలోనే వచ్చింది.



న్యూజిలాండ్ సర్కిల్‌లో పేలవమైన డిఫెండింగ్ తర్వాత అర్షదీప్ సింగ్ లూజ్ బాల్ ద్వారా గోల్ చేశాడు. క్వార్టర్ చివరి నిమిషంలో సునీల్ పిబి గోల్ చేయడంతో ఇండియా కోల్ట్స్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. మూడో క్వార్టర్‌లో న్యూజిలాండ్ ప్లేయర్ గుస్ నెల్సన్ 41వ నిమిషంలో గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం 3–1కి తగ్గింది. అయితే, 47వ నిమిషంలో రోసన్ కుమర్ పిసి ద్వారా గోల్ చేయడంతో చివరి క్వార్టర్‌లో భారత్ 4–1 ఆధిక్యంలో నిలిచింది. 52వ నిమిషంలో న్యూజిలాండ్ తరపున బిడెన్ మార్క్స్ ఒక గోల్ చేయడంతో స్కోరు 4–2కు చేరి భారత్ గెలుపొందింది.




## అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్..
# భారత్ అథ్లెట్ల అద్భుత ప్రదర్శన

**న్యూఢిల్లీ:** జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2025, 2వ రోజు భారత్ అథ్లెట్లు అద్భుత ప్రదర్శనతో ప్రపంచ అండర్ 20 అర్హత ప్రమాణాలను అధిగమించారు. భువనేశ్వర్‌లో జరిగిన ప్రపంచ అండర్ 20 పురుషుల 100 మీటర్ల రేసులో ప్రస్తుత ఛాంపియన్ అయిన జార్ఖండ్‌కు చెందిన పార్థ్ సింగ్, లాంగ్ జంప్‌లో వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. 7.82 మీటర్ల జంప్‌తో కొత్త మీట్ రికార్డును నెలకొల్పి అందరి దృష్టిని ఆకర్షించాడు. ప్రపంచ అండర్ 20 అర్హత మార్కు 7.58 మీటర్లను అధిగమించాడు. అలాగే ప్రస్తుత ఆసియా యూత్ ఛాంపియన్ హర్యానాకు చెందిన హిమాన్షు, అండర్ 18 జావెలిన్ త్రోలో 80.38 మీటర్ల ప్రయత్నంతో ఆధిపత్యం చెలాయించాడు. ప్రపంచ అండర్ 20 ప్రమాణం 68.50 మీటర్లను సులభంగా అధిగమించాడు. అతని త్రో క్వాలిఫికేషన్ రౌండ్‌లో సొంత మీట్ రికార్డు 79.96 మీటర్లను కూడా మెరుగుపరుచుకుంది. అలాగే అండర్20 పురుషుల 400 మీటర్ల పరుగులో, ముగ్గురు పతక విజేతలు మహమ్మద్ అష్ఫాక్ (కేరళ, 46.87సె), శరణ్ ఎం (తమిళనాడు, 47.09సె), రోహిత్ చౌదరి (ఉత్తరప్రదేశ్, 47.17సె) 47.40 సెకన్ల అర్హత సమయాన్ని చేరుకున్నారు. మహిళల్లో యుపికి చెందిన నీరు పాఠక్ అండర్20 మహిళల 400 మీటర్లలో 53.38 సెకన్ల మీట్ రికార్డును సృష్టించింది, జిస్నా మాథ్యూ 2017 మార్కు 53.52 సెకన్లను అధిగమించి, ప్రపంచ అండర్20 కట్ 55.20 సెకన్లను సులభంగా అధిగమించింది.



# ఐపిఎల్ మినీ వేలం..
## కాస్ట్లీ ప్లేయర్స్ ఔట్
### రూ.100 కోట్లకు ఫ్రాంచైజీల చెక్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ దగ్గర పడుతోంది. దీంతో ఫ్రాంఛైజీలు కొత్త సీజన్ ప్లేయర్ల వేలం కోసం సిద్ధమవుతున్నాయి. ఈ మినీ వేలం డిసెంబర్ 15 నుంచి 17 మధ్య జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి ప్లేయర్ల రిటైన్ జాబితాను విడుదల చేసేందుకు నవంబర్ 15 చివరి తేదీ. దీంతో పలు ఫ్రాంచైజీలు విడుదల చేసే వారిలో కాస్ట్లీ ప్లేయర్లను బయటకు పంపే ఆలోచన చేస్తున్నాయి. ఈ విధంగా కనీసం రూ.97.35 కోట్లు (సుమారు 1.7బిలియన్) విలువైన ఆటగాళ్ల విడుదలస్పష్టంగా కనిపిస్తుంది. ఐదుసార్లు ఛాంపియన్లుగా నిలిచిన చెన్నై సూపర్‌కింగ్స్ కనీసం ఐదుగురు ప్రధాన ఆటగాళ్లను విడుదల చేసే అవకాశం ఉంది. వీరిలో డెవాన్ కాన్వే (రూ.6.25 కోట్లు), దీపక్ హుడా (రూ.1.70 కోట్లు), విజయ్ శంకర్ (రూ.1.20 కోట్లు), రాహుల్ త్రిపాఠి (రూ.3.40 కోట్లు), సామ్ కుర్రాన్ (రూ.2.40 కోట్లు) వంటి ప్రముఖ పేర్లు ఉన్నాయి. గత మెగా వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో ఒకరైన వెంకటేష్ అయ్యర్‌ను కూడావిడుదల చేసే వీలుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ అతన్ని రూ.23.75 కోట్లకు కొనుగోలు చేసింది. లీగ్ చరిత్రలో మూడవ అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. అయితే, అతని ప్రదర్శన పేలవంగా ఉంది. ఇక రిషబ్ పంత్ నేతృత్వంలోని లక్నో సూపర్ జెయింట్స్ కూడా కొంత మంది అధిక ధరల ఆటగాళ్లను విడుదల చేయనుంది. ఆకాష్ దీప్ (రూ.8 కోట్లు), డేవిడ్ మిల్లర్ (రూ.7.50కోట్లు) వంటి కాస్ట్లీపేర్లు కూడాఉన్నాయి. ఫాస్ట్ బౌలింగ్‌తో సంచలనం సృష్టించిన మయాంక్ యాదవ్ (రూ.11 కోట్లు) కూడా విడుదల కానున్నారు. కాగా ఢిల్లీ క్యాపిటల్స్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకొని తమ ఇద్దరు బౌలర్లను విడుదల చేయనుంది. ఇందుకోసం రూ.22 కోట్లకు పైగా ఖర్చు చేశారు. వారిలో వెటరన్ ఆస్ట్రేలియన్ ఫాస్ట్‌బౌలర్ మిచెల్‌స్టార్క్ (రూ.11.75 కోట్లు) కీలక ఆటగాడు, ఎడమచేతి వాటం భారత పేసర్ టి నటరాజన్ (రూ.10.75 కోట్లు)కూడా విడుదల కావొచ్చు. రాజస్థాన్‌రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ పరిస్థితి ఇంకా అస్పష్టంగానే ఉంది. అయితే, శ్రీలంకస్పిన్ ఆల్‌రౌండర్ వానిందు హసరంగా (రూ.5.25 కోట్లు), శ్రీలంక స్పిన్నర్ మహీష్ తీక్షణ (రూ.4.40 కోట్లు) విడుదల చేసేందుకు ఫ్రాంచైజీలు సిద్ధమవుతున్నాయి.

# ఫాలోఆన్‌లో వెస్టిండీస్ పోరాటం
## భారత్ 97 పరుగుల ఆధిక్యం





**న్యూఢిల్లీ:** ఇండియాతో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ పోరాడుతోంది. మూడోరోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 97 పరుగుల ఆధిక్యంలో భారత్ ఉంది. 270 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్, ఆట ముగిసే సరికి 49 ఓవర్లలో 2 వికెట్లకు 173 పరుగులు చేసింది. ఓపెనర్ క్యాంబెల్ సూపర్బ్ ఫిఫ్టీ (145 బంతుల్లో 87 బ్యాటింగ్, 9 ఫోర్లు, 2 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచి, కెరీర్ బెస్ట్ స్కోరును నమోదు చేశాడు. క్రీజులో అతనితో పాటు, షాయ్ హోప్ (103 బంతుల్లో 66 బ్యాటింగ్, 8 ఫోర్లు, 2 సిక్సర్లు) ఉన్నాడు. బౌలర్లలో వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్ కు తలో వికెట్ దక్కింది. ఇంకా 97 పరుగుల దూరంలో విండీస్ నిలిచింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 5 వికెట్లకు 518 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. కాగా వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ లో 248 పరుగులకు ఆలౌట్ అయింది. అహ్మదాబాద్‌లో జరిగిన తొలి టెస్టును ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచిన భారత్ రెండుటెస్టుల సిరీస్ లో 1–0తో ఆధిక్యంలో ఉంది. అంతకుముందు 270 పరుగుల లోటుతో ఫాలో ఆన్ ఆడిన వెస్టిండీస్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగి లింది. ఓపెనర్ త్యాగనారాయణ్ చందర్ పాల్ (10) ర్యాష్ షాట్ ఆడి, మరోసారి విఫలమయ్యాడు. సిరాజ్ బౌలింగ్‌లో పుల్ షాట్ కు ప్రయత్నించి, కెప్టెన్ శుభమాన్ గిల్ సూపర్బ్ క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. ఆ తరవాత తొలి ఇన్నింగ్స్ టాప్ స్కోరర్ అతనాజ్ (7)ను వాషింగ్టన్ సుందర్ బౌల్డ్ చేశాడు. దీంతో 35 పరుగులకే రెండు వికెట్లకు కోల్పోయింది. మ్యాచ్‌కు ముందు 68 పరుగుల వ్యక్తిగత స్కోరు ఉన్న క్యాంబెల్ ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని 69 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్ లో హోప్ కూడా 80 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరూ అబేధ్యమైన మూడో వికెట్‌కు 138 పరుగులను జత చేశారు. ఈక్రమంలో మూడో సెషన్ మొత్తం మీద ఒక వికెట్ పడకుండా విండీస్ రోజును ముగించింది. అంతకుముందు ఆదివారం మూడోరోజు 140–4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విండీ‌స 81.5 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. వన్ డౌన్ బ్యాటర్ ఆలిక్ అతనాజ్ (41) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ కు ఐదు వికెట్లు దక్కాయి. దీంతో భారత్ కు 270 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది.

# 9వేల సర్క్యులర్ల స్థానంలో 238!
## ఆర్బీఐలో కాలం చెల్లిన సర్క్యులర్లకు చెల్లుచీటీ!




**ముంబయి, అక్టోబరు 12:** భారతీయ రిజర్వుబ్యాంకు బ్యాకింగ్ నియంత్రణ చట్టాలు, గతంలో జారీచేసిన సర్క్యులర్లను పునఃపరిశీలించి వాటిని మొత్తం 238 కీలక మార్గదర్శకాలు లేదా సర్క్యులర్లుగా మార్చేందుకు కార్యాచరణ ప్రారంభించింది. ఇప్పటివరకూ ఆర్బీఐ తొమ్మిదివేలకుపైగా సర్క్యులర్లు బ్యాంకులకు జారీచేసింది. అంతేకాకుండా వీటిపర్యవేక్షణ బాధ్యతలు కూడా భారం అవుతున్నాయి, అంతేకాకుండా నిర్వహణ వ్యయం కూడా పెరుగుతుండటంతో మొత్తం 9వేల సర్క్యులర్ల స్థానంలో 238 మాస్టర్ డైరెక్షన్లు లేదా సర్క్యులర్లను కొనసాగించేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం చేపట్టిన ఈకార్యాచరణవల్ల మరింత పారదర్శకత పెరుగుతుందని, కాలంచెల్లిన సర్క్యులర్లను తొలగించి బ్యాంకు నియంత్రణ సామర్థ్యం మరింత పెంచేటట్లుచేస్తుందని అధికారులు చెపుతున్నారు. ప్రస్తుతం ఉన్న 9వేల సర్క్యులర్లను 238 మాస్టర్ డైరెక్షన్లుగా విలీనంచేస్తోంది. మొత్తం 30 ఏరియాల్లో 11 రకాల ప్రభుత్వ నియంత్రిత సంస్థలు వీటికి రూపకల్పనచేస్తున్నాయి. మొత్తం 9 వేల సర్క్యులర్లను రద్దుచేసి వాటిస్థానంలో 238 మాస్టర్ డైరెక్షన్లు అంటే మార్గదర్శకాలను ప్రవేశపెట్టనున్నది. 11 నియంత్రిత సంస్థల్లో వాణిజ్య బ్యాంకులు, చిన్నఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు, స్థానిక ప్రాంత బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు, గ్రామీణ సహకార బ్యాంకులు, అఖిలభారత ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు, అసెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీలు, క్రెడిట్ ఇన్‌ఫర్మేషన్ కంపెనీలు కూడా ఉంటాయి.

రిజర్వుబ్యాంకుల్లోని డిపార్టుమెంట్ ఆఫ్ రెగ్యులేషన్ ఈ విలీనం కొత్తసర్క్యులర్ల జారీ ఏర్పాట్లు పర్యవేక్షిస్తుంది. అంతేకాకుండా ఈ విభాగంలో కొత్తగా రెగ్యులేషన్స్ రివ్యూఅథారిటీనికూడా ఏర్పాటుచేసి చట్టాలు, నియమనిబంధనలు, సర్క్యులర్లు, రిపోర్టింగ్ వ్యవస్థలు వంటివి పర్యవేక్షణచేసేవిధంగా ఆర్బీఐ చర్యలు చేపట్టింది. అథారిటీ ఇప్పటివరకూ 714 సర్క్యులర్లు విత్‌డ్రాచేయవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈవ్యవస్థపై సంబంధిత వ్యవస్థలు, అనుబంధ సంఘాలు అన్నివర్గాలనుంచి అభిప్రాయ సేకరణ జరుపు తోంది. ఇందుకు నవంబరు పదవ తేదీ తుదిగడువుగా నిర్ణయించింది.

# రెండోత్రైమాసికంలో సిమెంట్ కంపెనీల్లో భారీ వృద్ధి!



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** భారత్‌లోని టాప్ ఐదు సిమెంట్ కంపెనీలు ఈసారి రెండోత్రైమాసికంలో పటిష్టమైన ఆర్థికఫలితాలు సాధించే అవకాశం ఉంది. వార్షిక పద్ధతిలోచూసినా, పన్నులు, వడ్డీ, తరుగుదల వంటివి తగ్గించకుండా చూసినా టన్నువారీగా రికార్డుస్థాయి రాబడులు రావచ్చని అంచనా. సుమారు 40నుంచి 70శాతంగా ఉంటుందని అంచనావేస్తున్నారు. వార్షికపద్ధతిలోచూస్తే ఐదుశాతం పెరిగి బస్తాకు 350 నుంచి 365గా ఉండవచ్చన్న అంచనాలున్నాయి. త్రైమాసికం వారీగాచూస్తే రాబడులు డిమాండ్ క్షీణించడంతో కొంతమేర తగ్గవచ్చన్న అంచనాలు కూడా లేకపోలేదు. సిమెంట్‌దరలు ఈసారి రెండుశాతం క్షీణించినట్లు ఎలారా క్యాపిటల్ వెల్లడించింది. సిమెంట్ రంగం పరంగా జెఎం ఫైనాన్షియల్స్ నాలుగునుంచి ఐదుశాతం వృద్ధినమోదుచేస్తుందని అంచనావేసింది. అల్ట్రాటెక్ సిమెంట్, ఇండియా సిమెంట్స్, కేశోరామ్ సిమెంట్స్ అంబుజా సిమెంట్స్ వంటివి వృద్ధికి ఆస్కారం ఉన్న కంపెనీలుగా చెపుతున్నారు. జిఎస్టీ రేట్‌కట్‌కూడా సిమెంట్ ధరలకు కంపెనీల పటిష్టతకు మరింత దోహదంచేస్తుందని అంచనా. 28 శాతంనుంచి 18శాతం శ్లాబులో సిమెంట్‌ను చేర్చారు. అల్ట్రాటెక్‌సిమెంట్ 3276.70 కోట్లు, అంబుజా సిమెంట్స్ 1609.70 కోట్లు, శ్రీసిమెంట్ 982.3 కోట్లు, దాల్మియా భారత్ 715.2కోట్లు, జెకెసిమెంట్ 471 కోట్లుగా రావచ్చన్న అంచనాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణరంగం వేగం పుంజుకుంటే కొంతమేర సిమెంట్ కంపెనీలకు వృద్ధికలుగుతుంది. సిమెంట్ గిరాకీకూడా పెరగవచ్చన్న అంచనాలున్నాయి.

# చక్కెర సీజన్‌లో 7.75 లక్షల టన్నుల ఎగుమతులు!



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** ప్రస్తుత చక్కెర సీజన్‌లో భారత్ 7.75 లక్షల టన్నుల చక్కెరను ఎగుమతి చేయవచ్చని ట్రేడర్లు అంచనావేసారు. చక్కెర తయారీ, ట్రేడర్ల సంఘం ఐస్టా ఎగుమతులపై సర్వేలుచేస్తూ 7.75 లక్షల టన్నుల చక్కెర ఎగుమతి అవుతుందని తెలిపింది. చక్కెర మార్కెటింగ్ సీజన్ అక్టోబరునుంచి సెప్టెంబరువరకూ నడుస్తుంది. చక్కెరెగుమతులు 2024–25 మార్కెటింగ్ సీజన్‌లో ఎగుమతులకు అనుమతులు ఇస్తారు. జనవరి 20 నుంచి అనుమతులిస్తారు. మొత్తం పదిలక్షల టన్నులవరకూ ఎగుమతులుచేసుకునేందుకు కేంద్రం అనుమతిస్తుంది. అఖిలభారత చక్కెర ట్రేడ్ అసోసియేషన్ అంచనాలప్రకారం మిల్లులు ఇప్పటికే 7.75 లక్షల టన్నులు ఎగుమతులు చేసాయని, ఫిబ్రవరి, సెప్టెంబరు మధ్యకాలంలోనే ఈ ఎగుమతులు జరిగినట్లు చెపుతున్నారు. ఈ మొత్తంలో తెల్లచక్కెర ఎగుమతులు 6.13 లక్షల టన్నులు, శుద్ధిచేసిన చక్కెర 1.04 లక్షల టన్నులు, ముడిచక్కెర 33,338 టన్నులు వరకూ ఉందని ఐస్టా వెల్లడించింది. 21 వేల టన్నుల ముడిచక్కెర శుద్ధిచేసేందుకు సెజ్‌లలోకి వెల్లింది. ఈ మొత్తం కూడా ఎగుమతులకోసమేనని సంఘం చెపుతోంది. మొత్తం ఎగుమతులు డిజిబౌటికి 1.46 లక్షలటన్నులు వెళ్లాయి. సోమాలియాకు 1.35 లక్షల టన్నులు, శ్రీలంకకు 1.34 లక్షలు, ఆఫ్ఘనిస్తాన్‌కు 75,333 టన్నులు వెళ్లాయి. ఐస్టా అంచనాల ప్రకారంచక్కెర ఎగుమతులు 2024–25కు 8 లక్షల టన్నులుగా ఉంది. వాస్తవ ఎగుమతులు ఇప్పటివరకూ 7.75 లక్షలటన్నులు అయిందని ఐస్టా వెల్లడించింది. ట్రేడర్ల సంఘం ఇదే ఎగుమతి కోటాను ఈ ఏడాది సీజన్‌కు కూడా అనుమతించాలని అదే కోటా కొనసాగించాలనికేంద్రాన్ని కోరుతోంది. అయితే కేంద్రం దీనిపై సానుకూలంగానే స్పందిస్తుందన్న అంచనాలు కూడా లేకపోలేదు.




# రూ.28 వేల కోట్ల సమీకరణకు ప్రభుత్వ సెక్యూరిటీల వేలం!

**ముంబయి, అక్టోబరు 12:** కేంద్ర ప్రభుత్వం రెండుసార్లు నిర్దిష్టమైనతేదీల్లో బాండ్లను విక్రయించడంద్వారా రూ.28 వేలకోట్లు నిధులు సమీకరించనున్నది. ప్రభుత్వ సెక్యూరిటీలు 2040 నాటికి రెడింప్షన్ అయ్యేవిధంగా 6.68శాతం కూపన్‌రేట్‌తో ఈ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపింది. భారతీయ రిజర్వుబ్యాంకు ఈ సెక్యూరిటీలు వారం వారం వేలం కింద నిర్వహిస్తుంది. 2065 నాటికి రిడింప్షన్ అయ్యే సెక్యూరిటీలకు 6.90శాతం వడ్డీరేటు అందిస్తోంది. 2040 నాటికి 6.68శాతం కూపన్‌రేటు ఇచ్చే మొత్తం రూ.16 వేలు కోట్లుగా ఉంటుంది. కటాఫ్ ప్రైస్ 98.68గా నిర్ణయించింది. దీనివల్ల 6.82శాతం రాబడులు ఉంటాయని అంచనావేసింది. ఇప్పటికే 6,46,598 కోట్లవిలువైన బిడ్లు అందాయి. వాటిలో 15,986 కోట్లకు ఆమోదం తెలిపినట్లు స్పష్టం అయింది. సగటు రాబడులు 6.82 శాతంగా ఉంటాయని అంచనా. ఇక 2065 నాటికి విముకినత పొందే ప్రభుత్వ సెక్యూరిటీలకు 6.90శాతం వడ్డీరేటుగా ఉంటుంది. 11,984 కోట్లవిలువైన బిడ్లను ప్రభుత్వం ఆమోదించింది. మొత్తం 39,166 కోట్లమేర బిడ్లు రాగా కటాఫ్ ధరను 96.53గా నిర్ణయించింది. అంటే పరోక్షంగా 7.17శాతం రాబడులు ఉంటాయని అంచనా. సగటు మొత్తంగా 7.16శాతం ఉంటుందని ఆర్బీఐ అంచనావేసింది.

# బీర్ తయారీ రంగంలో అల్యూమినియం క్యాన్ల కొరత!

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** అల్యూమినియం క్యాన్‌ల సరఫరాలో కొరతవల్ల దేశీయంగా బీర్ తయారీ పరిశ్రమ కొరతను ఎదుర్కొంటున్నది. దీనితో క్వాలిటీ కంట్రోల్ నిబంధనలను కొంతమేర సడలించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తోంది. బీర్ తయారీ పరిశ్రమ సాలీనా 12నుంచి 13 కోట్ల యూనిట్ల కొరతను ఎదుర్కొంటున్నది. 500 ఎంఎల్ క్యాన్‌లు సరఫరాకోసం టెండర్లు వేసినా ఇప్పటికీ అందుకోనిపరిస్థితి నెలకొంది. మొత్తం బీర్‌సేల్స్‌లో అల్యూమినియమ్ క్యాన్‌ల్లో సరఫరా 20శాతం వాటా ఉంది. అంతేకాకుండా ఈ కొరత ఇలాగే కొనసాగితే 1300 కోట్ల రూపాయలు ప్రభుత్వ రాబడుల్లో తగ్గుదల ఉంటుందని బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. బిఐఎస్ నిబంధనలకు అనుగుణంగా ఏప్రిల్ ఒకటవ తేదీ జారీచేసిన క్వాలిటీ కంట్రోల్ ఆర్డరు కారణంగానే సరఫరాలో స్వల్పకాలిక సమస్యలు వచ్చాయని, దీనివల్ల బేవరేజ్ ప్యాకేజింగ్ ఇండస్ట్రీ దేశంలో అల్యూమినియం కొరతను ఎదుర్కొంటున్నట్లు తేలింది. అల్యూమినియం కాన్ సప్లయిర్లలో బాల్ బేవరేజ్ ప్యాకేజింగ్ ఇండియా, కాన్ ప్యాక్ ఇండియా సంస్థలు ఇప్పటికే తమ కోటా పరిమితికి అనుగుణంగా సరఫరాచేసేసామని చెపుతున్నాయి. మరింతగా సరఫరాచేయలేమని చెప్పాయి. మరో ఏడాది పూర్తయితేకానీ సరఫనరాను పెంచలేమని కొత్త ఉత్పత్తి యూనిట్లుప్రారంభం కావాల్సి ఉందని చెప్పాయి. క్వాలిటీ కంట్రోల్ ఆర్డరుతోపాటు బీర్ పరిశ్రమ విదేశీ వెండార్లనుంచి క్యాన్‌లను తెచ్చుకోడానికి వీలులేదు. బిఐఎస్ సర్టిఫికేషన్ కొన్ని నెలలు పడుతోంది దీనివల్ల సరఫఱాలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఉత్పత్తి సంస్థలు చెపుతున్నాయి. ఇటీవలే ఈ కేన్ల కొరతపై యుబి సంస్థ ఎండి సిఇఒ కూడా ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.



అంతేకా కుండా పరిశ్రమల ప్రోత్సాహక మండలి దీపమ్‌కు కూడా లేఖలురాసారు. బ్రూవరీస్ అసోసి యేషన్ ఆఫ్ ఇండియా బాయ్ డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి మాట్లాడుతూ ప్రస్తుతం 55 బ్రూవరీలున్నాయని, వీటిలో 25 వేల కోట్ల వరకూ పెట్టుబడులుఉంటే 27 వేల మందికిపైగా ఉపాధిపొందు తున్నా రని, సరఫరా కొరత ఉంటే తాత్కాలికగా ఉత్పత్తినిలిపి వేయాల్సి ఉంటుందని, పరోక్షంగా రైతులు, అను బంధ యూనిట్లపైనా పడుతుందని చెప్పారు. అల్యూమినియమ్ కేన్ల తయారీ విస్తరణ కనీసం ఏడాదిపడుతుందని ఈలోపు విదేశీ కేన్లను దిగుమతిచేసు కునేందుకు కేంద్రం అనుమతించాలని చెపుతున్నారు. ఇదేతీరుకొనసాగితే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు సుమారు రూ.1200నుంచి రూ.1300కోట్లు పన్నులరూపంలో గండిపడుతుందని గుర్తుచేసారు. వ్యవసాయం, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్, రిటైల్ రంగాల పైనా ఈకొరత ప్రభావం ఉంటుందని అందువల్ల ప్రభుత్వం సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని వారుకోరుతున్నారు.

# వచ్చే ఐదేళ్లకాలానికి ఎస్‌బిఐ కార్యాచరణ



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్‌బ్యాంకు తన ఉద్యోగుల్లో కనీసం 30శాతం వరకూ మహిళా ఉద్యోగులు ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నది. వచ్చే ఐదేళ్లలో మహిళా వర్క్‌ఫోర్స్ కనీసం 30శాతానికి తగ్గకుండా చూడాలని చూస్తోంది. ఫ్రంట్‌లైన్ స్టాఫ్ పరంగా 33శాతం వరకూ ఉన్నారు. అదే మొత్తంగాచూస్తే 27శాతం మాత్రమే ఉంది. అందువల్లనే లింగసమానత్వం సాధించేదిశగా బ్యాంకుపరంగా వచ్చే ఐదేళ్లలో 30శాతం మంది మహిళా ఉద్యోగులుండేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటి ఎండి కిశోర్‌కుమార్ పోలుదాసు వెల్లడించారు. బ్యాంకు మధ్యంతర లక్ష్యంగా 30శాతం వర్క్‌ఫోర్స్ మహిళలు ఉండాలన్న లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. ఎస్‌బిఐలో ఇప్పటివరకూ మొత్తం 2.4 లక్షలమంది ఉద్యోగులుపనిచేస్తున్నారు. ప్రభుత్వబ్యాంకింగ్ రంగంలో అత్యధిక సంఖ్యలోపనిచేస్తున్నది ఎస్‌బిఐలోనే అని చెప్పవచ్చు. అన్ని స్థాయిల్లోను కూడా మహిళా వర్క్‌ఫోర్స్ ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంకు ఇప్పటికే వర్కింగ్ తల్లులకోసం క్రెచ్ అలవెన్స్‌కూడా ఇస్తోందని, ఫ్యామిలీ కనెక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులకు సాయం అందించేందుకు శిక్షణకూడా కొనసాగుతోందని చెప్పారు. బ్రెస్ట్ క్యాన్సర్; సర్వికల్ కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు పూర్తిచేసామని, న్యూట్రిషన్ అలవెన్సు కూడా ఇస్తున్నట్లు తెలిపారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.